
# పరిచయము

'ఆత్మీయ స్వస్థత' అను ఈ పుస్తకము ప్రతి ఒక్కరి అంతరంగ పరివర్తన మరియు పరిపూర్ణత కొరకు ఉద్దేశించబడినది. యోహాను సువార్తలో ప్రభువు– 'ఆత్మయే జీవింప జేయుచున్నది.... నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు, జీవమునై యున్నవి' (యోహాను 6:63) అని చెప్పుటద్వారా ఆత్మీయ జీవనముయొక్క ప్రాముఖ్యతను తెలియజేసిరి. యేసు ప్రభువు మాటలు మనుష్యులకు శరీరాత్మీయ స్వస్థతను కలిగించినవి. ఆలాగే రెండవ రాకడకు సమీపముగా ఉన్న మన ఆత్మలకును స్వస్థత కావలెను అనగా పాప, శాప దుస్థితులనుండి మేల్కొని, సదాచారములను పాటించి, ధ్యానవృద్ధి చేసికొని, సంపూర్ణ ప్రేమ పతకము ధరించి, పాప నైజమును నిర్మూలము చేసికొను స్వస్థత కావలెను. అపోస్తలుడైన పౌలు, మన అంతరంగ పురుషుడు దినదినము నూతన పరచబడుచుండవలెననియు; ఆత్మను అనుసరించి మనము క్రమముగా నడుచు కొనవలెననియు వ్రాయుచున్నారు. గనుక శరీర సంబంధమైన స్థితిని జయించుటకును, ఆత్మలో క్రమముగా జీవించుటకును మనకు ఆత్మీయ స్వస్థత అవసరము. ఏ స్థితిలో ఉన్న మానవుడైనను, పరిపూర్ణమైన ఆత్మీయ జీవనమును చేరుకొనుటకు ఎక్కవలసిన వివిధ అంతస్థులను దైవజనులైన యం. దేవదాసు అయ్యగారు ఈ క్రింది సూచికలో తెలియజేసిరి.




నామకార్థ జీవియైన మానవునకు, ఆ నామకార్థ స్థితిని విసర్జించే స్వస్థత కావలెను. దుస్థితినుండి బయటకు వచ్చిన మానవుడు క్రైస్తవ సంఘజీవియై,

Bible Mission HQ Guntur

సంఘ క్రమములను ఆచరించు స్వస్థత పొందవలెను. ఆ పిదప ఉజ్జీవ జీవనములో ప్రవేశించి, ఆత్మోద్రేకమును అందుకొని ధ్యానపరునిగా మారుటకు కావల్సిన స్వస్థతను పొందవలెను. ఈలాగు ధ్యానపరునిగా మారిన విశ్వాసి ప్రభుని సహవాసమువలన కలిగే దైవ ప్రత్యక్షత సంపాదించుకొని ప్రత్యక్షజీవిగా మారవలెను. ప్రత్యక్షతలలో పరిపూర్ణుడైన విశ్వాసి, తన శరీరాత్మలను క్రీస్తు సారూప్యములోనికి మార్చుకొనుటకు అనగా నైజ పాపమును సంపూర్ణముగా జయించుటకు కావల్సిన స్వస్థతను పొంది, మహిమనుండి అధిక మహిమకు వెళ్ళును. అప్పుడు పరలోక మహిమలో స్థిరపడు పరిపూర్ణమైన ఆత్మీయ స్వస్థత దొరుకును.

బైబిలు మిషను 7వ అధ్యక్షులైన రెవ. డా॥ జె. జాన్ సెల్వరాజు అయ్యగారు దైవజనుని వ్రాతలను సేకరించి, వాటిని వెల్లడిలోనికి తెచ్చి ఈ గొప్ప కార్యక్రమమునకు పునాది వేసిరి గనుక వారికి మా నిండు కృతజ్ఞతలు తెలియజేయుచున్నాము. దైవజనుని అనుంగు శిష్యులైన రెవ. యస్. సమూయేలు అయ్యగారు దైవజనుని దగ్గర వ్రాసుకొనిన నోట్సులను వారి కుమారులైన రెవ. యస్. అహరోను కుమార్ గారు బైబిలు మిషను ఆఫీసుకు అందజేయుట ద్వారా మరుగైయున్న దైవజనుని బోధలను అచ్చువేయుటకు వీలు కలిగినది. వారికి మా నిండు కృతజ్ఞతలు. దైవజనుని శిష్యులలో ఒకరైన శ్రీ బోగిరి భూషణం అయ్యగారు వ్రాయించుకొనిన నోట్సులను భద్రపరచి, సమయమునకు అందజేసిన శ్రీ బులిరెడ్డి దంపతులకును మా కృతజ్ఞతలు. ఆలాగుననే దైవజనుని చివరి దినములలో ఆయనకు పరిచర్యచేసి, వారి ఉపదేశములను వ్రాసికొని, వాటిని మాకు అందజేసిన శ్రీమతి మెట్టి అన్నమ్మగారికిని మా నిండు వందనములు. ప్రభువు వీరిని బహుగా దీవించును గాక! ఆమేన్.

దైవజనులైన యం. దేవదాసు అయ్యగారు ఉపదేశించిన బోధలను, ప్రచురించిన కరపత్రములను, ఈ పుస్తకములో మీకు అందించుచున్నాము. అంతరంగ దృష్టితో ఈ గ్రంథమును పఠించువారు, ఈ క్రమములో తెలియజేయబడిన అన్నీ అనుభవములను సంపాదించుకొని, రాకడ మేఘమెక్కగలరు, మహిమ జీవనములో వర్ధిల్లగలరు.

చదువరులందరూ అట్టిస్థితిని అందుకొనుటకు పెండ్లికుమారుడైన యేసుప్రభువు తన ప్రత్యేక కృపను చూపించును గాక! ఆమేన్.

**ఇట్లు**
**త్వరగా రానైయున్న ప్రభువునందు**
**రెవ. డా॥ ఎ. జాన్,**
**ప్రసిడెంట్, బైబిలు మిషను.**

**బేతేలు గృహము, రైలుపేట,**
**గుంటూరు - 522 001.**

# బైబిలు అద్దము

బైబిలు అనగా పుస్తకమని అర్థము. అనగా లోకములోని గ్రంథములన్నిటిలో గొప్ప గ్రంథమని అర్థమిచ్చు బిబ్లొస్ అను గ్రీకు పదమునుండి 'బైబిలు' అను పేరు వచ్చినది. ఇది దైవాత్మ ప్రేరణవలన వ్రాయబడిన గ్రంథము గనుక అన్ని గ్రంథములకంటె ఇది గొప్ప గ్రంథమని, 'బైబిలు' అనుపేరులోనే తెలియుచున్నది. ఆదియందు దేవుడు సృష్టిని, మానవులను, లోకములోని సమస్తమును ఎట్లు సృజించెనో, ఆ పిమ్మట మానవునిలోనికి పాపము ఎట్లు ప్రవేశించెనో, పాపమునుండి నరులను రక్షించుటకు, దేవుడు ఎట్లు వాగ్ధానము వినిపించెనో, దానిని నెరవేర్చుటకు దేవుడు తన పనినెట్లు చేయుచు వచ్చెనో, ఇది పాపము, ఇది పవిత్రము అని ఎట్లు బోధించెనో, పాపము ఎట్లు వదిలించు కొనవలెనో, దేవుడిచ్చునవి ఎట్లు పుచ్చుకొనవలెనో, బైబిలు చెప్పుచున్నది.

మన పాపములు ఏ రీతిని పరిహరింపబడునో బైబిలులో నున్నది. పాపములను జయించు శక్తి ఏలాగు పొందగలమో బైబిలులో వివరించబడినది. దేవునిని ఏలాగు నమ్మవలెనో, నీతిగా ఎట్లు నడచుకొనవచ్చునో, పాపకారకుడైన సాతానును ఏలాగు ఓడించగలమో బైబిలు తెలియ జేయుచున్నది. గనుక ఈ బైబిలు గ్రంథమును అద్దము అనవచ్చును. అద్దము ఏరీతిని మానవుని బహిరంగ స్థితిని చూపించునో, ఆలాగుననే బైబిలు అనే అద్దముకూడ మానవుని అంతరంగ స్థితిని చక్కగా చూపించుచుండును. ఈ బైబిలు అద్దమును చూచి మానవుడు తన బ్రతుకును సరిచేసికొన్నచో మోక్షరాజ్యములో ప్రవేశించి, మహిమ జీవనమునకు వారసుడగును. ఈలాగున మానవుడు తన్నుతాను దిద్దుకొనుటకు, ఈ బైబిలు అద్దము చూపించుచున్న కొన్ని సంగతులు:

1. *దేవునికి విరోధమైన తప్పిదములు:* దేవుని విషయములో తప్పు అభిప్రాయములు కలిగియుండుట, దేవునిమీద విసుగుకొనుట మొదలైనవి.

2. *నీకు విరోధమైన తప్పిదములు:* అనగా శరీరమునకు, ఆత్మ జీవనమునకు, శరీర జీవమునకు హాని తెచ్చు తప్పిదములు.

3. *దేవదూతలకు విరోధమైన తప్పిదములు:* అనగా దేవదూతల సహాయము నాకేమి కనబడుట లేదనుకొనుట.

4. *నరులకు విరోధములైన తప్పిదములు:* శత్రువులను ప్రేమింపకుండుట, వారికొరకు ప్రార్థింపకుండుట.

5. జీవరాసులకు విరోధములైన తప్పిదములు: జీవరాసులను నిర్దయగా చూచుట.

6. *వస్తువులకు విరోధములైన తప్పిదములు:* అనగా సామానులను, సరుకులను దుర్వినియోగపరచునట్టి తప్పిదములు.

7. తలంపు, చూపు, వినికి, మాట, ప్రయత్నము, క్రియ, స్వప్నములలోని కళంకము.

8. *ధర్మగుణము లేకుండుట:* అనగా బీదలను కనిపెట్టకుండుట, వారు సహాయము కోరునప్పుడు ఇయ్యకపోవుట, ధర్మకార్యములకు చందాలియ్యక పోవుట.

9. *సోమరి తనము:* అనగా కష్టపడి పనిచేయని గుణము, పనిచేయవలసి వచ్చినను బద్ధకించుట, ఒకరిపాటు మీద బ్రతుకవలెనని చూచుట.

10. జబ్బుచేసినపుడు బాగుచేసికొనక నిర్లక్ష్యముగా నుండుట, కోపగించి గాని, నిరాశవలన గాని తిండి మానుట, చావు త్వరగా వస్తే బాగుండును అని తలంచుట, శరీరము శుద్ధిగా నుంచుకొనకుండుట, అపవిత్ర జీవనము వలన అకాల మరణమొందుట.

11. *భార్య భర్తలలో సమాధానము లేకుండుట:* మనస్పర్ధలకు సందున్నను సఖ్యత లేకుండుట, క్షమించు నైజము లేకుండుట, యౌవ్వనకాల అపవిత్రత కలిగియుండుట.

12. *అబద్ధమాడుట:* అనగా అబద్ధమును నిజమును కలిపి చెప్పుట. పంచాయితీలలో, కోర్టులలో అబద్ధ సాక్ష్యము పలుకుట.

13. *ద్వంద్వార్ధములు:* అనగా మోసము చేయవలెనని, అబద్ధమాడవలెనని, రెండు అర్ధములు ఇచ్చే మాటలు మాట్లాడుట.

14. అప్పులు తీర్చెదనని జరుపుట, తీర్చకుండుట

15. *అసూయ:* అనగా నీకంటె ఎక్కువ కలిమిగల వారిని, గొప్ప ఉద్యోగములు గలవారిని, నీకులేని వరములు గలవారిని చూచి మనస్సులో కష్టము కలిగియుండుట.

16. లేనిపోని ఊహలు, అనవసరమైన తలంపులు.

17. *దురాశ:* అనగా ఒకరి ఆస్థిలో దేనినైనను ఆశించుట.

18. *సందేహము:* అనగా అవిశ్వాసము, వెనుకాడుట, అది నిజమా అనుకొనుట, అనగా మోక్షము, నరకములు ఉండుట నిజమా అనుకొని, సందేహము కలిగియుండుట.

19. *అనిశ్చయము:* బైబిలులోని సంగతులు అందరు అన్ని విధములుగా బోధించు చున్నందున, ఎవరిబోధ నిజమో నిశ్చయము తెలియని స్థితి కలిగియుండుట.

20. *అతిశయము:* గర్వము, బడాయి, గొప్పతనము కోరుకొనుట, నరుల మెప్పుకోరుట.

Bible Mission HQ Guntur

21. *భయము:* అనగా దిగులు, బెదురు. పాము, జెట్టి, పులి, హానిచేసే మనిషి, విరోధముగా మాట్లాడే మనిషి తారసిల్లినపుడెల్ల జంకుట, భయపడుట; చెడుకలలు తప్పుడు దర్శనములు, నింద మాటలు వచ్చినప్పుడు భయపడుట; దుశ్శకునములు, సోదె చెప్పువారిమాటలు, మంత్రగాండ్ర మాటలు శపించు వారి మాటలు మొదలైనవి విని భయము కలిగియుండుట.

22. *చింత:* అది నెరవేరలేదు. ఇది నెరవేరలేదు అనే చింత.

23. *అధైర్యము:* అనగా నిరాశ.

24. *పేద అరుపులు:* అదిలేదు, ఇదిలేదు అని; దానికి కొరత, దీనికి కొరత అని అనుకొనుట; తృప్తి లేకపోవుట.

25. *నిష్కారణ కోపము:* చిరచిరలాడుట, కారణము లేకుండా కోపపడుట.

26. *మందస్థితి కలిగియుండుట:* మతబోధ విన్నప్పుడు పాపస్థితిని తెలిసికొనియు నిర్లక్ష్యముగా నుండుట; పాపమువలన కష్టములు, మరణము, నరకము అని విన్నప్పటికిని లెక్కలేకుండా ఉండుట; ఎన్ని బోధలు విన్న మారకుండుట; మోక్షములో మహిమయున్నదని వినినను ఆశలేకుండుట.

27. *కృపను లోకువగట్టుట:* అనగా ఎన్ని తప్పులు చేసినను, దేవుడు క్షమించునుగదా అని అనుకొని విచ్చలవిడిగా తిరుగుట.

28. నెరవేర్చవలసిన విధులను నెరవేర్చకుండుట.

29. పొందిన మేలును గుర్తెరిగియు, ఉపకారులను మరచుట; దేవుని యెడల కృతజ్ఞత లేకుండుట.

30 *మర్యాద చేయకపోవుట:* మనకంటె పెద్దవారై యున్నవారిని గౌరవముగా చూడకుండుట, సంఘాధికారులను మన్నన చేయకుండుట (చేయలేకపోవుట).

ఈలాగున, పై బలహీనతలన్నిటినీ ఈ బైబిలు అద్దములో చూచుకొని, సరిచేసికొని, మహిమ జీవనములో స్థిరపడు ధన్యత పెండ్లికుమారుడైన క్రీస్తు ప్రభువు మీకు దయచేయునుగాక! ఆమేన్.

# 4

# నామకార్ధము అనే పాపము

నామకార్ధముగా చేయుట అనగా ఒకరు చేయుచున్నారని మనమును చేయుటయే. తప్పదు గనుక చేయవలెనని చేయుటయే, చేయకపోతే ఇతరులేమైన అనుకొందురేమో అని చేయుటయే. మరియు చేయకపోయిన యెడల ఎక్కడ కీడు సంభవించునో అని చేదస్తము కలిగి చేయుటయే. ఇదంతయు కలిపి నామకార్ధమని చెప్పబడును. ***ఈ నామకము అనేది మన ప్రయాసమును, పాటును, సమయమును వృధా చేయునదై యున్నది.*** గనుక మెళకువగా యుండవలెను. నామకార్ధముగా చేయుట అనే పాపము నేడు భూలోక క్రైస్తవ సంఘములో యున్నది. ఇది ఒక అపాయము, గొప్ప గండము, గొప్ప పాపశోధన, మనుష్యులు *గుర్తుపట్ట*లేని మాయ, అనుకొనని నేరము గనుక అందరు ప్రతి దినము ఈ విషయములో జాగ్రత్తగా యుండవలెను. దీనివల్ల కలిగే ఒక నష్టము ఏదనగా మనలో ఉండే ఇతరమైన చెడుగు మనలను విడిచిపెట్టదు. మరియొక నష్టమేదనగా, ఇది ఒక చెడుగును తెచ్చిపెట్టును; అనగా ఒక విషయములో ఉండే ఈ నామకము మరియొక విషయములో కూడ నామకార్ధముగా ఉండునట్లు చేయును అనగా మరొక నామకమును తెచ్చిపెట్టును.

***నాలుగు అనుభవ దృష్టాంతములు:***

**1)** మొదటి అనుభవ దృష్టాంతము:- ఒక అంశమును గురించి ప్రార్ధన ప్రారంభించి-నపుడు, వాడుక చొప్పున ప్రార్ధనలోని అలవాటు మాటలు బహుధారాళముగా వచ్చును. ఇవే అపాయకరమైన మాటలు. మాటలు మంచివేగాని వాటిలో నామకార్ధము చేరియున్నందున అవి వృధా మాటలైనవి. కాబట్టి నామకార్ధ మనేది పోయి, యదార్ధమనునది వచ్చువరకు, ప్రార్ధన చేయకుండ కొన్ని నిమిషములు కండ్లు మూసుకొని నిశ్శబ్దముగా ఉండి, ప్రభువు తలంపు మీదనే నిలువవలెను. అంతలో నామకార్ధ మేఘములు గతించిపోవును, ప్రార్ధనవాలు ప్రవాహముగ వచ్చును. అప్పుడు మనసులో ఎడతెరిపిలేని ఆనంద సంతోషములు ప్రవాహముగా పైకి వచ్చుచూ యుండును. అప్పుడు నీ ప్రార్ధన నిజమైన ప్రార్ధనయని గ్రహించుకొనవచ్చును. నీవు నీ పాపములు ఒప్పుకొని ప్రార్ధన చేసినయెడల, ఆలాగు చేయగా చేయగా, నామకార్ధ మేఘములు పూర్తిగా విడిపోవును. అంతలో మనోవేదన, కన్నీళ్ళు, వడలు (శరీరము) వణకుట, మూలుగుట, అయ్యో! నేనెంత పాపిని! అనే మాట వచ్చుట, తండ్రీ! నన్ను క్షమించుము! అనే మనవి బయలు వెడలుట; ఈ మొదలైనవి కలుగును గనుక ఇది యదార్ధమైన పాపపు టొప్పుదల ప్రార్ధన యని గ్రహించుకొనుము. మరియొక సంగతి జ్ఞాపక ముంచుకొనుము: నామకార్ధ ప్రార్ధనలన్నియు, వెళ్ళితే ఇంటి కప్పువరకే వెళ్ళును. అయితే యధార్ధమైన ప్రార్ధనలు నీ హృదయములో నుండి బయలుదేరి, నీ శరీరమును దాటి, నీ ఇంటి కప్పును దాటి, అక్కడనుండి మేఘములో చొరబడి, ఆ తరువాత నక్షత్ర మండలమును దాటిపోయి, పరలోకము చేరి సింహాసనము మీద కూర్చున్న దేవుని యొక్క పాదములమీద పడిపోవును. దీనికి ఎంత చొరవ, ఎంత ధైర్యము, ఎంత చురుకుదనము, ఎంత వేగము, ఎంత ఆటంకమును జయించే

కత్తివాటము ఉన్నదోగదా! ఓ చదువరీ! ఇది నేర్చుకొనుము, అలవాటు చేసికొనుము. ఇది వచ్చేవరకూ మోకాళ్ళమీద నుండుము. అట్లున్నచో, నీ సమయము వృధాకాదు.

**2)** రెండవ అనుభవ దృష్టాంతము:- నీవు బైబిలు చదువుకొనునప్పుడు నీకు చప్పగా యుండును, వినోదముగా నుండదు, ఉపయోగముగా నుండదు, మామూలు కథవలె యుండును. నిన్ను ఆదరించే ఒకవార్త అందులో నీకు కనబడదు. కారణ మేమనగా నామకార్ధ మనేది నీలోయున్నది. ఇదే కారణము గనుక ముందు, 'దేవా! ఈ నామకార్ధ శోధనను నాలోనుండి తీసివేయుము' అని ప్రార్ధించుము. అప్పుడు చదివి చూడుము. ఆ బైబిలుకథ నీకు ఒకదరి నుంచి బాగుగా తెలియుచుండును, అర్ధమగుచుండును. ఇది నా కొరకు, నాకు తగిలి వచ్చేటట్టు వ్రాయబడిన కథ అని తట్టును. అక్కడ నుండి మహా ఆనందము కలుగును, విచారమనునది ఉండనే ఉండదు. మందము, అజ్ఞానము, చప్పనితనము పూర్తిగా అంతరించి పోవును. మరియు ఒక కథ మీద నీకు, వ్యాఖ్యానములలోని క్రొత్త క్రొత్త తలంపులు పుట్టుచుండును. నీవు ఎంత ధన్యుడవు! మరియు బైబిలు నీ కంటికి ఒక క్రొత్త పుస్తకముగా కనిపించును. బైబిలు చదువకపోతే మార్కులు రావు అనే తలంపుతో చదివే వారికి మాత్రము, బైబిలు వినోద గ్రంథంగా కాక కేవలము కఠిన గ్రంథముగాను, నిర్దయా గ్రంథము గాను, ద్వేషించు గ్రంథముగాను కనబడును. గనుక ఎంత జాగ్రత్తగాయుంటే అంత మంచిది. అంతే కాకుండా బైబిలు ప్రతిదినము చదివే పుస్తకము గనుక బైబిలు పఠన, చాలా మామూలై పోవును. కాబట్టి క్రొత్తగా కొనుకొన్న పుస్తకము మీదనున్న గౌరవము యుండదు. ఇది ఒక గొప్ప అపాయము. బైబిలు దేవుని గ్రంథము గనుక మనము లోకములోయున్న గ్రంథములన్నింటికంటే దీనిని గౌరవముగా ఎంచవలెను. ఎంచలేకపోతే నీలో నామకార్ధము అనే బలహీనత యున్నదని గ్రహించు కొనుము. మహమ్మదీయులు, తమ ఖురాను గ్రంథమును రుమాలు క్రింద పరచి, దానిమీద వేసి చదువుకొందురు. ఖురానును ఎక్కడబడితే అక్కడ పెట్టరు, ఎవరికి బడితే వారికి ఇవ్వరు. వీరి మాదిరి మంచి మాదిరి. ఒకరిలో భక్తి యుండవచ్చును గాని అట్టి భక్తిని వాడుకొనేటందుకు, తగినంత తర్ఫీదు వారిలో లేకపోవచ్చును. ఒకరి చేతిలో బైబిలు యున్నది. అనగా అతనిలో భక్తియున్నది గనుకనే అతను బైబిలు సంపాదించుకొనెను. కాని దానిని ఎక్కడబడితే అక్కడ వేస్తే, కవరు వేయకుండా మాపివేస్తే దీని యర్ధమేమి? భక్తికి తోడు శిక్షణలేదు అనగా తర్ఫీదులేదు. బైబిలును వట్టి కాగితములే అనియు, దానిలోని సంగతిని గౌరవించు చున్నాను కదా అనియు నిర్లక్ష్యముగా వాడేవారు అజ్ఞానమువల్ల, అజాగ్రత్త స్వభావము వల్ల అట్లు చేయుదురు. గనుక అట్టి అజ్ఞానమును తొలగించు కొనుట క్షేమము. ఎందుకంటే బైబిలును కండ్లకు అద్దుకొనేవారికి అది ఎంతో అభ్యంతరము. వారి భక్తికి భంగము గనుక ఇట్టి చేష్టలు మానవలెను.

**3.** మూడవ అనుభవ దృష్టాంతము:- 'రేపు గుడిలో నా ప్రసంగము, ఇంకొక వారము అయితే బాగుండును, తప్పదు గనుక సిద్ధపడెదను' అని చెప్పి, ఒక బోధకుడు వ్యాఖ్యానములు చదివి, నోట్సు వ్రాసికొని మంచి ప్రసంగమే సిద్ధము చేసి, గుడిలో చెప్పివేసి మ్రొక్కుబడి తీర్చుకొన్నాడు. ఇది నామకార్ధ ప్రసంగము. దీనిలో దైవాత్మ సహాయములేదు, కేవలము మనుష్య ప్రయత్నమే

యున్నది. ఇది కూడదు. ఇదికూడ ఒక గొప్ప శోధనయై యున్నది. ***ఓ బోధకుడా! ఈ శోధన తప్పించుకొనుటకై కొన్ని నిమిషములు మోకాళ్ళమీద నుండుము***. అప్పుడు నీ నోట్సు వెలిగించబడును. నీ వ్యాఖ్యాన సంగతులు ఉపయోగము లోనికి వచ్చును. మరియు నీవు ప్రసంగించునప్పుడు, నీవు సిద్ధపరచుకొనియుండని క్రొత్త తలంపులు, నీకు ఆశ్చర్యము కలిగించునట్లు వచ్చును. ఇతరులు మెచ్చు కొందురనియు, ఖండిస్తే మంచిపేరు పోవుననియు, తలంచు బోధకుడు కూడా నామకార్థ బోధకుడై యున్నాడు. నామకార్థ జీవులపేర్లు జీవగ్రంథమందు యుండవు.

**4.** నాలుగవ అనుభవ దృష్టాంతము:- నేను చందా వేయకపోతే ఎవరైనా ఏమైనా అనుకొందురు అనియు, ఎక్కువ చందావేయుట చూచి అధికారులు మెచ్చుకొందురని చందా వేయువాడు కూడ నామకార్థ శోధన కలవాడే. అతడు ఎంతగొప్ప చందా వేసినను పేరు లేదు. షరా: పరిసయ్యుడు ఉపవాసము చేసెను, చందా ఇచ్చెను, ప్రార్థన చేసెను గాని మెప్పు రాలేదు. ఆచారమును బట్టి చేసినందువల్ల అతడు నీతిమంతుడని తీర్చబడలేదు. అయితే ఏమియు చేయక పోయినను లేక చేయలేక పోయినను, 'దేవా! పాపినైన నన్ను కరుణించుము' అనే ప్రార్థన చేసినందువల్ల, సుంకరి నీతిమంతుడుగా తీర్చబడెను (లూకా 18:10-14). పరిసయ్యులందరిలో, శాస్త్రులందరిలో ఈ నామకార్థమైన ఆచార భక్తి ఉండి, యదార్థమైన భక్తిలేనందువల్ల ప్రభువు వారిని గద్దించెనని మత్తయి 23వ అధ్యాయములో యున్నది. అన్ని అంశములలోను 'నేను ఉన్నాను' అని అనిపించు కొనుటకై, అపవాది ప్రవేశించును గనుక మెళుకువగా నుండవలెను. ప్రతి మంచి కార్యమును చెడగొట్టుట అతనియొక్క ఉద్యోగము. ***అతని ఉద్యోగము చెడగొట్టుట మన ఉద్యోగమై యున్నది.***

*నామకార్థమనే దానిమీద 4 ప్రశ్నలు:*

**1. ప్రశ్న:** ఉదయమున లేచుటతోనే, వాడుకచొప్పున బైబిలు చదువుట తప్పా?

**జవాబు:** తీర్పు చేయుట నా పనికాదు. అయినను ఒక మాట చెప్పవలెను. భక్తి ఉన్నా లేకపోయినా, పాపివైనా, ఇష్టమున్నా లేకపోయినా, అర్థము తెలిసినా తెలియక పోయినా; నేను మంచి ఉద్దేశముతో చదవమన్నాను గనుక నీవు ఆలాగు చదివిన యెడల అది నామకార్థమై యుండదు. ఎందుకనిన నేను మంచి ఉద్దేశముతో చెప్పితిని గనుకను, ఆ ఉద్దేశ ప్రకారముగా నీవు చదువుచున్నావు గనుకను, ఈ రెంటిని బట్టి (Ray of hope for Repentance) మారుమనస్సు పొందు నిరీక్షణ నీకు గలదు గనుక దీనిని నామకార్థములో చేర్చకూడదు. నామకార్థమనేది ఒకవేళ నిరీక్షణ చుట్టూ (Ray of hope) యుండవచ్చునేమో గాని నీవు బైబిలు చదువగా చదువగా, ఆ కిరణము వెనుక ఒకటి, రెండు, వెయ్యి కిరణములు వచ్చును. తరువాత నామకార్థ మేఘము పూర్తిగా అంతరించి పోవును. ఏలీయా కర్మెలు కొండమీద

ప్రార్ధన చేసినప్పుడు, అరచేయి అంత మేఘము మాత్రమే కనబడెను. అప్పుడతడు రాజును పంపివేయగా వారు పారిపోయిరి. ఎందుకంటే గొప్ప వర్షము వచ్చునని గ్రహించుకొన్నారు. వారు పారిపోవుచుండగా ఆకాశమంతయును మేఘములు కమ్మివేసెను. మేఘములు వర్షమును కుమ్మరించెను. నేల తడియున్నట్లు దిమ్మరించెను. అరచేయి అంత మేఘము (Ray of hope), నిరీక్షణ కిరణము వంటిది గనుక కొంచెము మంచి అభిప్రాయముంటే చాలును. ఆరంభించుము, రాగారాగా అదే వృద్ధి యగును. నిరాశ పడకుండా యుంటే వృద్ధికాక మానదు. పూర్ణమైన నిరీక్షణ లేకపోయినను పరవాలేదు. రవ్వంత నిరీక్షణే చాలును. చిన్న అగ్గినెరుసు (నిప్పురవ్వ) ఒక గ్రామమును తగులబెట్ట గలదు, అరణ్యమును కాల్చి వేయగలదు. చెత్తగాను, బూడిదగాను చేయగలదు గనుక నీలోయున్న (Ray of hope) నిరీక్షణ కిరణముతో పని ఆరంభించుము. ప్రభువు నీకు తోడుగా నుండును.

**2. ప్రశ్న:** నామకార్ధమనేది చివరివరకును ఉండునా?

**జవాబు: *ఉండును.*** ప్రార్ధన ఆరంభించునప్పుడు ఉండును, తరువాత పోవును, మరల తొంగిచూచును. నీ మంచి ప్రార్ధనవిని పారిపోవును. తరువాత ప్రవేశించును. నీ మంచి ప్రార్ధన ఆలకించలేక, చివరకు సహించలేక అంతర్ధానమై పోవును.

**3. ప్రశ్న:** జీవిత కాలమంతయు ఉండునా?

**జవాబు:** ఉండును, అయినను భయపడనక్కరలేదు. ***జీవితకాల మంతయు మనలో యదార్ధత అనేదియుంటే, నామకము అనేది శక్తిలేనిదై పడియుండునే గాని హానిచేయ వీలులేదు.*** ప్రభువునందు విశ్వాసము నీకు కలిగియున్నంత కాలము అపవాదికైనను, అతని శక్తికైనను శక్తి యుండదు.

**4. ప్రశ్న:** ఈ విషయములో విశ్వాసమనగా ఏమి?

**జవాబు:** యేసు ప్రభువు నామకార్ధమనే దానిని జయించినాడు గనుక నేను కూడ జయించుటకు శక్తి ఇస్తాడు అనేదే విశ్వాసము.

ఇట్టి విశ్వాసముతో, చదువరులు నామకార్ధ పాపముపై జయము పొందుదురు గాక!

# నైజపాపము

నైజపాపము అనగా తలంపులోని పాపము అని చెప్పవచ్చును. ఒక చెడు తలంపు మనస్సులోనికి ప్రవేశించినపుడు, దానిని వెంటనే గెంటివేయనిచో, అది బలపడి నైజముగా తయారగును. దానిని పాపనైజముగా భావించవచ్చును. మానవ నైజములో ఉన్న పాపపు తలంపు, ముందుగా మనస్సును లొంగదీసుకొని, ఆ తర్వాత నెమ్మదిగా శరీరమును కూడ లోపరచుకొనుచుండును. అప్పుడు ఆ నైజపాపము క్రియారూపకముగా బహిర్గతమగుచుండును. చెడు తలంపు మనస్సులో ఉన్నప్పుడు అది నైజముగాను, ఆ తలంపు క్రియలోనికి వచ్చినపుడు అది బహిరంగ పాపముగాను గ్రహించుకొనవచ్చును. బహిరంగ పాపమును అనగా క్రియా పాపమును జయించుట సులువే గాని ఈ మనో పాపమును అనగా నైజపాపమును జయించుటకు బహుగా ప్రయాస పడవలెను. పాపపు పుండు మానినా, పాప నైజము అను మచ్చ మాత్రము మానదు. ఈ నైజపాపము మానవుని ఆత్మను పట్టి దాని జీవమును పీల్చి వేయుచుండును. గనుక దర్శన బోజనము అనగా ప్రభువే స్వయముగా అందించు ఆయన శరీర రక్తములను భుజించి, దీనిని పరిపూర్ణముగా పెరికి వేసికొనవలెను. ఈ క్రింది అంశములు నైజ పాపముయొక్క వివిధ స్థితిగతులను మరింతగా విపులీకరించును.

1. నైజపాపము యున్నప్పుడు మోక్షమునకు వెళ్ళవచ్చునా? తప్పు నుండి తప్పుకొంటే మోక్షమునకు వెళ్ళవచ్చును.
2. యేసు ప్రభువు ఎప్పుడును జంకలేదు. మనము అనేక మారులు భయపడు చున్నాము. అదే నైజపాపము.
3. గుడిలో పాదిరిగారు ఇచ్చే సంస్కార భోజనము వలన పాప పరిహారము కలుగుచున్నది, శరీరాత్మలకు మేలు కలుగుచున్నది. అయినప్పటికినీ నైజము, పాపనైజము ఉండి పోవును. అందుచేతనే బయటికి వచ్చినప్పుడు ఏదో ఒక కాని తలంపు జ్ఞాపకమునకు వచ్చును లేదా పరిహారమైన పాపమే జ్ఞాపకము వచ్చును. అదే నైజపాపము.
4. ప్రార్థన నెరవేరనప్పుడు గాని, ఆలస్యముగా నెరవేరినా గాని, దేవుడు నా ప్రార్థన ఆలకించలేదు అని మనసులో అనుకొనుట నైజపాపము. ఎందుకనిన, నీవు మొదటిసారి ప్రార్థన చేసినప్పుడు సంపూర్ణమైన నమ్మిక కలిగినది. ఇప్పుడు అది పోయినది. అదే నైజపాపము.
5. పాపమును జయించినాను, అయినా మరలా పడిపోవుదునేమో అని అనుకొనుట నైజపాపము. ఎందుకనిన, క్రొత్త పాపశోధన ఇంకా రానే లేదు, రాకముందే పడిపోవుట తలంపులోనికి వచ్చినది. అదే నైజపాపము.
6. 'జీవితకాలమంతయు భక్తిగా నడిచాను, నేను తప్పకుండా మోక్షమునకు వెళ్ళెదను' అను నిశ్చయత చేసికొని, స్వప్నములోగాని, దర్శనములోగాని ప్రభువు చెప్పటము వినికూడా, మరణ సమయమందు అనుమానము కలుగును. అదే నైజపాపము.

ఉదా: బిషప్ బట్లరు అనే ఆయన క్రీస్తుయొక్క దైవత్వము గురించి అనేక సంగతులు వ్రాసినాడు. గాని మరణ సమయమందు "నేను వృధాగా కష్టపడ్డాను. క్రీస్తు అనే ఆయన ఉన్నాడో లేడో, నేను ఇప్పుడు చనిపోతే ఎక్కడికి పోతానో తెలియదు" అని అనుకొని నిరాశలో ఉన్నాడు. ఈయన వ్రాసిన పుస్తకములు అనేకమంది చదివి, అనేకమంది విశ్వాసులైరి. అయితే ఆయన నిరాశలో ఉన్నప్పుడు, ఆయన శిష్యుడగు ఒక పాదిరిగారు వచ్చి విచారపడి, మోమాటము లేకుండ గద్దించినాడు. "అయ్యా! మీరు ఇప్పుడు నరకమునకు వెళ్ళిపోతారు, అది మీకు తప్పదు. మీకు ఇంత గొప్ప వరమిచ్చిన దేవుడు నిన్ను కఠినముగా శిక్షించును, మీరు తప్పించుకొనలేరు, మీరు పిశాచియొక్క వశము అగుదురు. మా అందరికి బోధ చేసి, మీరే గోతిలో పడిపోయినారు. మాకు మోక్షము, నీకు నరకము" అని చెప్పినాడు. అప్పుడు ఆయన మారుమనస్సుపొంది, చనిపోయి మోక్షమునకు వెళ్ళెను. **అనుమానమే పాపనైజము.** 'ఈ భక్తుడు పరలోకమునకు వెళ్ళిపోవుచున్నాడు నాకు దొరకడు అని' మిక్కిలి వాడిగల బాణమువేసి చూస్తాడు.

7. రాకడలో యున్నవారికి ఈ సందేహము రాకమానదు, ఇదే నైజపాపము. రాకడలో సిద్ధపడే వారికి ఈ శోధన తప్పదు. అయితే ప్రార్ధన ద్వారా దీనిని తప్పించుకొన వచ్చును. దైవ ప్రార్థనే అన్నిటికి విరుగుడు. ప్రార్థన అనగా ప్రార్థనమెట్లు ప్రకారము చేయుటయే.

8. పాప పరిహారము కొరకు గుడిలో ఇచ్చే భోజనము మనము పుచ్చుకొని, ఇంటికి వెళ్ళిన తరువాత కూడ పాప ఆలోచనలు, పాప జ్ఞప్తి వచ్చును. అదే నైజపాపము.

9. ఈ నైజపాపము తీసివేయుటకే ఆయన కనబడును, దర్శన భోజన మిచ్చును. మీరు ప్రభు భోజనము గుడిలో పుచ్చుకొన్నారు, పాప పరిహారము కలిగినది, ఇంటికి వస్తారు, పాత పాపము జ్ఞాపకము వచ్చును. అదే నైజ పాపము.

10. ఏమి! ఈ నైజము, ఇదేమో అని ఎపుడైనా, దీనిని గూర్చిన భయము వచ్చిన యెడల అదే నైజ పాపము. యేసు ప్రభువు భయమును తీసివేసినాడని నమ్మి మరలా ఎందుకు భయపడటము?

షరా:- పాము ఎన్నడూ తిన్నగా ప్రాకనేరదు. వంకర వంకరగానే ప్రాకుచూ వెళ్ళును. ఇదే దాని నైజము. అది సృష్టి. అలాగే ప్రతి భక్తునిలోకూడ ఎంతో మంచి ఉన్నప్పటికినీ, వంకర తలంపు కూడ యుండును. అదే నైజము. అది సరిచేయుటకే దర్శన భోజనము (అంతరంగ సంస్కారము) కావలెను. ఇది ప్రతి దినమునూ పుచ్చుకొనవచ్చును. ఆలాగు పుచ్చుకొనే వారికి ***తిరస్కరణి విద్య*** వచ్చును. ప్రభువు ఇచ్చినాడు అని ఊహించుట వలన సంతుష్టి కలుగదు. సాక్షాత్తుగా ఆ అనుభవము కలుగవలెను. పాదిరిగారిని, రొట్టెను, ద్రాక్షారసమును చూస్తుయున్నాము గదా! ఆలాగే దర్శనములో కూడ చూస్తే సంతుష్టి, లేకపోతే నైజపాపము వృద్ధి అగును. రోజూ చూడకుండా ఊహించు కొంటే అనుమానము ఎక్కువ

అవుతుంది, అదే నైజ పాపము. ఉదయమున నిన్నటి దర్శనములో నాకు స్పష్టముగా కనబడినట్లు, ఎవరికి కనబడినదో వారికి సంతుష్టి కలుగును.

11. మీరు యెరూషలేము పండుగకు వెళ్ళరా? అని కొందరు యేసు ప్రభువును అడిగినారు. ప్రభువు 'నా సమయము ఇంకా రాలేదు' అని జవాబు చెప్పినారు. తరువాత సమయము వచ్చినపుడు వెళ్ళినారు. తల్లియైన మరియమ్మ ద్రాక్షారసము అయిపోయినదని చెప్పినను, 'నా గడియ ఇంకా రాలేదు' అని ఆయన చెప్పినాడు. ఆ గడియ వచ్చినప్పుడు ద్రాక్షారసము చేసినాడు. ఇంత *ఖచ్చితముగా గడియార ప్రకారము మనము చేయగలమా? చేయలేని యెడల అదే నైజ బలహీనత.* మరియు ఆయనను రాళ్ళతో చంపవలెనని శత్రువులు యత్నించినారు. అప్పుడు ఆయన, తన మరణ గడియ ఇంకా రాలేదు గనుక మెల్లగా జారిపోయినాడు. అలాగే నజరేతులో ఆయనను కొట్టబోయినపుడు, దెబ్బకు అందలేదు, జారిపోయినాడు. మనము శ్రద్ధగా నాలుగు సువార్తలు చదివితే ఈ సంగతులు కనబడును. మనకైతే జన్మపాపమున్నది. ఆయనకు లేదు. అందుచేత ఆయన నైజపాపము కూడ చేయలేదు.

**షరా:-** మోషే, ఏలీయాలు 40 రోజులు ఉపవాసము చేసిరి. ఇశ్రాయేలీయులు 40 సం॥లు వనవాసము చేసిరి. అలాగే యేసు ప్రభువు తన ఉపవాసమునకు ఈ 40 అంకెయే ఏర్పర్చుకొన్నారు.

**నైజపాప నిర్మూలము:-** ఇది పోవుట దుర్లభము. దర్శన భోజనము వలన కాల క్రమేణా నైజ పాపము పోవును. 'ఇన్నాళ్ళనుంచి, ఏ బోధకులు నైజ పాపమును గురించి గాని, దర్శన భోజనమును గురించిగాని చెప్పలేదు. ఇప్పుడు క్రొత్తగా చెప్పటము వలన అపనమ్మిక కలుగుచున్నది' అని కొందరనుచున్నారు. డాక్టర్॥ మార్టిన్ లూథర్‌గారు మనలోని పాత ఆదాము, ప్రతి దినము మునిగి చావ వలెను! ప్రతి దినము మనలోనికి క్రొత్త ఆదాము బ్రతికి వచ్చుచుండవలెను అని చెప్పిరి.

**ప్రార్థన:** ఓ తండ్రీ! నీవు మనిషిని కలుగచేసినపుడు, నైజ పరిశుద్ధత అతనిలో ఇమిడ్చినావు గాని పాపము ప్రవేశించినపుడు, ఆ నైజము చెంతను పాపనైజము మొలిచినది. అప్పటినుండి నేటివరకు మనిషిలో మంచిచెడ్డలు ఉంటూనే యున్నవి. ఆ చెడుగు, దర్శన భోజనము వలన హరించి పోవలెను. మనిషి ఎంత చెడ్డవాడైనను అతనిలో ఏదో ఒక మంచి నైజము ఉండక మానదు. ***అలాగే ఎంత భక్తుడైనను అతనిలో కొంచెము చెడుగైనా ఉండక మానదు.*** ఇది అనుదిన ప్రయత్నము వలన గతించిపోవును. ఒకవేళ కొంచెము మిగిలిన యెడల మరణ సమయమందైనా అది పోవును. అందుకే పాదురులు మరణ సమయమందు రోగికి, ప్రభుభోజనము ఇస్తూ ఉన్నారు. అతడు చనిపోయి, వెళ్ళిపోవుచున్నాడు గనుక ప్రభుభోజనము, అతని భక్తి స్థిరపడుటకు ఉపయోగము. ప్రభువా! ఆదిని పరిశుద్ధ నైజము ఇచ్చిన నీవు, నేడు మాకును అది అనుగ్రహించుము. ఆదిని సైతాను ప్రవేశపెట్టిన పాపనైజమును పెరికివేయుము. ఆమేన్.

# 11

# స్వంత ఆత్మ

1. స్వంత ఆత్మ అనగా నైజబుద్ధి. ఇది దయ్యము కంటె ఎక్కువ హానికరమైనదని చెప్పవచ్చును. ఇది ఆదాము హవ్వల వలన మనకు వచ్చినదని కూడ చెప్పవచ్చును. ఇది మన స్వంతముగా తెచ్చుకొన్నదని కూడ చెప్పవచ్చును.
2. దీనివలన దైవాజ్ఞలు, మనుష్యాజ్ఞలు మీరటము ఉండును.
3. గురువులయొక్క సెలవులేనిదే ఎక్కడికిని వెళ్ళకూడదు.
4. ముఖము పిచ్చివాలకముగా ఉండునట్లు చేసికొనకూడదు.
5. శుభ్రముగా ఉండకపోవుట, శుభ్రమైన బట్టలు వేసికొనకపోవుట అనగా ఆరోగ్య పద్ధతులను మీరుట తప్పే.
6. అదే పదముగా (అదేపనిగా) ఒక సంగతి ఆలోచించి, మనసు చెడగొట్టు కొనుట కూడ తప్పే.
7. మీటింగులలో ఉద్రేకపు మీటింగులు పెట్టుట, ప్రస్తుతము మాని వేయవలెను.
8. మత విషయములు అధికముగా ఆలోచించుచున్న యెడల పిచ్చితనము అబ్బును. అందుచే దిగంబరత్వము, బూతుమాటలు, కొట్లాటలు, దొంగిలించుటలు ఈ మొదలైనవి కలుగును.
9. అధికముగా ప్రార్థన చేయుట, బైబిలు చదువుట, బోధలు చేయుట, ఈ మొదలైనవి కూడ మనస్సును బలహీన పరచును.
10. ***'అద్భుతములు చేయవలయును'*** అనేపట్టు మానవలయును.
11. స్వంత ఆత్మ ఎక్కువగా ఉన్నందువలన తప్పుడు దర్శనములు, తప్పుడు ఊహలు, తప్పుడు స్వప్నములు అన్నియు కలుగును.
12. దీర్ఘ ప్రార్థనలు మరియు తిక్కపట్టు ప్రార్థనలు ఈ మొదలైనవి చేస్తే; మన చిత్త ప్రకారముగా చేయవలసినదని, మనము దేవునిని బలవంత పెట్టినట్లుండును. ఇది గొప్ప తప్పు.
13. స్వంత ఆత్మ ఉండుట వలన దురాత్మకూడ ప్రవేశించును.
14. తుదకు దేవునిని దూషించుట, నేనే దేవుడననుట ఈ మొదలైనవి కలిగి యుండును.
15. స్వంత ఆత్మ ఉండుట వలన దురాత్మకు చోటుండును గనుక లేనిపోని స్వరములు వినబడుచుండును. అవి కొన్ని మంచివిగాను, కొన్ని చెడ్డవిగాను ఉండును. సైతానెప్పుడును సంపూర్ణ సత్యము చెప్పదు. అసత్యము, సత్యమై యున్నదని మనము భ్రమించు నిమిత్తమై, **అసత్యమును సత్యముతో కలిపి చెప్పును. ఇది గొప్ప మోసము.**

Bible Mission HQ Guntur

16. స్వంత ఆత్మ ఉన్నయెడల దురాత్మ యుండును గనుక మెస్మరిజమ్ (వశీకరించు కొనుట) చేయుటకు ప్రయత్నించెదవు. **ఇది కూడని పని.**

17. స్వంత ఆత్మ ఉన్నందువలననే, నేను అందరికంటే గొప్పవాడననియు, నా కంటె సంగతులెవరూ గ్రహింపలేరనియు, ఇవి మహాగొప్ప మర్మములనియు నీవు చెప్పుదువు, గాని వాటిని ఋజువు పరచలేవు.

18. తుదకు ఈ రెండు ఆత్మలు కలిసి, నిన్ను అగ్నిలోనో, నీటిలోనో ముంచి వేయును. నీ ఆరోగ్యము చెడగొట్టును, మనస్సు చెడగొట్టును, ఆత్మ జీవనమును చెడగొట్టును.

19. మరియు నాకు ఏమియు అక్కరలేదు, బట్టలతోను, సొమ్ముతోను, బ్రతుకవలసిన వాటితోను, వేటితోను పనిలేదని చెప్పుదువు. గనుక స్వంత ఆత్మకు లోబడవద్దు.

20. ఈ రెండును (స్వంత ఆత్మ, దురాత్మ) కలిసి నేనే దేవుడను, నేనే ప్రార్థనయై యున్నాను, నేనే బైబిలు అయి ఉన్నాను, నేను ఏ బైబిలు చదువనక్కరలేదు, నా హృదయములోనే బైబిలు ఉన్నది అని చెప్పుదువు. తుదకు ఈ రెండును నిన్ను నరకమునకు కొంచుకొని పోవును. గనుక వీటికి చోటియ్యరాదు.

21. షరా:- మంచి విషయములే జరిగించేటప్పుడు, చెడ్డ విషయములు కూడ వచ్చి, చేరుచున్నవి గనుక ప్రస్తుతము అవి (ఆ మంచి కార్యములు) స్వయముగా చేయక, ఎరిగిన వారిచేత చేయించుకొనుట క్షేమమైయుండును. ఎవరెవరి యొద్ద తప్పుడు మాటలు పలికినావో, కాని చర్యలు జరిపినావో, వారియొద్ద తప్పు ఒప్పుకొనవలయును. ఒకదరి నుండి విశ్వాసులు మంచి సంగతులు నేర్పిస్తూ ఉంటే, మరొకదరి నుంచి చెడ్డ ఆత్మ, చెడ్డ సంగతులు నేర్పించు చుండును. ***ఒకసారి ఆత్మానుభవము పొందిన తరువాత, ఈ దుస్థితిలోనికి దిగిన యెడల, మారుట బహు కష్టమై యుండును.*** గనుక బహు జాగ్రత్తగా యుండవలయును. వాక్యబోధ వినని వారిమీద కోపపడకూడదు, శాంతముతో బోధింపవలయును. వారు వినకపోతే (చెప్పుట) మానివేయ వచ్చును.

22. నీటి మీద నడువుము, బండ్లకు (రైలు,బస్సు) ఎదురుగావెళ్ళి ఆపు చేయుము, చెట్ల మీదనుంచి, మేడల మీదనుంచి దుముకుము, అగ్నిలో పడుము; నీకేమియు హాని కలుగదు అని స్వంతాత్మయు, దురాత్మయు నీకు చెప్పునుగాని, నీవేమియు ఆ మాటలు వినవద్దు.

23. మంచి సంగతులు నేర్చుకొనేటప్పుడు, గర్విస్తే దుస్థితి కలుగును. ఒకరికి వరములు రావడము చూచి గర్విస్తే, దుస్థితి కలుగును.

24. ఇన్ని లోభములున్న యెడల పరిశుద్ధాత్మ పని ఏలాగు జరుగును?

***పనిపాటలు ఎక్కువ చేస్తే స్వంత ఆత్మకు బలము తగ్గును.***

Bible Mission HQ Guntur

# దైవ ప్రార్థన సలహా

సర్వమత సంఘ ప్రతినిధులగు ఆర్యులారా! సృష్టికర్త నామమున మీకు శుభములు కలుగునుగాక!

ఈ సభలోనే ఈ దిగువనున్న ప్రార్థనలు చేసి, దేవుడిచ్చు జవాబులు ప్రచురించండి.

***ప్రార్థన:*** 1) దేవా! సృష్టికర్తా! మా ప్రియజనకా! నీకనేక నమస్కారములు. లోకవాసులు నిత్యశాంతి కలుగుటకై, మేము ఏమేమి చేయవలెనో మాకు నేర్పుము. 2) మాలో సహోదరభావము నిత్యము కలిగియుండుటకై మేము ఏమేమి చేయవలెనో మాకు నేర్పుము. 3) 'అహింస పరమ ధర్మమైయున్నది' అను వచనమును నెరవేర్చుటకై మేము ఏమేమి చేయవలెనో మాకు నేర్పుము. ఆమేన్.

***సలహా:*** మన పాపస్థితిని ఒప్పుకొని, ఇకమీదట పాప విసర్జన చేయయత్నింతుమని ప్రమాణముచేసి, కాపుదల నిమిత్తమై మన సమస్తమును దేవునికి సమర్పించి, ఆయన చేసిన మేళ్ళు తలంచుకొని ఆయనకు కృతజ్ఞతాస్తుతులాచరించి, ఓపికతో నిశ్శబ్ధముగా కొంతసేపు దైవధ్యాన స్థితిలో నున్నయెడల, ఆయన మనకు శరీర రూపముతో కనబడి, మన ప్రశ్నలకు స్వరముతోనైనను, గాలిలో వ్రాత మూలముగనైనను జవాబిచ్చును. మన అంశములను గురించి దీర్ఘాలోచన చేయుటయు, అందరి అభిప్రాయములు తెలిసి కొనుటయు, స్వానుభవములు చెప్పుకొనుటయు, సలహాలు ఇచ్చుటయు మంచిదే. కానీ, దేవుని అభిప్రాయమును గూడ తెలిసికొనుట, అంతకన్నా మంచిది. అందరిని పిలిచి దేవుని పిలువని యెడల మన సభ కొరత గలదియగును. దేవుడు మనకు అనుగ్రహించిన జ్ఞానమును బట్టి సర్వసత్కార్యములు చేయునపుడు, మన పరిమితి జ్ఞానమువలన కొన్ని లోపములు కలుగును. కనుక అపరిమిత జ్ఞానముగల దేవుని అడిగిన యెడల, మన లోపములను ఆయన దిద్దును. అప్పుడు బేధాభిప్రాయములుకూడ క్రమముగ అంతరించును. మన ప్రార్థనాంశములన్నియు దేవునియెదుట చెప్పుకొని ప్రార్థించుటకై, ఇట్టి మహాసభలు తరచుగా చేయశక్తి ననుగ్రహించుమని దేవుని ప్రార్థింపవలెను. మనము ఏ ప్రార్థన చేసినను అది దేవునికి కీర్తియు, మనకు మేలును కలిగించునదై యుండవలెను. ప్రార్థన చేసిన పిమ్మట దైవచిత్తాను సారముగ మనము పనులు చక్కబెట్టుకొనుచుండగా, నెరవేర్పు త్వరగా కనబడనప్పుడు నిరాశపడక, అపనమ్మికకు చోటియ్యక, దేవుని చిత్తమునే మనస్సునందు గురిగా పెట్టుకొని ముందుకు సాగి వెళ్ళవలెను. అప్పుడు మన సమస్త కార్యములు సఫలమగును.

Bible Mission HQ Guntur

# దేవుని ప్రార్థించండి

దేశీయులారా! అపాయము వచ్చినప్పుడు తప్పించుకొనుటకు, మీరెన్నో ప్రయత్నములు చేయుదురు. అవన్నియు నెరవేరుటకును, నూతన సాధనములు కల్పించుటకును, దైవ ప్రార్థన ప్రయత్నము చేయగలరా? ఇది అన్ని యత్నముల కంటె మొదటిది, ముఖ్య మైనదియునై యున్నది. గాలి,వానలు, వరదలు, తిండి భేదములు, చలి, వేడి, సముద్ర ప్రయాణములు, బండ్ల ప్రయాణములు, జంతువులు, పురుగులు, పిడుగులు, భూకంపములు, వ్యాధులు, ఇబ్బందులు, కరవులు ఈ మొదలగు వానివలన హాని కలుగుచున్నది. ఇవి దేవుడు గాక మరియెవరు తప్పించగలరు! గనుక భూమ్యాకాశములను, సమస్తమును కలుగజేసిన ఆయననే ప్రార్థించండి. ఆయన కలుగజేసిన సృష్టిలోని దేనిని ప్రార్థించినను ప్రయోజనము లేదు. ఏది మిగుల అపాయకరమైన కాలము? పైన ఉదహరించినవి ఉన్న కష్టకాలమా? లేక పాపకాలమా? మనము పట్టుదలతో ప్రార్థించిన యెడల ఈ రెండు విధములైన అపాయములు తొలగును. **కష్టకాలమునకు కారణమైన పాపము ముందుగా పరిహారము కావలెను.** పాపము మనలను దేవునికిని, మోక్షమునకును, దూరస్థులనుగా చేయును. ***ఈ దుస్థితి ప్రార్థనవలననే అంతరించును. గనుక దేవుని ప్రార్థించండి.*** ప్రతి ఇంటిలోని వారందరు ప్రతిదినము దేవుని ఎదుట మోకరించి ప్రార్థింపవలయును. దేవుడు పాపుల మొరవినునా? మన కష్టములు చూచి, ఆయన ఎందుకు ఊరుకున్నాడు? అను ఇట్టి ప్రశ్నలు కట్టివేసి ప్రార్థించండి. ఇది మీరెందరిచేత చదివింతురో! ఎందరికి వినిపింతురో! మా క్రైస్తవుల మనవి ఇది: “అన్ని పూజలు మాని, యేసుక్రీస్తు ప్రభువును పూజచేసి చూడండి. మీ ప్రార్థనలు సిద్ధించును” దేవుడు మిమ్మును దీవించునుగాక!

క్రీస్తు ప్రభువును పూజించుట వలన కలుగుమేళ్ళు ఏవి? 1. ఎంత చిన్న తప్పు చేసినను, ‘అయ్యో! నేనెంత తప్పు చేసితిని’ అని నొచ్చుకొనునట్టి మనస్సు కలుగును. 2. మీ పాపములు పరిహారమగును. 3. పాపములను విసర్జించునట్టి శక్తి కలుగును. 4. దైవభక్తి కలిగి ప్రవర్తింపగల సమర్థత కలుగును. 5. ప్రార్థన చేసికొను వాలు కుదురును. 6. అన్ని సద్గుణములలో వృద్ధి కలుగును. 7. ఎన్ని కష్టములు వచ్చినను, నిత్యము మనశ్శాంతి గలిగియుండును. 8. దైవాంశములు సదా నేర్చుకొనవలెననే ఆపేక్ష కలిగియుండును. 9. దైవ విషయము లెప్పుడును ఇతరులకు చెప్పవలెనను ఆశ కలుగును. 10. అన్ని మతముల వారును, అన్ని దేశముల వారును, అన్ని జాతుల వారును, శత్రువులును, స్నేహితులును, స్వజనులును, పరజనులును, సజ్జనులును, దుర్జనులును, రోగులును, బీదవారును, గొప్పవారును, అందరును క్రీస్తు ప్రభువునే పూజింపవలెను అను కోరిక గలిగియుండును. 11.ఈ జీవాంతమున మోక్షములో చేరగల భాగ్యము కలుగును. ఈ మేళ్ళేనా? మరియే మేళ్ళను కలుగవా? కలుగకేమి 1) జబ్బులు పోయి ఆరోగ్యము కలుగును. 2) అన్న వస్త్రాదులు కలిగియుండును. 3) మానవ జీవితమునకు

కావలసినవి దొరుకును. క్రీస్తు ప్రభువును ప్రార్థించిన తరువాత అవి నెరవేరునని నమ్మవలెను. క్రీస్తుప్రభువే మన ప్రార్ధనలన్నిటికి నెరవేర్పయి యున్నాడు.‘ క్రైస్తవుల ప్రార్ధనలు ఎందుకు నెరవేరుటలేదు’ అని అడుగుదురేమో! నమ్మికలోనో, నడతలోనో లోభముండుటను బట్టి నెరవేరవు.

క్రీస్తు ప్రభావము వలన పాపులకు, రోగులకు, బీదలకు, బిడ్డలు లేనివారికి, భూత పీడితులకు, అప్పులపాలైన వారికి, కోర్టులో వాజ్యములు గలవారికి, కుటుంబ కలహములు గలవారికి, తప్పిపోయిన వస్తువులు గలవారికి, సకాలములో పెళ్ళి సమకూడనివారికి, ఉద్యోగము లేనివారికి, విష పురుగువల్ల బాధపడువారికి, పశువులకు మేలు కలుగుచున్నది. కొందరికి వెంటనే, మరికొందరికి ఇంటివద్ద స్వస్థత కలుగుచున్నది. తమ కోరికలు నెరవేర్చుకొనగోరువారు, పాప కార్యములు మరియు ఇతర పూజలు మానివేసి, క్రీస్తుని మాత్రమే పూజింపవలయును. బోధ వినిపించుట పాదురులు లేక బోధకులపని, ప్రార్ధనలు చేయుట వరము పొందిన వారిపని, నమ్ముట ప్రజలపని బాగుచేయుట క్రీస్తు ప్రభువు పని.

క్రీస్తును పూజించుటకు ఆయన ఎవరు? ఆకాశమును, భూమిని, సంపద సమస్తమును కలుగజేసిన దేవుడు, నరులకు కనబడి, వారితో కలసి మెలసి, వారి నిమిత్తమై నెరవేర్చవలసిన సమస్త కార్యములు నెరవేర్చుటకై, మానవుడై జన్మించిన రక్షకుడు. ఆయన మానవావతార కాలమున యేసుక్రీస్తు అను నామమును ధరించెను. ఆయన ఒకరి రక్షకుడే కాదు, నమ్మువారందరి రక్షకుడునై యున్నాడు. మీకు శుభము కలుగును గాక!

# ప్రార్థన పద్ధతి

యేసు ప్రభువు భూమిమీద నున్న 3 1/2 సం॥ల కాలముయొక్క చివరలో ఒక ఆజ్ఞ ఇచ్చెను. ఆ ఆజ్ఞ, 'మీరు సర్వలోకమునకు వెళ్ళి, సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి' అనునది. ఆయన 3 1/2 సం॥ల సేవ కాలమున కొన్ని సలహాలిచ్చెను. అందొకటి ప్రార్థించండి అనునది; ఆజ్ఞ ప్రకారము చేయుట సుళువా, సలహా ప్రకారము చేయుట సుళువా? **ముందు సలహా నెరవేర్చిన తర్వాత ఆజ్ఞ ప్రకారము చేయగలము.** గనుక ముందు ప్రార్థించవలెను. ప్రార్థనలో ఆజ్ఞలు నెరవేర్చు బలము వచ్చును. గనుక ముందు ప్రార్థన పద్ధతి నేర్చుకొనవలెను. అప్పుడు ప్రార్థనలో వచ్చిన బలమువల్ల సర్వలోక సంచారము చేయగలము. 'సర్వలోకమునకు వెళ్ళి, సర్వ సృష్టికి సువార్త ప్రకటించుడి' అనునది అప్పుడు నెరవేరును. అనగా లోకమంతా తిరిగి అన్ని భాషలలో సువార్త ప్రకటించుము. అయితే మనము పద్ధతి లేకుండ ప్రార్థన చేయుచున్నాము. అయినను, ఆయన దయగలవాడు గనుక అంగీకరించు చున్నాడు. మత్తయి 6:6లో ప్రార్థన పద్ధతి గలదు. నేను కొన్ని పద్ధతులు నేర్పించి అచ్చువేయించినాను. ఉదా:- కలెక్టరుగారికి పిటిషను ఒక పద్ధతి ప్రకారము వ్రాయవలెను. ఆ పద్ధతి ప్రకారము ప్రార్థన చేసిన బలము వచ్చును. అప్పుడు ఆజ్ఞలను నెరవేర్చుటకు, వాక్యము ప్రకటించుటకు బలము వచ్చును. అప్పుడు 'యేసు క్రీస్తు నా రక్షకుడు' అనునది స్థిరమగును. నేను తప్పకుండా మోక్షమునకు వెళ్ళుదును అనునది స్థిరమగును.

**1. మనోనిదానము:** సమస్తమును మరచి క్రీస్తు ప్రభువునే మనము చూడవలెను. ఫోటో తీయువారు- మెదలవద్దు, కదలవద్దు అని చెప్పుదురు. ఆలాగున యేసునే ధ్యానించుటయే మనోనిదానము. ఇది ఒక అంశము. దీనిని గూర్చి నేర్చుకొనిన యెడల బలము వచ్చును.

స్తుతి: తండ్రిని స్తుతించవలెను. గత కాలములో చేసిన మేళ్ళు, తొలగించిన కీడులు, కలిగించిన ఉపకారములు తలంచుకొని స్తుతించవలెను. రాబోవు కాలములోని మేళ్ళు తలంచుకొని స్తుతించవలెను. ఉదా: అధికారి కనబడినప్పుడు ముందు సలాము చేయుదుము. తరువాత మన మనవి చెప్పుదుము. ఆలాగే దేవునికి నమస్కరించుట మన మొదటి పని. మనో నిదానము వలన బలము, ఆ తర్వాత స్తుతివలన బలము.

**2. ఒప్పుదల:** స్తుతి అయిన తర్వాత, 'నా ఆలోచన, చూపు, వినికిడి, వాక్కు, క్రియ, అన్నియు పాపములే' అని నేలమీద ధారపోసి, ఒప్పుకొనవలెను. అప్పుడు భారము దిగిపోవును. ధారపోసిన భారము తగ్గిపోవును.

**3. తీర్మానము:** ఒప్పుదలలో, భూమిమీద ప్రభువుయొక్క పాదములయొద్ద పడిన వ్యక్తి, భారముపోయిన మీదట లేచి, తీర్మానము చేయవలెను. స్నానము అయినది గనుక ధైర్యము.

చెమట పోయినది, విసుగు పోయినది గనుక చొరవ చేసికొని తీర్మానము చేయవలెను. 'యేసు ప్రభువా! నిలువబడుటకు ప్రయత్నము చేయుదును. ఇకమీదట పడను, నిన్ను దుఃఖపెట్టను, ఇకమీదట జాగ్రత్తగా నుందును. నన్ను నేను దుఃఖపరచుకొనను.' గెత్సేమనేలో– 'శోధనలో పడకుండ ప్రార్థన చేయుడి' అని అన్నావు గనుక జాగ్రత్తగా నుందును అని తీర్మానము చేయవలెను.

**4. సమర్పణ:** సమర్పణ బహు గడ్డయినది. పైన చేసిన తీర్మానము, ఇదియు ఒకటిగానే కనబడును. అయితే సమర్పణ అనగా నా ప్రాణము, నా మనస్సాక్షి, నా జ్ఞానము, నా శరీరము, నా ఇంటిలోని వన్నియు, నా సమస్తము నీవే. ఇప్పటినుండి నావే నీవి, నీవన్నియు నావి. నీ సమస్తము నాకు ఇచ్చిన ప్రభువా! నీకే సమర్పించుచున్నాను. ప్రభువా! నీవు నాకేమి చెప్పినా, నేను చేయుదును. 'చేయవద్దు' అని నీవు చెప్పినది మానివేయుదును. ఇది నావల్ల కాదు గాని ప్రయత్నించెదను. నీకు ఉన్నది సమర్పించు, లేక బీదలకు ధర్మము చేయి, లేదా సువార్త పనికి ఇమ్ము అని నీవు చెప్పిన యెడల తప్పక చేయుదును. ఈ నా సమర్పణ రిజిస్ట్రేషన్ అయిపోయినది. నాకు కావలసినవి నీవు ఇచ్చెదవు.

**5. ప్రార్థన:** మన ఇష్టము, దేవుని ఏమైన అడుగవచ్చును. యోహాను 14:14 ప్రకారము 'ఏమి' అడిగిన ఇచ్చెదనని చెప్పెను గనుక మనము అడుగవలెను. ఏ అంశము అడిగిన ఆటంకము లేదు. పై 4 అంశములు చేయకపోయిన అవి అడ్డుగా నుండును. సమర్పణ చేయకపోవుట, ప్రార్థన నెరవేర్చుటకు ఒక అడ్డుబండగా నుండును. ఇప్పుడు సమర్పణ చేసిన తరువాత దమ్మిడీ అడిగినా, లక్ష అడిగినా ఇచ్చును. ఎందుచేతననగా అడ్డులన్నియు తొలగించుకొన్నాను, గనుక ప్రార్థన జాబితా తయారుచేసి ఆ ప్రకారము అడుగవచ్చును. యెషయా 7:11. దీనికి అంశ ప్రార్థన అని పేరు. ఆయన ఇస్తానని చెప్పెను గనుక క్రమముగా ఇచ్చును.

**6.స్తుతి:** అడుగవలసినవన్ని అయిపోయినవి గనుక ఇక స్తుతించవలెను. పై ప్రతి మెట్టు తరువాత **స్తుతి** చేయవలెను. ఒప్పుదలకు, తీర్మానమునకు, సమర్పణకు, అంశ ప్రార్థనకు చివర స్తుతి చేయవలెను. తీర్మాన నైజము ఇచ్చినందులకు స్తుతి చేయవలెను. సమర్పణ చేయు ధైర్యము ఇచ్చినందులకు స్తుతి చేయవలెను. అన్ని ప్రార్థనాంశములు నెరవేర్చిన దేవా! నీకు స్తుతి అని చెప్పవలెను. చివరగా ఆయన దివ్యలక్షణములను తలంచుకొని స్తుతించవలెను.

**7. కనిపెట్టుట:** పై అంశములన్నిటిలో నేను మాట్లాడినాను, ఇక నేను ఊరుకొందును. "నీవు చెప్పు ప్రభువా!" అనునది ఈ మెట్టులో ఉండవలెను. ఇన్ని మనవులు చేసినాను, నీవు ఏమి చెప్పుదువో చెప్పుము. ఈ ఆఖరుమెట్టు సింహాసనము దగ్గరకు వెళ్ళును. గనుక ఇది చాలా ముఖ్యము. ప్రార్థనలో మనిషి ఆత్మ దేవుని దగ్గరకు పోవలెను. ఇవన్నీ చేసినగాని ఈ

ఆఖరు మెట్టుకు వచ్చుటకు హక్కులేదు. పై ఒక్కొక్క మెట్టులో ఇంకా మెట్టులున్నవి. 1కొరింథి 15:58లో స్థిరత కలిగియుండుడి అని ఉన్నది. గనుక మనోనిదాన స్థిరత కలిగి పై అంశములు చేయవలెను.

క్రీస్తు ప్రభువు లేకుండ ఏవియు కలుగలేదని బైబిలులో గలదు. సృష్టికూడ ఆయనను గురించి చెప్పుచున్నది. ఇవన్నియు నేర్చుకొన్నప్పుడు ఈయనే రక్షకుడని చెప్పగల ధైర్యము వచ్చును. ఈయన లేకుండ ఏమియు కలుగలేదు. ఎవరివల్ల సమస్తము కలిగెనో, ఆయననే మనము పట్టుకొన్నాము. సమస్తము కలుగజేసిన ఆయన రక్షకుడు, దేవుడు, మానవుడును ఆయెను. యోహాను 14:14లో 'నా నామమున మీరు నన్ను ఏమి అడిగినను నేను చేతును' అని ఉన్నది. అనగా అన్ని నేను చేసినాను గనుక ఏమైన ఇవ్వగలను అని ఈ వాగ్ధానముయొక్క అర్ధమైయున్నది. ఆకాశములోనిదైనను, భూమిలోనిదైనను, పాతాళము లోనిదైనను, సముద్రములోనిదైనను ఆయన ఇచ్చును. ఆయన సమస్తమును కలుగజేసెను గనుక ఆ సమస్తములో ఏదైనను ఆయన ఇచ్చును. కీర్తన 19వ అధ్యాయములో ఆకాశము, భూమి ఉపాధ్యాయులని వ్రాయబడి యున్నది. అనగా అవి ఆయనను గురించి ప్రకటించు చున్నవి. భూమి- నాలో దేవుని జీవముగలదు అన్నట్లు, చెట్లలో జీవము, మృగములలో జీవము, మనలో జీవము, ఆకాశములో వెలుగు; వెలుగైయున్న ప్రభువును చాటుచున్నవి. నేనెప్పుడు వెలుగులో నున్నాను, నేనెల్లప్పుడు జీవమునే కలిగి ఉందునని సృష్టి చెప్పుచున్నది. కాబట్టి దేవుడు 1. కనిపెట్టుట ద్వారా స్వయముగా మాట్లాడుచున్నాడు. 2. సృష్టి వెనుక ఉండి, సృష్టిద్వారా మాట్లాడుచున్నాడు. 3. బైబిలు గ్రంథము ద్వారా మాట్లాడుచున్నాడు. వీటన్నిటి ద్వారా మాట్లాడినను, నరుడు దేవుని నమ్ముట లేదు. వీటిద్వారా దేవుని స్వరము విని స్థిరపడుదుము గాక! ఆమేన్.

# విశ్వాస ప్రార్థన యొక్క లక్షణములు

1. విశ్వాస సహితమైన ప్రార్థన మనుష్యునికి శాశ్వత జీవనమును ఇచ్చును. దావీదు కీర్తనలు 1:2,3.

2. విశ్వాస సహితమైన ప్రార్థన మనుష్యుని ఫలింపజేయును. కీర్తనలు. 2:8.

3. విశ్వాస సహితమైన ప్రార్థన పరమపురికి చేర్చు నావ వంటిది. ఆది. 6:9,14.

4. విశ్వాస సహితమైన ప్రార్థన పాలు తేనెల కంటె అధికమైన బలమిచ్చును. దానియేలు. 1:8-21.

5. విశ్వాస సహితమైన ప్రార్థన మనుష్యుని క్రీస్తునకు నిజ స్నేహితునిగా చేయును. ఆది. 18:16-33.

6. విశ్వాస సహితమైన ప్రార్థన మనుష్యుని దీనత్వము గలవానినిగా జేయును. అపో.కార్య. 7:57-60.

7. విశ్వాస సహితమైన ప్రార్థన మనుష్యునికి తప్పక జవాబునిచ్చును. ఆది. 18:9-10.

8. విశ్వాస సహితమైన ప్రార్థన ప్రపంచమందున్న శక్తులన్నిటి కంటె బలమైనది. అపో.కార్య. 9:40,41.

9. విశ్వాస సహితమైన ప్రార్థన లోకాధికారులకు భయమును, ఆశ్చర్యమును కలిగించును. అపో.కార్య. 5:19,24.

10. విశ్వాస సహితమైన ప్రార్థన మనుష్యునకు రక్షణాస్పదము. రోమా. 10:13.

11. విశ్వాస సహితమైన ప్రార్థన దుఃఖములో సంతోషమును కలిగించును. అపో.కార్య. 16:23-25.

12. **విశ్వాస సహితమైన ప్రార్థన ఇహలోక అధికారుల పొరపాటులను దిద్దుటకు అధికారమును ఇచ్చును.** మార్కు 6:17; I రాజులు 21:17-24; II రాజులు 1:15-16.

13. విశ్వాస సహితమైన ప్రార్థనయే జనాంగములను ఎదిరించుటకు శక్తినిచ్చును. I రాజులు 18:36-39.

14. విశ్వాస సహితమైన ప్రార్థన కరవులో ఆహారము నిచ్చుటకు శక్తిగలది. I రాజులు 17:15,16.

15. విశ్వాస సహితమైన ప్రార్థన మనుష్యునికి నిజ పశ్చాత్తాపమును, మారుమనస్సును కలుగజేయును. లూకా. 22:60-62.

16. విశ్వాస సహితమైన ప్రార్థన ప్రాపంచిక శ్రమలను యెడబాపుటకు అమోఘమైన సాధనమైయున్నది. ఆది. 39:1-10.

17. విశ్వాస సహితమైన ప్రార్థనయే దైవజనుని భక్తులయొద్దకు నడిపించును. అపో.కార్య. 10:17-33.

18. విశ్వాస సహితమైన ప్రార్థనయే ప్రజల దయను, అధికారుల దయను, దేవుని దయను సంపాదించుకొను ముఖ్య సాధనమైయున్నది. లూకా 2:52.

19. విశ్వాస సహితమైన ప్రార్థనయే మంచి యుద్ధము చేయుటకు బలమైన యుద్ధోపకరణమై యున్నది. దానియేలు. 3:10-18.

20. విశ్వాస సహితమైన ప్రార్థనయే మనుష్యుని పరలోకమందు జేర్చెడి నిచ్చెన. ప్రకటన. 4:1-3.

21. విశ్వాస సహితమైన ప్రార్థనయే, నరహత్య మొదలగు పాపముల నుండి పరిశుద్ధతకు మరలుటకు పునాదియై యున్నది. దానియేలు. 3:28-29.

22. **అనుభవమైనచో, మన ప్రభువు నేర్పిన ప్రార్థనయే, పరమ పురికి మనలను ప్రవేశపెట్టు రాజమార్గము.** మత్తయి 6:9-14.

23. విశ్వాసి ప్రార్థన జేయుచోట్ల సాతాను సంచారము చేయుచున్నాడు. యోబు. 1:7.

24. ప్రార్థన సలుపని విశ్వాసి హృదయము పెద్దపులులుండెడి గుహయును, మిడునాగులుండెడి పుట్టయునై యున్నది గనుక అట్టిదానిని మార్చుట కష్టతరము. I రాజులు 21:7-16.

గనుక **విశ్వాస ప్రార్థన** సలుపుట ఈ కాలమందున్న విశ్వాసికి ఎంతో అవసరము. అన్ని స్థితులలో మనలను సంరక్షించి, అన్ని పరిస్థితులనుండి మనలను గట్టెక్కించగల సాధనము ఈ విశ్వాస ప్రార్థనయే. ఒక విశ్వాసి- అంతరంగ విశ్వాసిగాను, రాకడ విశ్వాసిగాను తయారగుటకు ఈ విశ్వాస ప్రార్థనను అభ్యాసము చేసికొనవలెను. అనగా ఈ విశ్వాస ప్రార్థనయొక్క లక్షణములన్నియు తన అనుభవములో సంపాదించు కొనవలెను.

ఇట్టి స్థితిని పెండ్లికుమారుడైన క్రీస్తుప్రభువు చదువరులకు అందించి, విశ్వాస పూర్ణులనుగా చేసి ఆయన మహిమ రాకడకు ఆయత్తపరచుకొనును గాక! ఆమెన్.

Bible Mission HQ Guntur

# 21

## ఇంకొక మారే (ఆది 18:32)

అబ్రాహాము సొదొమ పట్టణము యొక్క నాశనమును గురించి విన్నప్పుడు దేవుని ప్రార్థించెను. తన ప్రార్థన, పదేపదే చేసిన విజ్ఞాపన ప్రార్థనయై యున్నది. తన ప్రార్థనాంశము ముగింపునకు వచ్చినప్పుడు అబ్రాహాము దేవునితో ఇట్లనెను. "ప్రభువు కోపపడని యెడల నేనింకొకమారే మాటలాడెదను." చూచితిరా! అబ్రాహాము ఈమాట ఎప్పుడుపలికినాడు? ప్రార్థన ముగింపు సమయములో, అనగా ప్రార్థించుటకు ఇక సంగతిలేదు. మీరు మీ ప్రార్థనాంశములన్నియు ముగించినారా? మిమ్మును గూర్చికాదు. ఇతరులను గురించి చేయవలసిన ప్రార్థనలు అన్నియు ముగించినారా? మనము ప్రార్థింపవలసిన అవసరము గలవారు లోకములో అనేకులు గలరు. పాపులు, రోగులు, బీదలు, చిక్కులలో నున్నవారు, వీరందరికి మీ ప్రార్థన అవసరము. వారు మిమ్మును అడిగినను, అడగకపోయినను ప్రార్థింపవలెను. మన సహమానవుల నిమిత్తమైన ప్రార్థన, మన విధియైయున్నది. వారిని గురించి ప్రార్థించినారా? ముగించినారా? ఇప్పుడు మనము ప్రార్థింపవలసిన అవసరముగల దేశములు అనేకములున్నవి. వాటిని గురించి ప్రార్థించినారా? ముగించినారా? మనకు విశ్వాసుల ప్రార్థనలు అవసరమైయున్నవి. అయినను ఇతరులను గురించియు, ఇతర దేశములను గురించియు ప్రార్థించవలెను. అప్పుడు మనకుకూడ శ్రమ నివారణ కలుగును. మన ప్రార్థన అవసరమైన సమస్యలన్నిటి గురించి ప్రార్థించినారా? పంటలను గురించియు ప్రార్థించినారా? నరులకు కలుగుచున్న నష్ట పరిహారముల నిమిత్తమై ప్రార్థించినారా? వైద్యశాలలు, బైబిలు సొసైటీ, ట్రాక్టు సొసైటీ, ప్రభుత్వము మొదలైన వాటిని గురించి ప్రార్థించినారా? కలహములు, యుద్ధములు ఆపుచేయుమని ప్రార్థించినారా? మీకు తోచిన క్రొత్త అంశములను గురించి ప్రార్థించినారా? ముగించినారా?

మనలను గురించి ప్రార్థించుట ఎంత అవసరమో, ఇతరులను గురించి ప్రార్థించుట కూడ అంతే అవసరము. వార్తా పత్రికలలో క్రొత్త సంగతులు తెలిసిన యెడల వాటన్నిటి గురించి ప్రార్థింపవలెను. మన ప్రార్థనలు నెరవేరినను నెరవేరకపోయినను, ప్రార్థించుట మన విధి గనుక మన విధి నెరవేర్చుకొనవలెను. అబ్రాహాము ప్రార్థన ప్రకారము సొదొమ పట్టణమును దేవుడు నాశనము చేయకుండ ఉండెనా? ఒక్క లోతును మాత్రమే దేవుడు రక్షించెను, అయితే సొదొమ పాప పరిహారము కాలేదు. అందుచేత నాశనము తప్పినదికాదు. హృదయములోని మార్పునుబట్టి కష్టనివారణ, మార్పు లేనియెడల నివారణ కలుగదు. గనుక ప్రజలయొక్క మారుమనస్సు గురించి ప్రార్థించవలెను. 10 మంది మారుమనస్సు గలవారున్న యెడల, ఆ పట్టణము నాశనము కాకపోవునుగాని, ఆ 10మందికూడ అక్కడ లేరు. అందుచేత నాశనము. అబ్రాహాముయొక్క ప్రార్థన బొత్తిగా నెరవేరలేదని మనము అనకూడదు. ఒక చిన్న ఊరికి నాశనము రాలేదు. ఆ ఊరిలో లోతు రక్షింపబడెను. ఈ రెండును ప్రార్థనకు నెరవేర్పులు, జవాబులు.

# ప్రభువు ప్రార్థన

**భాగములు:** I. **పిలుపు**–పరలోకమందున్న మా తండ్రీ!

II. **మనవి** లేక ప్రార్థన:

1. దేవుని గురించిన మనవులు:

a) నీ నామము పరిశుద్ధపరచబడును గాక!

b) నీ రాజ్యము వచ్చునుగాక!

c) నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమి యందును నెరవేరును గాక!

2. మన శరీర జీవనమును గురించిన మనవి:

a) మా దినాహారము నేడు మాకు దయచేయుము.

3. మన ఆత్మీయ జీవనమును గురించిన మనవులు:

a) మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము, మా ఋణములను క్షమించుము.

b) మమ్మును శోధనలోకి తేకుము.

c) కీడు నుండి తప్పించుము.

III. **స్తుతి:** రాజ్యము, శక్తి, మహిమయు నిరంతరము నీవియైయున్నవి.

**మొత్తముమీది భాగములు:** 1) పిలుపు 2) దేవుని గురించిన ప్రార్థన. 3) మన శరీర జీవనమును గూర్చిన ప్రార్థన 4) మన ఆత్మీయ జీవనమును గూర్చిన ప్రార్థన 5) స్తుతి.

I) **పరలోకమందున్న మా తండ్రీ:** 'మా' అని పిలుచుటలో ప్రభువు సంఘమును పరలోకమునకు తీసికొని వెళ్ళుచున్నట్లు కనబడుచున్నది. 'మా' అనగా విశ్వాసులందరు కలిసి, దేవుని తండ్రీ! అనుట, వారిలోని ఏకీభావమునకు గుర్తు. పిల్లలు మా నాయన అందురుగాని నా నాయన అని అనరు. తండ్రీ అనుటలో వరస కనబడుచున్నది. అనగా దేవుడు, విశ్వాసుల తండ్రి అని కనబడుచున్నది. సృష్టినిబట్టి ఆయన అందరికీ తండ్రి. అయితే ఆయనను అంగీకరించినవారు 'మా తండ్రీ!' అని అనుటలో ఆయన విశ్వాసుల యొక్క తండ్రి అనికూడ కనబడుచున్నది. ఆ తండ్రి పరలోకములో నున్నాడు గనుక విశ్వాసి ప్రార్థించునప్పుడు, తాను పరలోకమునకు వెళ్ళి తండ్రిని పిలుచుచున్నట్టు భావించు కొనవలెను. మత్తయి 23:9లో భూమిమీద ఎవరిని 'తండ్రి' అని పిలువవద్దని ప్రభువు చెప్పెను. అనగా పరలోకపు తండ్రిని, భూలోకపు తండ్రులతో సమానము చేయవద్దని అర్థము. భూలోకపు తండ్రులను

కొట్టివేయవలసియుంటే, కన్న తండ్రిని కూడ కొట్టివేయ వలసి యుండును. పరలోకమందున్న తండ్రిని పిలుచునప్పుడు; పిల్లలు తమ తండ్రిని ఎంత చనువుగా ప్రేమతో పిలుతురో, అట్లు మనమును ఆయనను పిలువవలెను. మనము పాపాత్ములము గనుక న్యాయ ప్రకారము చూచిన అంత చనువుతో మనము ఆయనను పిలువకూడదు. గాని క్రీస్తు ప్రభువు మూలమున ఆయన మనకు తండ్రియైనాడు గనుక ఆ చనువు వచ్చినది.

II) **ప్రార్థన లేక మనవి:** ఈ భాగములో 1. దేవుని గురించిన మూడు మనవులు గలవు.

a) **మనవి:** 'నీ నామము పరిశుద్ధ పరచబడును గాక!' దేవుడు, ఆదినుండి అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల కాలము వరకు దేవుడుగానే ఉండెను అనగా చాటుగానుండెను. అయితే మోషే కాలములో పొద దగ్గర ఆయన నామము బయలు పరచబడెను. నేను 'ఉన్నవాడను' అనియు తర్వాత 'యెహోవా' అనియు బయలుపడెను గనుక ఆయన నామమునకు మహిమ కలుగవలెను. తరువాత 'యేసు' అను నామము సువార్తలలో బయలు పడెను. అపోస్తలుల కాలములో, పత్రికలలో 'క్రీస్తు' అను నామము బయలు పడినది గనుక ఆయన నామమునకు మహిమ కలుగవలెను. పరిశుద్ధ పరచబడును గాక అనగా నామమునకు ఘనత కలుగును గాక! ఆయన నామము పరిశుద్ధ పరచబడకుండుటకు అనేక చిక్కులు గలవు. కొందరు సృష్టిని పూజించుట వలన దేవుని నామము ఘనపరచబడుట లేదు. మరియు ఇతర మత గురువులును, ఇతర దేవుళ్ళని పిలువబడువారును, ఆయన నామము ఘనపరచబడుటకు అడ్డుగా నున్నారు. ఈ అడ్డులన్ని పోయినప్పుడే ఆయన నామము పరిశుద్ధ పరచబడును. గనుక ఈ అడ్డులన్ని, చిక్కులన్ని పోయి, ఆయన నామము పరిశుద్ధ పరచబడును గాక అని మనము ప్రార్థించవలెను. మనము ప్రార్థన చేయునప్పుడు ఇవన్ని తలంచుకొనవలెను.

b) **మనవి:–** 'నీ రాజ్యము వచ్చుగాక' అనగా ఆయన సంఘము వృద్ధిపొందును గాక, ఆయనను నమ్మిన వారి గుంపు వృద్ధి అగునుగాక అని అర్థము. ప్రభువును గూర్చి అందరికిని తెలిసినప్పుడు, అనేకులు రక్షణను అంగీకరించి, సంఘములోనికి ప్రవేశింతురు. ఈ సంఘమే ప్రభువుయొక్క రాజ్యము. 'నీ రాజ్యము వచ్చునుగాక' అన్నప్పుడు, అన్ని మిషనులు చేయు సువార్త పనిని దీవించుము అని జ్ఞాపకముంచుకొని ప్రార్థించవలెను. ఆయన రాజ్యము వ్యాపించుటకున్న ఆటంకములను తొలగించుమని కూడ **జ్ఞాపకము ఉంచుకొని ప్రార్థించవలెను.**

c) **మనవి:–** 'నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక!' పది వేలమందిలో ఒక్కరుకూడ, పరిపూర్ణముగా ఆయన చిత్తమును నెరవేర్చుటలేదు. గాని వెయ్యేండ్ల పాలనలో ఆయన చిత్తము చాలమట్టుకు నెరవేరును. దేవుని చిత్తము నెరవేరకుండుటకు శరీరము, మనస్సు, స్వజనులు, వ్యాధులు, సాతాను, లోకము అన్ని

ఆటంకములే. ఈ ప్రార్ధన చేయునప్పుడు ఈ ఆటంకములన్ని తొలగించుమని జ్ఞాపకముంచుకొని చేయవలయును.

**2. మన శరీర జీవనమును గురించిన మనవి:** 'మా దినాహారము నేడుమాకు దయచేయుము'. స్నేహితులు, తల్లిదండ్రులు, అన్నము, వస్త్రము, గాలి, ఆరోగ్యము, విద్య, వృత్తి, గవర్నమెంటు, శరీరమునకు కావలసినవన్నియు దినాహారములోనివే. 'దినము' అనగా ఈ రోజునకు కావలసినవన్నియు, ఈ రోజుననే అడుగవలెను. రేపటికి, ఎల్లుండికి కావలసినవి ప్రభువు ఇస్తే మనము పుచ్చుకొన వచ్చును. గాని మనకు కావలసినవి ఏ దినమునకు ఆ దినమే అడుగవలెను. ఏ రోజు కారోజే ప్రార్థించే విశ్వాసులమై మనము యుండవలెను. 'దయచేయుము' అనగా ఇమ్ము అని అర్థము. ఇమ్ము అని అనగానే దేవుడిచ్చును గాని, అది మన చేతిలో లేక పోయినయెడల అది మనము పుచ్చుకొనలేదని అర్థము. ఇమ్ము అను మాటకు గ్రీకు భాషలో అర్థమేమనగా 'తండ్రీ! నీవు నాకు దాచి ఉంచినది ఇమ్ము' అని అర్థము. జార్జిముల్లరు దొరగారు రొట్టెల కొరకు ప్రార్థించినప్పుడు ప్రార్ధన ముగించునప్పటికి, బండ్లలో రొట్టెలు వచ్చెను. అనగా ఆయన ప్రార్ధన మొదలు పెట్టకముందే, రొట్టెల బండ్లు బయలుదేరినవి.

ఈ ప్రార్ధనలోని మనవి లోకములో ఎవరైనా చెప్పగలరా? ప్రభువు ప్రార్ధనతో సమానమైన ప్రార్ధన ఎవరైన అల్లగలరా? ఈ రెండు ప్రశ్నలు, క్రైస్తవులు ఒకప్పుడు ఇతరులపై పందెము వేసిరి. 1893 సం॥లో చికాగో పట్టణములో, అన్ని మతములవారు కలిసికొని స్నేహము కలిగియుండుటకు ఒక సభను పెట్టుకొనిరి. ఒకరిమతమును ఒకరు దూషింప కూడదనియు, ఎవరికి నచ్చినవి వారు బోధింప వచ్చునని తీర్మానించుకొనిరి. వారు సభను ముగించబోవునప్పుడు ప్రార్ధనచేసి, ముగించవలెను. ఎవరిని ప్రార్ధన చేయుమనినా తక్కినవారికి అభ్యంతరము గనుక ప్రభువు ప్రార్ధన ఎవరికిని అభ్యంతరముగా నుండదని అందరు కలిసి ఆ ప్రార్ధన చేసిరి. ప్రపంచమంతటనున్న ప్రతినిధులందరు మొదటగా ఇచ్చట కలిసికొనిరి. సృష్టి ఆదినుండి ఈ ప్రార్ధనను మొదటిసారిగా, అందరు కలిసి ప్రార్థించిరి.

**3. మన ఆత్మీయ జీవనమును గురించిన మనవులు: a)** "మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములను క్షమించుము". ***క్రైస్తవులలో ఎవరు ఇతరుల తప్పులు క్షమించరో, వారు నిజముగా క్షమాపణ పొందలేదన్నమాట.*** ఇది ప్రభువు ప్రార్ధనలో మహా భయంకరమైన పాఠము. తాను క్షమాపణపొంది, ఇతరులను క్షమించనివారికి, బైబిలు గొంతుక పట్టుకొనునటువంటిది. ఇది గొప్ప ఆపదగల మనవి. 1) మనము దేవునిని క్షమించుమని కోరినప్పుడు 10 పాళ్ళు క్షమించుమని కోరుదుము గాని 8 లేక 9 పాళ్ళు క్షమించుమని కోరము. అట్లే మనము ఇతరులను సంపూర్తిగా క్షమించవలెను. 2) ఇతరులకు వారుచేసిన కీడునుగూర్చి చెప్పరాదు. 3) మనలో ఇతరులు చేసిన కీడునకు

ఆయాసముంచుకొనరాదు. 4) వారు కనబడినప్పుడు వారుచేసిన కీడు జ్ఞప్తికి తెచ్చుకొనకూడదు. 5) మీరు ప్రార్థనచేయునప్పుడెల్ల పగవానిని క్షమించవలెను. 6) మనము క్షమాపణ కోరకపోయినను ప్రభువు క్షమించెను. ఇది చిత్రమైన సంగతి, శత్రువులను క్షమించెను. మనము ఇతరులను క్షమించలేని యెడల 'పరలోకపు తండ్రీ! అని ఆయనను పిలువనే కూడదు, నీ రాజ్యము వచ్చుగాక అని అనకూడదు. అప్పుడాయన నన్ను ఎందుకు పిలువవలెను? రాజ్యము జోలి నీకెందుకు? అని ఆయన అడుగును. 7) దేవుడు మనలను క్షమించినాడు గనుక మనము ఆయనకు ఋణస్థులము, గనుక మనము ఇతరులను క్షమించవలెను.

b) "మమ్ము శోధనలోనికి తేకుము". శోధనలోనికి తేవద్దు అనగా అర్థమేమి? ప్రభువుకూడ కొన్ని మారులు మనలను శోధనలోనికి తీసికొని వచ్చునన్నమాట. ఆదాము, హవ్వలతో దేవుడు– 'మేలు కీడు తెల్పు వృక్షఫలములు తినవద్దు' అని చెప్పెను. గాని హవ్వ తన హద్దు (circle) దాటి ముట్టినది, చూచి ఊరకుండిన బాగుండును కాని ముట్టినందున తినవలసి వచ్చెను. శోధనలు రెండు రకములు 1. పాప శోధన 2. విశ్వాసపరీక్ష శోధన. మొదటిది సైతాను పంపునది. రెండవది ప్రభువు రానిచ్చునది. పాప శోధనలోనికి తేకుండునట్లు మనము ప్రార్థన చేసికొనవలెను. దేవుడు చాలమారులు పాపములు క్షమించి, క్షమించి చివరకు క్షమించడు. ఇక కృప ఆగిపోవును. దేవుడు అట్టివ్యక్తిని నాశనమునకు అప్పగించి వేయును. ఆ మనిషి అధోలోకమునకు పోవును. ఇట్టి గతి యూదా ఇస్కరియోతునకు, కయీనునకు, సౌలునకు కలిగెను. క్షమాపణ కోరనివారును, తప్పు దిద్దుకొనని వారును నరకములోనికి పోవుదురు. ఒకానొకప్పుడు ఇట్టివారికి ప్రభువు శ్రమలు పంపి, వారు క్షమాపణ కోరుకొనునట్లు చేసి, వారిని రక్షించును. కొందరు పాపము చేయుచు, క్షమాపణ పొందుచు, మరల శోధనలో పడుచుందురు. ఇట్టి వారికి, పై వారికి కూడ ఈ మనవి అవసరము.

c) మన ఆత్మీయ జీవనమును గురించి చేయు మనవులలో మూడవది: "కీడు నుండి తప్పించుము", పై చిక్కులన్ని కలిపి కీడు. దేవుని నామము పరిశుద్ధ పరచబడ– కుండుటకు గల ఆటంకములు, ఆయన రాజ్యము వృద్ధికాకుండుటకు గల అడ్డులు, ఆయన చిత్తము భూలోకములో నెరవేరకుండ చేయునవన్ని, మన ఋణస్థులను క్షమింపలేక పోవుట, శోధనలో పడుట మొదలగున వన్నియు కీడు అనబడును. మరణమా! నీ ముల్లెక్కడా? మరణమా! నీ విజయమెక్కడా? అని గలదు గాని మరణమా! నీ వెక్కడ! అని అనలేదు. గనుక మరణము ఉన్నది. కాబట్టి, మరణము యొక్క అధికారము నుండి, శక్తినుండి తప్పించుమని వాక్యములోనే గలదు. మరణము కూడ ఒక కీడు గనుక లోకములోనున్న ఈ కీడులన్నిటి నుండి మమ్ములను తప్పించి, పరలోకములో చేర్చుకొనుమని ఈ మనవియొక్క అర్థము.

III. **స్తుతి:** “రాజ్యము, శక్తి, మహిమ నిరంతరము నీవియైయున్నవి. ఆమేన్’. ప్రభువు సంఘమునకు, తమ కిష్టమైన మంచి పనులు చేసికొనుటకు అధికారము నిచ్చెను. సంఘము యేసు ప్రభువు వలన పొందిన స్వతంత్రతనుబట్టి, తన దృష్టికి ఏది యోగ్యమో అది చేయవచ్చును. గనుక సంఘము ఈ స్తుతిని ప్రభువు నేర్పిన ప్రార్ధనకు చేర్చినది. ఈలాగు సంఘము కలుపకూడదని కొందరు అనుచున్నారు. మరికొందరు సంఘమునకు ఆ మాత్రము స్వతంత్రత ఉండకూడదా! అనుచున్నారు. ఈ స్తుతి చేర్చుటలో తప్పులేదు. రాజ్యము– సర్వత్ర వ్యాపించుట, శక్తి– ఆయనలో నున్నదంతయు బయలుపర్చుట. ప్రభావము, తేజస్సు– ఇవన్ని ఆయనకే చెందును. ‘ఆమేన్’ చేసినచో, ప్రార్ధన నెరవేరునుగాక అని కోరుదుము. ప్రభువుకూడ ‘ఆమెన్’ అనును. ‘గాక’ అనగా, కోరిక బయలుపర్చుట. నా క్రియలవల్ల, నా జీవితమువల్ల దేవుని రాజ్యము వచ్చును గాక. ఆయన నామము పరిశుద్ధ పరచబడును గాక! అనే అర్ధముతో మనము ప్రభువు ప్రార్ధన చెప్పవలెను.

# ప్రభువు ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడునుగాక! అనగా ఆయన నామము ఏలాగు పరిశుద్ధ పరచబడును? మన హృదయములో కల్మషమంతయు పోయి మనకు పరిశుద్ధమైన హృదయము కలిగినప్పుడు, ఆయన నామము పరిశుద్ధ పరచబడుచున్నది. నీ రాజ్యము వచ్చునుగాక అని మనము ప్రార్థించుచున్నాము. అయితే ఆయన రాజ్యము వచ్చునట్లు మనము చేయుచున్నామా? ఆయన వాక్యమును మనము ఇతరులకు చెప్పినప్పుడు, వారు విని, ఆ వాక్యమును అంగీకరించుట ద్వారా వారి ఆత్మ రక్షింపడినప్పుడు ఆయన రాజ్యము వచ్చుచున్నది.

ఆయన నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు, భూమియందును నెరవేరును గాక! అని చెప్పుచున్నాము. పరలోకములో దూతలు అందరు ఆయన చిత్తము నెరవేర్చుచు రాగా దూతలలో ఒక దూత ఆయన చిత్తమునకు వ్యతిరేకముగా నడచి శపింపబడి, ఈ లోకములోని ఆదాము హవ్వల దగ్గరకు వచ్చి, వారిని పాపములో పడవేసి ఆయనను సిలువవేసినది. అయినప్పటికిని ఆయన సాతానును, మరణమును జయించివేసి, లేచి తన తండ్రి చిత్తమును ఈ భూలోకములో నెరవేర్చినారు. ఆయన చిత్తము భూమియందు ఏలాగు నెరవేరుచున్నది. మనము ఆయన చిత్తమును నెరవేర్చుటను బట్టియే కదా!

ఈ భూలోకములో అనేకులు ప్రభువు చిత్తమును నెరవేర్చవలెనని చూచుచున్నారు గాని ఏదో ఒక అసూయ వారిలో గలిగి ఆయనను సిలువ వేయుచున్నారు.

మా దినాహారము నేడు మాకు దయచేయుము అని అనుచున్నాము. అయితే అనుదిన ఆహారమనగా ఏమనుకొనుచున్నారు? దినాహారమనిన భూలోక సంబంధమైన భోజనమని మాత్రమే అనుకొనుచున్నారా? 'భూలోకపు తండ్రి రొట్టెనడిగిన రొట్టెకు బదులుగా పామునిచ్చునా? అట్లయిన పరలోకపు తండ్రి తన్ను అడుగువారికి పరిశుద్ధాత్మ (ఆహారము)ను అంతకంటె ఎక్కువగా ఇచ్చును అని వాక్యము చెప్పుచున్నది. అందుచేత ఈ భూలోక సంబంధమైన వాటికంటెను, పరిశుద్ధాత్మను అనుదినాహారముగా మనము భుజించుచున్న యెడల, ఈ లోక సంబంధమైన దినాహారముకూడ కలిగియున్నట్టే.

'మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములను క్షమించుమని అడుగుచున్నాము. ఈ భూలోక సంబంధమైన మనుష్యులు చిన్న సహాయము మనకు చేసినయెడల అది ఋణమే కదా? మరొక పర్యాయము అతడు కనబడినప్పుడు 'సహాయము చేసినాడు, వీని *ఋణము మనకెందుకు?'* అని చెప్పి ఏదో ఒక సహాయము చేయుదుము.

ఆయన మొదటే ప్రయాసపడి మనలను మట్టితోచేసి, అన్నియు అమర్చి ఆత్మను మనలోనికి ఊదుట ఋణమే కదా! అదేగాక మరల మన పాపమును సిలువమీద మోసి మరణము పొంది తిరిగిలేచుట ప్రయాసమే కదా! నిజముగా దీనినిబట్టి చూచిన యెడల మనము ఆయనకు ఎంత ఋణస్థులమైయున్నామో కదా! ఈ ఋణమును మనము ఏలాగు తీర్చగలము? ఈ

లోకసంబంధమైన మనుష్యులు మనకు సహాయము చేసినప్పుడు అది ఎట్లు తీర్చుదుమా! అని ఆలోచించగా, ఏదో ఒక వస్తువు నియ్యగా వారి ఋణము తీరిపోవుచున్నది. నిజముగా మనము ప్రభువు ఋణము తీర్చవలెననినా, ఎన్ని మారులు ఆయన సన్నిధిలోనికి వచ్చి, మోకాళ్ళమీద ఉండి ఎన్ని స్తుతులు స్తోత్రములు అర్పించినప్పటికిని ఆయన ఋణమును తీర్చలేము. ఇంకను ఆయనకు ఋణస్థులమై ఉందుము గనుక మమ్ములను క్షమించుమని ప్రార్థించవలెను.

షరా: కొందరు క్రీస్తు ప్రభువు దేవుడైతే ఆయన ఎందుకు శ్రమలు పొందవలెను? అని అడుగుచున్నారు. ఈలాగు వారు తెలియక అడుగుచున్నారు.

లోక సంబంధమైన తల్లి ఒక బిడ్డను కనవలెనని 9 నెలలు ప్రయాసపడి, ఎంతో ప్రసవవేదన పడి కనును. పిమ్మట ఆ బిడ్డకు జబ్బు వచ్చిన యెడల బిడ్డకు బదులుగా, తల్లి పత్యముండవలెను. లేనియెడల ఆ బిడ్డయొక్క స్థితి ఏమైపోవునో తెలియదు గనుక ఆ బిడ్డ బాగుపడు పర్యంతము పత్యముండి, వానిని బాగు చేసికొనును.

అదే ప్రకారము మొదట దేవుడు ఎంతో ప్రయాసముతో మనుష్యులను కలుగజేసినప్పటికినీ వారు పాపములో పడి పోయినప్పుడు, వారి పాప దోషమును పోగొట్టుటకు ఈ భూలోకమునకు వచ్చి, ఇన్ని కష్టములు, శ్రమలుపొంది, సిలువమీద ఆయన రక్తమును చిందించి, మన పాపములను దోషములను కడిగివేయుచున్నాడు. అందుకొరకే ఆయన ఇన్ని కష్టములు, శ్రమలు పడవలసి వచ్చెను. ఆయన శ్రమలు, కష్టములు పడకుండిన యెడల మనకు రక్షణలేదు. ఆయనను అనేక విధములుగా పాపకారకుడగు అపవాది కష్టపెట్టినను ఆయన మౌనముగా నుండెను గనుక ఆయన అపవాదిని జయించెను.

'మేము మనుష్యుల తప్పులు క్షమించిన ప్రకారము మా తప్పులు క్షమించుము అని చెప్పుచున్నాము' గాని మనము నిజముగా మనుష్యుల తప్పులు క్షమించుచున్నామా? మనుష్యుల తప్పులు క్షమించుటలేదు. మనకు ఎవరిమీదనైనను కోపము, అసూయ ఉన్న యెడల ఎన్నో దినములు ఆ కోపము ఉంచుకొందుము. ఆయన ప్రేమ మనలో ఉన్నయెడల ఎందుకు ఒక బిడ్డను క్షమింపలేము? ఆయన ప్రేమ మనలో లేదు గనుక క్షమింపలేక పోవుచున్నాము. ఇప్పుడైనను, అనగా ఆయన రాకడ సమీపముగా ఉన్నది గనుక ఆయన ప్రేమను మనలోనికి రానిచ్చి, ఇతర బిడ్డలమీద ఉన్న అసూయ, కోపము, క్రోధము సరిచేసికొనవలెను. ఎందుకనగా, తనను ద్వేషించి, సిలువ వేసినవారని క్షమించుమని ప్రార్థించునపుడు, ఆయన అంతరింద్రియములలో ఏ అసూయయు లేదు. కేవలము నిర్మలమైన మనస్సుతోను, పరిశుద్ధాత్మ జీవముతోను ఆయన వారిని క్షమించిరి.

మమ్మును శోధనలోనికి రానీయక కీడునుండి తప్పించుము అని శోధనలో పడకుండునట్లు ప్రార్థన చేయుచున్నాము. గనుక ఇక్కడ గెత్సేమనే తోటలో శిష్యులకు ప్రభువు చెప్పినమాట 'మీరు శోధనలో పడక మెళకువగా నుండుడి' జ్ఞాపకము తెచ్చుకొనవలెను. మనము శోధనలో

పడకుండ ఉండవలెననిన యెడల పరిశుద్ధాత్మ తండ్రి మనమీద కుమ్మరింపబడవలెను. అప్పుడు మనము మెళుకువగా నుండి శోధనలో పడకుండ, రాకడకు ముందువచ్చు శోధనకాలమునుకూడ తప్పించుకొని ఎత్తబడి, ప్రభువును ఎదుర్కొనగలము. గనుక ఆ విధమైన శోధనను తప్పించుకొనునట్లుగా ప్రార్ధనమెట్ల ప్రకారము ప్రార్థించవలెను.

రాజ్యము, బలము, మహిమ నీవైయున్నవనగా ఆయన వాక్యమును బోధించు- టనుబట్టి ఆయన రాజ్యమును వ్యాపింప చేయుచున్నాము. ఆయన వాక్యమే ఆత్మలకు బలము. ఆయన వాక్యము వినగా ఆసక్తి కలిగి, మోకాళ్ళమీద ఉండి ప్రార్థించినప్పుడు ఆత్మబలము పొందగలము. ఆ ప్రకారము 'మనము, ఇతర బిడ్డలు ఆయన మాటలను ఆత్మీయ సంబంధమైన మాటలని గ్రహించి, వాటి ప్రకారము జీవించుటయే'; బలము, రాజ్యము, మహిమ నిరంతరము నీవైయున్నవని చెప్పుటకు అర్ధము. ఆ విధముగ నడచుకొనినయెడల రాజ్యము బలము, మహిమ నిరంతరము ఆయనవైయున్నట్టే. ఆమేన్.

*మనము మన శత్రువులను క్షమించుటలేదు గనుక ప్రభువు ప్రార్ధన చేయకూడదు. అని కొందరు వాదించుచున్నారు. అట్టివారికి నేను చెప్పునదేమనగా క్షమింపనివారు బైబిలు చదువకూడదు, గుడికి వెళ్ళకూడదు, చందా వేయకూడదు,* ***ఒక్క ప్రభువు ప్రార్ధన చేయుటయే మానుట ఎందుకు? అన్నియు మానవలెను.***

Bible Mission HQ Guntur

# ప్రభువు ప్రార్ధనయొక్క విభజన

పరలోకమందున్న మాతండ్రీ! 1) నీ నామము పరిశుద్ధ పరచబడును గాక. 2) నీ రాజ్యము వచ్చునుగాక. 3) నీ చిత్తము పరలోకమందేలాగు నెరవేరుచున్నదో, ఆలాగే భూమియందును నెరవేరును గాక. ఈ మూడును కేవలము దేవునికి సంబంధించిన విషయములుగా ఏర్పడియున్నవి. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. ఇది మానవ జీవితమును గురించినదై యున్నది. 1) మా ఋణస్తులను మేము క్షమించిన ప్రకారము మా ఋణములను క్షమించుము. 2) మమ్మును శోధనలోకి నడిపింపకుము. 3) కీడునుండి తప్పించుము. ఈ మూడును మనుష్యుని భక్తి జీవితము గురించి ఏర్పడియున్నవి. రాజ్యము, బలము, మహిమ, నిరంతరము నీవై యున్నవి ఆమేన్. ఇది ముగింపును, స్తుతి పంక్తియునై యున్నది.

పరలోకమందున్న మా తండ్రీ! అనునది ప్రార్ధనంతటికి ప్రవేశ పంక్తియై యున్నది. మా తండ్రీ! అనునది పేరు కాదుగాని బంధుత్వ పదము. అప్పుడు మన దృష్టి మోక్షమువైపు ఉండును. తండ్రీ! అను మాటలో దేవుడు తన పేరు ఇంకా బైలుపరుపలేదు. నీ నామము అన్నప్పుడు, ఆయనకు ఒక పేరున్నట్లు తెలిసినది. ఆ పేరు, దేవుడు తుదకు లోకములో అవతరించిన "యేసుక్రీస్తు" అని తెలియుచున్నది. అప్పుధు మనదృష్టి అంతా, ఆయన అవతార స్థానమైన భూమిమీద నున్నది. రాజ్యమన్నప్పుడు మన దృష్టి, ప్రపంచ మందంతటను వ్యాపించియున్న క్రైస్తవ సంఘము తట్టు ఉన్నది. నీ చిత్తము అన్నప్పుడు మన దృష్టి పైకిని క్రిందికిని ఉన్నది. పైన దేవదూతలు ఆయన చిత్తమును నెరవేర్చుచున్నారు. భూమిమీద మనుష్యులు కూడ ఆయన చిత్తము నెరవేర్చవలెనని కోరుచున్నారు, అనగా భక్తిగా నడచుట. ఆయన చిత్తము భూమిమీద పూర్తిగా నెరవేరుట లేదుగాని, వెయ్యేండ్ల పరిపాలనలో పూర్తిగా నెరవేరును.

ఆహారమనగా శరీర జీవనమునకు కావలసినవన్నియు– ఇండ్లు, వాకిళ్ళు, ధనధాన్యములు, స్వజనులు, సంఘస్థులు, ప్రభుత్వములో అధికారులు, స్నేహితులు మొదలైన వారుకూడ శరీరాహారమునకు సంబంధించినవారే. కాని ఇందులో ఆత్మీయ ఆహార విషయము కూడ జ్ఞాపకము వచ్చును. ఎంత శరీర ఆహారమైనను, అందులో దేవుని దీవెన లేకపోతే మన జీవనమునకు సహాయకారిగా నుండనేరదు.

మమ్మును క్షమించుము అను మాటలో పాపపు టొప్పుదల యున్నది. ఇది ఆపదలో గల మనవి. ఎందుకనిన శత్రువులను మనము క్షమించలేక పోతున్నాము గనుకనే కొందరు ప్రభువు ప్రార్ధన చేయరు. 'శోధన' అను మాటలో దేవా! క్షమించినావు గాని మరల పాపములో పడిపోకుండునట్లు ఈ మనవి చేయుచున్నానని అర్ధము. కీడు అను మాటలో లోకములోని పాపమంతయు జ్ఞాపకము వచ్చుచున్నది. గనుక దేవా! మమ్మును ఈ లోకమునుండి తప్పించి మోక్షమునకు చేర్చుకొనుము అని వేడుకొనుచున్నాము.

# సమర్పణ ప్రార్థన ప్రసంగము

సమర్పణ అనగా 'బలి' లేక కలిగియున్న యావత్తు ప్రభువు స్వాధీనము చేయుట అని అర్థము. నాకు కలిగియున్న యావత్తు నా ఇష్టమును బట్టి వాడుకొనను, నీ ఇష్టమునుబట్టియే వాడుకొందును. ఇవి సుఖముగా నున్నప్పుడు చేయు సమర్పణలు. అయితే కష్టకాలములో కూడ ఇట్టి సమర్పణా స్థితి కలిగి యుండవలెను. ఈ ప్రకారము చేయునప్పుడు నాకు ఆపదలు, ఆటంకములు వచ్చినను నీ చిత్త ప్రకారము చేయుదును.

1) ఆపదను బట్టి బాటసారి, మంచి సమరయుడు చేసినదాని నంతటికి సమ్మతించెను. గాయములు కట్టనిచ్చెను, వాహనముమీద ఎక్కించినప్పుడు ఊరుకొనెను, పూటకూళ్ళవాని కప్పగించినప్పుడును ఊరుకొనెను, అంతయు చేయనిచ్చెను. ఆలాగే మనమును ఆయన కప్పగించుకొనిన యెడల, ఆయన ఎంత ఉపకారమైనను చేయగలడు.

2) 'వారు నీమాట వినరు, అయినప్పటికిని నీవు వెళ్ళి చెప్పవలెను' అని దేవుడు యెహెజ్కేలుతో పలికెను (యెహెజ్కేలు 2:4) యెహెజ్కేలు దేవుని చిత్తమునకు సమర్పణ అయినాడు గనుక ఎదురు చెప్పలేదు. వెళ్ళి వారికి బోధించినాడు. అలాగు దేవుడు మిమ్మును సువార్త అక్కరలేని వారియొద్దకు పంపిన యెడల మీరు వెళ్ళుదురా?

3) నీ సహోదరుని మీద నీకు ఏదైన కష్టముంటే ముందు సమాధానపడి, అప్పుడు బలిపీఠమునొద్దకు రమ్ము అని ప్రభువు ఉపన్యాసములో సెలవిచ్చెను (మత్తయి 5:24). ఇది కష్టమైన పని. చందావేయుట సులువైన పని గాని సమాధానపడుట కష్టమైనపని. దేవుని వాక్యమిచ్చే సలహాకు సమర్పణయైనవారు వాక్యములోనున్నట్టు చేయుదురు. మీరు ఆలాగే చేయగలరా?

4) పేతురు యోహానులు గార్ధభము విప్పి తీసికొనివచ్చి, ప్రభువు చెప్పినట్లు చేసిరి. ఆలాగే ప్రభువు మీతో 'ఫలానిచోటికి వెళ్ళి, ఫలాని పనిచేసి రండి' అని చెప్పిన యెడల సందేహించకుండ చేయువారే, ఆయనకు సమర్పణ అయినవారు. సమర్పణ అయినవారు ప్రభువుయొక్క కోరికను తప్పక నెరవేర్చుదురు.

5) ఐదువేలమందికి ఆహారము పెట్టకముందు, ప్రభువు శిష్యులతో– ప్రజలను బారులుగా కూర్చుండబెట్టవలసినదని చెప్పెను. ఆ ప్రకారము వారు చేసిరి. ఇందరకు సరిపోయే రొట్టెలు లేవుకదా! వచ్చిన తరువాత కూర్చుండ బెట్టవచ్చునని వారు ప్రభువునకు ఎదురు చెప్పలేదు. ఆలాగే సమర్పణ అయినవారు ఆటంకమును తలంచక ప్రభువు చెప్పినట్లు చేయుదురు.

6) ఒక స్త్రీ, తనకున్నది యావత్తు చందావేసెను. యూదుల నిబంధన ప్రకారము పదియవ భాగము వేయవలెను. నీకున్నదంతయు వేయుము అని ప్రభువు చెప్పక పోయినను ఆమె

వేసినది. ప్రభువు చెప్పకపోయినను మనస్సాక్షికి తోచిన మంచి కార్యములు చేయువారే, సమర్పణయైనవారు. చెప్పినదే చేయలేక పోవుచున్నాము, చెప్పనిది మాత్రము చేయగలమా? అని పలుకువారు సమర్పణయైన వారుకారు.

7. నీటిమీద నడువవలసినదని ప్రభువు పేతురుతో చెప్పెను. మునిగిపోయినను భయము లేకుండ, ప్రభువు మాటకు సమర్పణయై కొంతదూరమైనను నడువగలిగెను. అసాధ్యమైన పని ప్రభువు చెప్పినప్పుడు పేతురు చేసెను. ఆలాగే అసాధ్యమైన పనులు ప్రభువు చెప్పినప్పుడు చేయువారే సమర్పణ అయినవారు.

8) ప్రభువు ఒకనిని చూచి నన్ను వెంబడించుమనెను. అతని దృష్టి తన తండ్రిని సమాధి చేయవలెనని ఉన్నది. మన ఇష్టము ఒక రీతిగా నున్నప్పుడు, ప్రభువు వద్దని చెప్పిన యెడల మానివేయ గలరా? అట్లు ప్రభువు వద్దని చెప్పినను, మానువారే సమర్పణ అయినవారు.

9) ప్రభువు డెబ్బదిమందిని ఏర్పరచి సువార్తకు పంపెను. ఇది సువార్తలలో, మనబోధ నిమిత్తము వ్రాయబడెను. ప్రభువు మనలను వేరుగాపిలిచి 'సువార్తకు వెళ్ళండని' చెప్పనక్కరలేదు. ఒక్కమారు చెప్పినా, అందరకు చెప్పివేసినట్టే. దానికి లోబడినవారే సమర్పణయైనవారు.

10) యెఫ్తా అను న్యాయాధిపతి జయముపొంది ఇంటికి వచ్చినప్పుడు, తన కుమార్తె ఎదురుగా వచ్చెను. ఆమెను దేవునికి సమర్పించి వేయవలసి వచ్చినను, అతడు వెనుకాడక సమర్పించెను. (న్యాయాధిపతులు 11వ అధ్యాయము) ఆలాగే మీ బిడ్డలలో ఎవరినైన ప్రభువునకు సమర్పించుమని చెప్పిన యెడల, ఆలాగు చేయగలరా? అట్టివారే సమర్పణ అయినవారు (యెఫ్తా కుమార్తె కూడ దానికి సమ్మతించెను)

11) అబ్రాహాము దైవబలము గలిగినవాడై, తన ఏక పుత్రుని తన చేతులతో బలివేయ నిశ్చయించుకొనెను. ఇది తల్లిదండ్రులైనవారు గ్రహింపలేని గొప్ప సమర్పణ. అట్లు మానవుల గ్రహింపునకు అర్ధముగాని కార్యములు, ప్రభువు కొరకు చేయువారే, సమర్పణా పరులు. (ఇస్సాకుకూడ అందుకు సమ్మతించుట ఆశ్చర్యమే).

12) ***'నా తండ్రి చిత్తము నెరవేర్చుటయే నాకాహారము'*** అని యేసు ప్రభువు చెప్పెను. దేవుని చిత్తము నెరవేర్చినప్పుడు మనకు అన్నము తిన్నట్టుగానే ఉండునా? అట్లుండిన యెడల మీరు సమర్పణాపరులే.

# స్వార్పణ

పైనున్న గాలి, ఎండ, వర్షము; క్రింద ఉన్న భూమి, ధనము, పిల్లలు; ఇంట్లో ఉన్నవి; ఒంట్లో ఉన్న ప్రాణము; అన్నియు దేవునికి అర్పించవచ్చును గాని ఆత్మ ఒక్కటే, మనిషి దేవునికి అర్పించలేడు. ఆత్మ అనగా మనిషి తనయొక్క ఇష్టమును దేవునికి అర్పించలేడు, ఆలాగు అర్పించగలిగిన యెడల అది స్వార్పణ.

**స్వార్పణ పాఠము:–** భూమి, జనము, ధనము, ఎండ, గాలి, వాన, ఇంట్లోని సామాను, శరీరము, ప్రాణము ఇంకా ఏమేమి ఉన్నాయో, అవి అన్నియు దేవునికి అర్పించుటకు నరుడు ఒప్పుకొనవచ్చును. అయితే ఇది స్వార్పణ కాదు. ఆత్మను అనగా హృదయమును, అనగా స్వంత ఇష్టమును అర్పించుట స్వార్పణ అనబడును. శరీరము కాల్చబడుటకు ఇచ్చినను, ప్రేమలేనివాడవైతే ప్రయోజనము లేదని Iకొరింథి 13వ అధ్యాయములో ఉన్న సంగతిని బట్టి చూడగా– **అర్పణము, స్వార్పణము** కలవు అని బోధపడుచున్నది. అనగా అర్పణ వేరు, స్వార్పణ వేరని తెలియుచున్నది. 'వీరు ఎక్కువ ధనము ఇచ్చినవారు', అని ప్రభువు ధనవంతుల కానుకలను మెచ్చుకొనలేదు. ఆయన కేవలము స్వార్పణనే లక్ష్యపెట్టెను. దీనికి సంబంధించి సంఘ చరిత్రలో అనేక కథలు ఉన్నవి.

**మొదటి కథ:–** ప్రారంభ హతసాక్షులను చూచి, కొందరు హత సాక్ష్యమునకు ఒప్పుకొనిరి. పైన ఉదహరించిన అర్పణములు, వారు ఇష్టముతోనే వేసియుందురు. అయితే స్వార్పణ అనునది వేరొకటి కలదు. అది ఏదై యుండును? **అర్పణలో మనుష్యుడు తన లాభమును కోరుట కలదు**. అందుచేత వానికి రాణింపులేదు. అర్పణములో లాభము ఏదనగా కీర్తికోరుట. ఉపచారము *(మేలు) కల్గుననే ఒక తప్పు అభిప్రాయము కల్గియుండుటవల్ల* కూడ అర్పణములిచ్చుట జరుగును. గనుక ఇదికూడా స్వార్పణ కాదు. ఒకరు తన ఆత్మీయ మేలు నిమిత్తము నిద్రమాని రాత్రింబగళ్ళు, మోకాళ్ళమీద ప్రార్థనలో గడుపవచ్చును. అయితే ఇదియు స్వార్పణ కాదు. మరియొకరు ఆదికాండము మొదలు ప్రకటన వరకు కంఠత చేసి, వాక్యమును బాగా అర్థము చేసికొనే వాక్యభాగ్యము కల్గియుందురు. ఇందువల్ల జ్ఞానము కల్గుననే తృప్తి వారి ఉద్దేశమై యున్నది. ఇదియు స్వార్పణలో చేరకపోయి యుండవచ్చును. మరియొకరు సుఖ సంతోషమును చూడక, జీతనాతములు లెక్కచేయక, మనుష్యుల నిందలు నిర్లక్షపెట్టి, శక్తి వంచనలేక సువార్త పని చేయుదురు, గొప్ప బోధకులమని పేరు పొందుదురు. సువార్త నిమిత్తము అంతయు విసర్జింతురు. దీనినికూడా స్వార్పణలో చేర్చకపోవచ్చును.

**1వ కథ:** సర్ ఐజక్ న్యూటన్ మహాగొప్ప పండితుడు. అతడు చెప్పినదేమనగా 'లోకమున భక్తులని పేరు పొందిన వారిలో కొందరు ఎందుచేత నరకములో యున్నారు?' (యేసు నామమున అద్భుతములు చేసిన వారిని చూచి ప్రభువు– నేను వారిని ఎరుగనన్నాడు). వారుకూడ ఈ తరగతిలో చేరినవారే! బట్లరు అనే దైవజనుడు క్రీస్తు దైవత్వమును గూర్చి అంగీకరించి, అనేక గ్రంథములు రచించి, చివరకు అవిశ్వాసి యాయెను.

**2వ కథ:** భూలోకములో ప్రసిద్ధి చెందిన దురంతకులు (పాపాత్ములు) మోక్షములో యున్నారేమి? (ఉదా: సిలువ మీద దొంగ, 7 దయ్యములు పట్టిన మగ్ధలేనే మరియ).

**3వ కథ:** ఇది ఏమిటి? దేవుడు నన్ను మోక్షములోనికి తీసికొని వచ్చినాడు! అని కొందరు ఆశ్చర్యపడుదురు. ఈ మూడు ఆశ్చర్యమైన సంగతులు జ్ఞాపకముంచు కొనండి. స్వార్పణ చేయుట ద్వారా మహా ఆశ్చర్యమైన, మహా ఉన్నతమైన స్థితిని పొందుదురు. ***ఇది సంపాదించుకొనుట సులువే గాని కాపాడుకొనుట కష్టము, గనుక జాగ్రత్త పడుము.***

**స్వార్పణ: 1.** స్వార్పణను గ్రహించుటకు, అబ్రాహాము ఇస్సాకును అర్పించిన కథ చదవండి. యెఫ్తా తన కుమార్తెను దేవునికి అర్పించిన కథ చదవండి. స్వార్పణ అనగా బైబిలులో ఏమి యున్నదో అట్లు చేయుట. చదివిన తరువాత, నేర్చుకొన్న తరువాత, తీరా చేయవలసి వచ్చినప్పుడు ప్రశ్నించకూడదు. ఇట్లు చేయుటే స్వార్పణ. 'గ్రంథపు చుట్టలో వ్రాయబడిన ప్రకారము నీ చిత్తమును నెరవేర్చుటకు మేము వచ్చియున్నాము' అని చెప్పవలెను.

2వది: దేవుడు బయలుపర్చినది నెరవేర్చుట: స్వార్పణ చేస్తేనే గాని దేవుడు సంగతులు బైలుపర్చడు.

3. మన స్వంత చిత్తమును వదలుకొని, దేవుని చిత్తమును చేయుట: దేవుని చిత్తము నెరవేర్చుట, ఎంత కష్టమో స్వంత చిత్తమును వదలుకొనుట కూడ అంత కష్టము.

4. ***ఇముడ్చుకొనుట:*** అనగా సంగతులు తెలిసినప్పుడు, యోగ్యులైనవారు వాటిని ఇముడ్చుకొందురు, అనగా వెల్లడి చేయరు. (అయితే కూటస్థులకు చెప్పవచ్చును).

5. శ్రమలు వచ్చినపుడు సహించలేరు. ఆలాగే మహిమ తెల్సినపుడు ఓర్చుకొనలేరు.

6. అంగీకరించుట: మీరు విన్నారు, గ్రహించినారు, ఆనందించినారు, నమ్మినారు. అయితే అంగీకరించినారా? **స్వార్పణ చేయువారు అంగీకరింతురు.** చిన్న పిల్లలు దేవుని రాజ్యమును అంగీకరింతురని ప్రభువు చెప్పిన మాట వల్ల తెలియుచున్నది. అంగీకరించుట అనగా మహా బాగాయున్నదని ఒప్పుకొనుట. ఇంకొకటి– అంగీకరించుట అనగా పుచ్చుకొనుట, అందుకొనుట, హక్కుగా చేసికొనుట, స్వతంత్రించుకొనుట, దేవుడు ఇచ్చే వరకు కనిపెట్టక ఆయన చేతిలోనుండి తీసికొనుట. ***మనము అడిగినది మరల అడుగకుండుట వల్ల అంగీకరించితిమని ఋజువు అగుచున్నది.***

7. చనిపోవుటయే స్వార్పణ: మీ స్వభావములో పుట్టే చెడ్డ ఆశలన్నిటిని చంపి వేయవలయును. పిశాచి పుట్టించే తలంపులకు సహితము లోబడకూడదు. 'దొంగిలిన వాడు ఇకమీదట అక్కర గలవానికి పంచిపెట్టవలయును' అను వాక్యము జ్ఞాపకము తెచ్చుకొనండి. మన స్వభావము పూర్తిగా మారిపోవలెను. ప్రశ్నలు వేయవచ్చును గాని అవిశ్వాసములో నుండి అవి రాకూడదు. విశ్వాసములో నుండియే రావలెను. నాయందు జీవించుట, నేనుకాదు; క్రీస్తే నాయందు జీవించుట అయియున్నాడు.

**స్వార్పణ ప్రార్థన:** 1. తండ్రివైయున్న తండ్రీ! కుమారుడవై యున్న తండ్రీ! పరిశుద్ధాత్మవై యున్న తండ్రీ! త్రియేకుడవైయున్న తండ్రీ! నేను నిన్ను నా ప్రియమైన తండ్రిగా భావించుచున్నాను. నన్నునూ, నీ ప్రియమైన బిడ్డగా భావించుకొందును, ఆలాగుననే ప్రవర్తించెదను. ఆమెన్.

2. నేను అన్న వస్త్రాదులను గాని, ధన ధాన్యాదులను గాని, భూమిని గాని, విద్యను గాని, ***తుదకు మోక్షమును గాని, కోరుకొనుట లేదుగాని నిన్నే కోరుకొనుచున్నాను.*** నీవే నాకు సమస్తమై యున్నావు. నేను నీ మీదనే ఆనుకొందును, నిన్నే నమ్ముదును, నిన్నే చూతును. నీవు తప్ప నాకేమియు గొప్ప లేదు. ఆమెన్.

3. 'దేవా! నేను ఏమి చేయకూడదో, ఏమి చేయవలెనో, 'బైబిలు' అనే గ్రంథములో యున్నది. అది చదివి, దాని ప్రకారముగా హాని వచ్చినా, చేస్తాను. పది యాజ్ఞలను బట్టియు, బైబిలులోని ఇతర సంగతులను బట్టియు, నా మనస్సాక్షిని బట్టియు, నీ యాత్మ వెలిగింపును బట్టియు, నన్ను నేను పరీక్షించుకొని నా లోపములు తెలుసుకొని, అన్నియు నీ దగ్గర ఒప్పుకొని దిద్దుబాటు చేసికొందును. ఇట్లు ఊడ్చిన (శుద్ధిచేసికొనిన) పిమ్మట ప్రభువును రానివ్వవలెను.

**ప్రార్థన వినకపోవుటకు కారణములు :**

1) ఆత్మవలన నడిపించబడి ప్రార్థన చేయకపోవుటవలన.

2) మనలో ఏదో ఒక తప్పిదము ఉన్నందువలన.

3) విశ్వాస, నిరీక్షణలు లేకపోవుట వలన.

4) మన ఇష్ట ప్రకారము చేసినయెడల, మనకు ముందుకు ఏదో ఒక ముప్పు రానైయున్నదని దేవుని సర్వజ్ఞాన నేత్రమునకు కనబడుటవలన.

5) 'నెరవేరిన యెడల మనము దానిని సరిగా ఉపయోగించలేము' అని దేవుడు దానిని నెరవేర్చడు.

6) ఆయన గడియ ఇంక రాలేదు గనుక నెరవేర్చడు.

7) మన ప్రార్థన ఆయన వినకపోవుటవలన. అనగా తక్కువ మేలు కల్గింపక పోవుటవల్ల; అనగా ఇక్కడే ఆ ప్రార్థన నెరవేర్చి తక్కువ మేలు కల్గించుట దేవునికి ఇష్టము లేనందున ఆయన మన ప్రార్థన వినడు. గనుక పరలోకములో ఆ ప్రార్థనకు గొప్ప మేలు కల్గించును.

8) ముందుగా పరుగెత్తే విశ్వాసము లేకపోవుటవల్ల దేవుడు మన ప్రార్థన ఆలకించడు.

# ఆదివార ప్రమేయము - I

**ఆదివార ఆచారము:** 1) ఆదివారమున తండ్రియైన దేవుడు సృష్టి పని ఆరంభించెను. ఆదివారమున కుమారుడైన తండ్రి మరణమునుండి లేచెను. ఆదివారమున పునరుత్థానము ప్రకటన ఆయెను. ఆదివారమున మొదటి క్రైస్తవ సంఘము మీద, మొదటిమారు పరిశుద్ధాత్మ కుమ్మరింపబడెను. తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు మూడు గొప్ప విలువైన కార్యములు ఆదివారమున జరిగినందున, సంఘము ఈ దినమును మరువలేకున్నది. అందుచేతనే ఆదివారము ఆరాధన ఏర్పరచుకొన్నది. (ప్రభువు ఆదివారమున లేవలేదని కొందరి అభిప్రాయము.అయితే ఆయన ఆదివారమున లేచుట అబద్ధముకాదు. ఎందుకనిన, 'ఆదివారము సూర్యోదయమునకు ముందే ఆయన లేచెను' అని సువార్తలలో వ్రాయబడియున్నది. ఆ వార్తయే అందరికి ప్రకటింపబడెను. సంఘముయొక్క సంతోషములో ప్రభువుకూడ పాలివాడై యుండుటను బట్టియే, శిష్యులు ఆదివారము కూడుకొన్నప్పుడు ప్రభువు వారిమధ్య నిలువబడెను. ఆదివారము కూడు కొన్నప్పుడు చందా పోగుచేయవలెనని పౌలు వ్రాయుచుండెను. దానినిబట్టి చూడగా, ఆదికాల సంఘమునకు ఆరాధనదినము శనివారము కాదుగాని, ఆదివారమని కనబడుచున్నది.

*1) ఆదివారమున ఉదయము లేవడముతోనే ప్రభువుయొక్క పునరుత్థానము తలంచుకొని విజయస్తుతి చేయవలెను.* 2) సాధ్యమైనంత వరకు శరీర సంబంధమైన పనులుగాని, లోక సంబంధమైన పనులుగాని, ఆటపాటలు గాని లేకుండ నుండవలెను. అనగా బజారుకు వెళ్లుట, ఇళ్ళు వాకిండ్లు అలుకుట, ఊరు ప్రయాణము చేయుట, లోక సంబంధమైన పనిమీద ఒకరి ఇంటికి వెళ్ళుట, లోక సంబంధమైన మంచి మంచి పుస్తకములు చదువుట మొదలగునవన్నియు మానివేయవలెను. (వంట, స్నానము తప్పదుగదా!) క్రైస్తవ దేశములలో కొందరు వంట అంతకు ముందు దినమే తయారు చేసికొందురు, కొందరు అదికూడ తినరు, కొందరు చాలసేపు నిద్రపోరు. *3) కొందరు బైబిలు చదువుటలోను, కీర్తనలు పాడుకొనుటలోను, వ్యాఖ్యానములు చదువు కొనుటలోను, దినమంతయు గడిపివేయుదురు.* ***ఇది మహా మంచివాడుక***. 4) ఆదివారమునకు కావలసినవి అన్నియు శనివారమే సిద్ధపరచుకొనవలెను. అది మనకు సిద్ధపరచుకొనే రోజు. 5) ఆదివారమంతయు మహిమ సంగతులు, పరిశుద్ధ సంగతులు, దైవోపకార కార్యములు ఈ మొదలైనవే తలంపులోనికి, బలవంతముగానైనను రప్పించుకొనవలెను. ఇట్టివి పుస్తకములో వ్రాసికొని ధ్యానించుట మొదలుపెట్టిన యెడల, రాత్రివరకు అట్టి ధ్యానముండును. అంత పెద్దనోట్సు తయారుచేసికొనవలెను. 6) యెషయా 58:13,14లో ఉన్న సంగతులనుబట్టి విశ్రాంతి దినమును గౌరవపరచు వారు ఉన్నత స్థలమును ఆక్రమించుకొందురు. ఎవరు 1) దేవునిని, 2) ఆయన వాక్యమును, 3) ఆయన ఉపకారములను,

4) ఆయన సంఘమును, 5) ఆయన సంకల్పనను (ఏర్పాటును) గౌరవింతురో, వారిని ఆయన గౌరవించును. 6) ఎవరు ఆరాధన దినమును గౌరవింతురో, ఆయన వారిని గౌరవించును. ఎవరు ఆరాధన దినమును గౌరవింతురో, వారి దినములను దేవుడు గౌరవించి దీవించును. 7) ఆదివారము ఎట్లు గడుపవలెనో, ప్రకటన మొదటి అధ్యాయము వలన నేర్చుకొను చున్నాము.

i) యోహాను ఆదివారమున ఆత్మవశుడాయెను. (మనమును మోకాళ్ళ మీదనున్న యెడల, ఆత్మ మనలోనికి ప్రవేశించును).

ii) యోహాను బూరవంటి స్వరము వినెను. (మనముకూడ ఆదివారమున స్వరము వినవలెను).

iii) యోహాను విన్న సంగతులు వ్రాసెను. (మనముకూడ ఆవేళ విను వాక్యములు, ప్రత్యేకమైన పుస్తకములో వ్రాయవలెను).

iv) యోహాను దేవునియొక్క మహిమ స్వరూపమును చూడగల్గెను, అనగా దర్శనము పొందెను. (మనము కూడ ఆవేళ మిక్కిలి స్పష్టముగా ప్రభువును చూడవలెను).

v) ***యోహాను ఆత్మవశమాయెను. చెవులతో వినెను, కంటితో చూచెను.*** ఆలాగు ***వినిన, చూచిన వాటిని వ్రాసెను.*** ఈ నాలుగుపనులు మనముకూడ చేయవలెను.

vi) యోహాను, క్రీస్తు మహిమ ఎదుట శవమాయెను. అప్పుడు ప్రభువు– 'భయపడవద్దు, నేను సజీవుడను, పాతాళ లోకముయొక్క తాళపు చెవులు నా చేతిలో నున్నవి' అని పలికిరి. (మనము అట్లుపడియుండే అవసరము లేదు). పెండ్లికుమార్తె శాఖవారు అట్లు పడరు, సంతోషముతో నుందురు. యోహానుకు అది క్రొత్త అనుభవము గనుక అట్లు జరిగెను.

అప్పటి యోహాను చరిత్ర ఏదనగా వృద్ధుడు, ఖైది, తోటివారందరు చనిపోయిరి. సువార్త చేయవలెనన్న యెడల కట్టు (బంధకములు). షరా: మహిమ యెదుట యోహాను శవమై యుండుట నిజమేగాని, శ్రమలయెదుటను శవమై యుండవలెను. వృద్ధుడు ఆయెననగా, త్వరలో మృతుడు కాబోవుచున్నాడు. 'మృతుల లోకముయొక్క తాళపు చెవులు నా చేతిలోనున్నవని' ప్రభువు చెప్పెను. గనుక మృతుడైనను పరవాలేదు 'నిన్ను పాతిపెట్టుదురు, శవము పాతాళమునకు వెళ్ళును. అనగా భూస్థాపన చేయుదురు. ***అయినను పరవాలేదు, పాతాళలోకపు తాళపుచెవులు నా చేతిలో నున్నవి'*** అని ప్రభువు చెప్పెను. ఈ కన్ను చూడని కథలు, ఆ కన్ను చూచినది. ఆ వృద్ధాప్య హస్తము ప్రకటన గ్రంథమంతయు వ్రాసెను. శరీరముయొక్క కృశింపుతోగాని, నేత్రములతోగాని, జ్ఞాపక శక్తితోగాని, హస్తములతోగాని ఏమియు పనిలేనట్లు, దేవుడు మరియొక ప్రత్యేక బలమిచ్చి, మహిమ చూపించి వ్రాయించెను. బంధకములని, చెర అని, ఖైది అని ఎన్ని ఆటంకములు ఉన్నను, ప్రభువు తన పని చేయించక మానడు. అవన్నియు ఆయనకు అడ్డు రావు.

# ఆదివార ప్రమేయము - 2

**ఆరాధన క్రమము:** ఎవరి ఇష్ట ప్రకారము వారు ఆదివార ప్రోగ్రాము (కార్య క్రమమును) ఏర్పరచుకొన వచ్చును. అయితే వెయ్యేండ్ల పరిపాలనలో జరుగనైయున్న ఆరాధనను, ప్రతి ఆరాధనలోను జ్ఞాపకమునకు తెచ్చుకొనవలెను.

1) సంఘము కూడుకొనగానే కిన్నెరమీద (గిటారుమీద సంగీత వాయిద్యము) ఒక కీర్తన వాయించవలెను. ఇది సంఘమునకు ప్రారంభ ఉద్రేకము కలిగించును.

2) తర్వాత ఒక స్తుతి కీర్తన పాడవలెను లేదా పరిశుద్ధాత్మను పిలుచునట్టి కీర్తనయైనను పాడవలెను.

3) 'తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమందు ఆరాధన ఆరంభించుదము' అని బోధకుడు చెప్పగా సంఘము 'ఆమేన్' అనవలెను.

4) సంఘము రెండు మూడు నిమిషములు త్రియేక దేవుని తలంచుకొని నిశ్శబ్దముగా నుండవలెను.

5) అప్పుడు బోధకుడు పాపపు టొప్పుదల చేయించవలెను (సంఘము మోకాళ్ళూని ఒప్పుదల చేయవలెను).

6) పాపములు క్షమింపబడినవను విశ్వాసము కలిగించుకొనుచు, సంఘము రెండు మూడు నిమిషములు ఊరకుండవలెను.

7) తర్వాత బోధకుడు, సంఘముచేత క్షమాపణార్థమైన స్తుతి చేయింపవలెను.

8) తరువాత సంఘమంతటిచేత తీర్మానము చేయింపవలెను. 'మాకు తెలిసిన ఏ పొరపాటును చేయము; చేయకుండుటకు ప్రయత్నించెదమను' తీర్మానము చేయింపవలెను. తర్వాత తీర్మాన ప్రార్థన చేయవలెను. తీర్మానము నెరవేర్చుకొనగల శక్తి దయచేయుమని' వేడుకొనవలెను.

9) తరువాత సమర్పణ చేయవలెను. శరీరమును, ఆత్మను, ఇంకను కలిగియున్న సమస్తమును, ముఖ్యముగా మన చిత్తమును దేవునిచిత్తమునకు సమర్పణ చేయవలెను. దేవునికి మనలను మనలమే అప్పగించి వేసికొనవలెను. ఆయనకు పూర్తిగా లోబడిపోవలెను. (ఇట్టి ప్రార్థనచేసి, సమర్పణ స్థిరపడుటకుగాను రెండు మూడు నిమిషములు నిశ్శబ్దముగా నుండవలెను). తరువాత 'సమర్పణ నెరవేర్చుకొనగల శక్తిని దయచేయుము' అను ప్రార్థన చేయవలెను. (స్తుతికీర్తన పాడవచ్చును)

10) తర్వాత విశ్వాసప్రమాణము చెప్పించవలెను. ఇది సమర్పణకు సమీపముగానున్న అంశము. విశ్వాస ప్రమాణమనగా 'నీవు నా తండ్రివి, నీవు నా పోషకుడవు, నీవు నా రక్షకుడవు, నీవు నా సమస్తమై యున్నావు' అను మాటలతో చేయబడవలెను.

11) బైబిలు పాఠమును, సంఘము నిలువబడి చదువవలెను. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలను ముగ్గురిని తలంచుకొని చదువవలెను (ఇక్కడ ఏ కీర్తననైనను పాడవచ్చును).

12) తరువాత ప్రసంగము చేయవలెను. ప్రసంగాంతమందు త్రియేక దేవుని స్తుతి పాడవలెను లేదా చెప్పవలెను.

13) తర్వాత కానుకలు అర్పించుట (కానుకలకు సంబంధించిన కీర్తన పాడవచ్చును). కానుకల విషయమైన ప్రార్థన చేయవలెను.

14) ప్రకటనలు వినిపింపవలెను.

15) తరువాత నానా అంశముల మీద ప్రార్థన, ప్రత్యేకాంశముల మీద ప్రార్థన చేయవలెను.

16) కొన్ని నిమిషములు ఊరుకొనవలెను (కనిపెట్టుట). ముగింపులో ప్రభువు ప్రార్థన, దీవెనతో ముగించవలెను.

**1) షరా:** సర్వాంశ ప్రార్థనలో– 'అన్ని క్రైస్తవ శాఖలయొక్క ఐకమత్యత, బైబిలు సొసైటీ, ట్రాక్టు సొసైటీ, రోగులకొరకైన ప్రయత్నములను దీవించుమని, బీదలకొరకైన ప్రయత్నములను దీవించుమని, పాపుల కొరకైన ప్రార్థనలు, సర్వ రాష్ట్రములకు సువార్త ప్రకటన కొరకు, యుద్ధములు రాకుండుటకు మొదలగు అంశములన్నియు ఉండవలెను.

**2) షరా:** గుడిలో మాట్లాడుట, గుడికి ఆలస్యముగా వచ్చుట, మధ్యన లేచిపోవుట, పాటలు అందరితో కలసి పాడకపోవుట, కునుకుపాట్లు పడుట, అరిగిపోయిన నాణెములు, చెల్లని నోట్లు చందాలో వేయుట, పిల్లలు అల్లరిచేయుట, పరధ్యానముగా నుండుట ఈ మొదలైనవన్నియు మానివేయవలెను (ఆరాధన గంటన్నర కన్నను ఎక్కువ ఉండుట మంచిదికాదు).

**3) షరా:** కొన్ని సంఘములలో బోధకులు వంతు ప్రకారము, దావీదు కీర్తనలు చదువుదురు. ఇది మంచి వాడుక.

**4) షరా:** ప్రతి ఆరాధనకు ***'త్రియేక దేవుడు, దూతలు, పరిశుద్ధులు వస్తారు'*** అను సంగతి జ్ఞాపకముంచుకొనవలెను. బడికి వెళ్ళుట అనగా పిల్లలకు సంతోషము. అట్లే ఆటలు అనగా పిల్లలకు ఎంతో సంతోషము. ఆలాగే ఆరాధన అనగా విశ్వాసులకు మహా ఆనందము కలుగవలెను.

**5) షరా:** కొందరు ప్రసంగము ముగియగానే వెళ్ళిపోవుదురు. వారి దృష్టిలో ప్రసంగమే ఆరాధన. అయితే ప్రసంగము కంటే, ఆరాధనే ముఖ్యము.

**6) షరా:** పెండ్లికుమార్తె చేయు ఆరాధన మిక్కిలి ప్రశస్తమైనదై యుండవలెను. వజ్రమువలె ఉండవలెను.

**7) షరా:** ఆరాధనలో, మనలను మనము ప్రభువునకు సమర్పించుకొనవలెను. అప్పుడు ప్రభువు తాను మనకివ్వవలసినవి సమర్పిస్తారు.

**8) షరా:** ఆరాధనలో ముఖ్యమైనది స్తుతి. ***మరియు మన కీర్తనలు, ప్రార్థనలు,*** స్తుతులు, కానుకలు ప్రభువు అంగీకరించినట్లు మన మనస్సునకు తట్టవలెను.

# ఆదివార ప్రమేయము - 3

1) బోధకుడు ప్రసంగము బాగుగా సిద్ధపడకుండ రాకూడదు. 2) ***సంఘములో ప్రతివారిని గూర్చి, మనస్సులో ముందే ప్రార్థించుట మంచివాడుక,*** మంచి సమయము. 3) కొందరు బోధకులు గుడికివచ్చి, అప్పుడే పాఠము చూచుకొని ప్రసంగింతురు. ఇది మంచివాడుక కాదు. 4) బోధకుడు ముందే ప్రతికుటుంబమును గూర్చి జ్ఞాపకముచేసికొని ప్రార్థించుట మంచిది. *5) దీర్ఘ ఆరాధనగాని, దీర్ఘ ప్రసంగముగాని మానుట మంచిది.* 6) ప్రోగ్రాము ముందుగానే తయారుచేయుట మంచిది. ఏ కీర్తన పాడవలెనో, ఏ వాక్యభాగములు చదువవలెనో ముందే ఏర్పాటు చేయుట మంచిది. 7) కొందరు సంఘస్థులు ఆలస్యముగా వత్తురు. ఇది మంచివాడుక కాదు. 8) కొందరు చివరి దీవెన పొందకుండ ఇంటికి వెళ్ళుదురు. ఇది మంచివాడుక కాదు. 9) పిల్లలు ఏడ్చినప్పుడు బయటికి తీసికొని వెళ్ళవలెను. 10) కొన్ని ఆలయములలో ఆరాధన ఆరంభించినప్పుడు తలుపులువేసి, ఆరాధన ముగిసిన తరువాత తలుపులు తీయుదురు. 11) ***గుడిలోనికి వచ్చిన తర్వాత ఇతర సంగతులేమియు మాట్లాడరాదు.*** 12) చందా ప్లేటులో లేదా సంచిలో చిల్లర మార్చుట పనికిరాదు. ఆరాధనకు ముందే చిల్లర సంపాదించుకొని రావలెను. 13) ఆరాధన సమయములో ఆల్టరు దగ్గర ఎవ్వరూ నడవకూడదు. అనగా బోధకుని ఎదుటగాని, వెనుకగాని ఎవరును నడువకూడదు. అట్లుచేసిన యెడల ఆరాధనను అమర్యాద చేయుటయే. 14) సాధ్యమైనంతమట్టుకు మహా గౌరవముగా, వినయముతో ఆరాధన జరుపుట మంచిది. 15) *గుడి మానుటకు వంకలు (సాకులు) వెతుకుట మంచిదికాదు.* 16) కీర్తనలలోని సంగతినిబట్టి ఆనందించుచు పాడవలెను. ఇంగ్లీషు కీర్తనలుకూడా పాడవలెను. వాటిలో చాలమంచి సంగతులున్నవి. 17) ఏ భాషలోనైనా స్తుతి కీర్తనలు తక్కువగ నుండును గనుక విశ్వాసులు స్తుతి కీర్తనలు ఎక్కువగా రచింపవలెను (కొలస్స 3:16,17). కీర్తనల వలన సువార్త ప్రకటన చక్కగా జరుగును. దావీదు కీర్తనలు అన్నియు, మన తెలుగులో కీర్తనలుగా రచించిన ఎంతో బాగుండును. ***గాని వాటిలోనుండి పాత నిబంధన ధర్మశాస్త్ర సూచనలు విడిచిపెట్టవలెను.*** ఎట్లనగా శత్రువులను నాశనము చేయుము అని అక్కడక్కడ నున్నది. క్రొత్త నిబంధనవారు శత్రువులను ప్రేమింపవలెనని చెప్పుచున్నారు *గదా!* ***గనుక శత్రువులను నాశనము చేయుమని కీర్తనలు రచించుకొని పాడుట, క్రొత్త నిబంధన విశ్వాసమునకు తగినదికాదు.*** 19) బైబిలులో స్తుతులు ఎక్కడెక్కడ నున్నవో, అవన్నియు చేర్చి ఉంచిన వ్రాత పుస్తకమునకు "స్తోత్రాం బరమని" పేరు. (ఈ నోట్సు మీ దగ్గరనున్నదా?) మన తెలుగు క్రైస్తవ కీర్తనలలో కొన్ని పాటలను సరిగా పాడుటలేదు. 1) 'స్తుతియు మహిమయు నీకే' అను కీర్తనలో 'ఋణపడియున్నాము నీకు' అను భాగములో గీత తర్వాత ఆపి పాడవలెను. 2) 'దేవసంస్తుతి' అను కీర్తనలో 'ప్రత్యపకార' మనుటకు బదులుగా,

'ప్రత్యుపకారమని' పాడుచున్నారు. అది తప్పు. 3) పడమటికి 'తూర్పెంత ఎడమో' అని పాడుటకు బదులు 'ఎంతో ఎడము' అని పాడుచున్నారు. అది తప్పు. 4) నాకేమి కొదువ అను కీర్తనలో 'నేనాయన గొర్రెనే' అని పాడవలెను. 5) 'ఎవరు భాగ్యవంతులౌదురు' అను కీర్తనలో 'దీనమానసులకిట్టి యుప-దేశమిచ్చుచు' అని పాడవలెను. 6) శ్రీ వినోదదాయకంబు అను కీర్తనలో 'దురితతతికి వస్త్రంబు అని పాడకూడదు. 'దురితతతికి నస్త్రంబు' అని పాడవలెను. 7) ఎంతో శృంగారమైనవి అను పాటలో 'సుంద-రమందా' అనగా దకారము దగ్గరనున్న గీటు జ్ఞాపకముంచుకొని పాడవలెను. 8) 'దేవా! దివ్యానంత ప్రభావా!' అను కీర్తనలో, నీవు - నన్ను సృష్టించినావు అను భాగములో 'నీవు' తర్వాత ఆపి పాడవలెను. 9) 'యేసుక్రీస్తు వారి కథ వినుడి అను కీర్తనలో 'వాక్కు వినవచ్చిన వారలకు- వాక్య ఆహారమును తినిపించె', అనగా (వాక్యహారమని పాడకుండ, వాక్యాహారమని పాడవలెను. 10) ధన్యుడు- దేవమానవుడు అను కీర్తనలో, ఆకువాడనిదై తగిన-ఋతువున అను భాగములో, తగిన అనుమాట తర్వాత ఆపి పాడవలెను. 11) 'ధారుణమగు మరణ' అను కీర్తనలో వారిధి అని పాడవలెను గాని వారాది అని పాడకూడదు. 12) యెహోవా నా మొరలాలించెను అను కీర్తనలో, 'విలాపములకు చెవినిచ్చెను, శ్రమ కలాపములకు సెలవిచ్చెను' అని పాడవలెను (గాని కొందరు మొదటే 'సెలవిచ్చెనని' పాడి, తర్వాత 'చెవినిచ్చెనని' పాడుచున్నారు. అది తప్పు).

భూలోక సంఘము పరలోక సంఘమునకు ముంగుర్తుగా నుండవలెను. యూదుల యొక్క మతము, భూమిమీద రాబోయే క్రైస్తవ సంఘమునకు ముంగుర్తుగా నుండెను గదా! అట్లే భూమిమీద క్రైస్తవ సంఘముకూడ ముంగుర్తుగా నుండవలెను. ***గనుక ఈ ముంగుర్తులన్నియు సరిగా నుండవలెను.*** అనగా 1) పరలోక వాస్తవ్యులు ధవళ వస్త్రధారులు. మనమును అట్లే యుండవలెను. 2) వారు విమోచన పొందినవారు. మనమును అట్లే యుండవలెను. 3) వారు వరములు పొందినవారు, మనమును వరములను పొంది వాడవలెను. 4) వారి శరీరము, ఆత్మ, నివాసము, దేవాలయము పవిత్రములు. మనకు కూడ అట్టిస్థితి యుండవలెను. మన నివాసములైన ఇండ్లు, ఇంటిలోని సామానులు పవిత్రముగా నుండవలెను. 5) ఓ ఇశ్రాయేలీయులారా! యెహోవా మీ పేటలో సంచారము చేయును గనుక శుభ్రముగా నుంచండి అని ఉన్నది. ఆలాగే ప్రభువు సంఘముల మధ్యను సంచారము చేయువాడని ప్రకటన గ్రంథములో నున్నది గనుక మన సమస్తమును మనము శుభ్రముగా నుంచవలెను. II కొరింథి 7:1 "ప్రియురాలా! మనకు ఈ వాగ్ధానములున్నవి గనుక దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తి చేసికొనుచు, శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషమునుండి మనలను పవిత్రులనుగా చేసికొందము". అది మాత్రమే కాకుండ పెండ్లికుమార్తె యొక్క భూలోక గృహములో అనగా కుటుంబములో, అనగా గుడిలోను, అల్లరి, కేకలు, పోట్లాటలు, కలహాలు, వాక్కు కలహాలు,

మనస్పర్థలు, భిన్నాభిప్రాయములు; ఇవి ఉండక సంతోషము, సమాధానము, నెమ్మది, శాంతి, ఉండవలెను. యెరూషలేము అను పేరునకు శాంతి పురమని అర్థము. **నూతన యెరూషలేము అను శాంతిపురము చేరగోరువారియొక్క గృహము శాంతి గృహమై యుండవలెను.** ఇది ముంగుర్తు శాంతి. అందుచేత భూలోకములో ఈ గృహము శాంతి ఆరాధన చేయగలదు. ఇంటిలో శాంతి లేకపోయిన ఆరాధనలో నెమ్మదిగా కూర్చుండు బుద్ధి కలుగునా? కలుగదు, గనుక శాంతి సంపాదించుకొనవలెను.

## ఆదివార ప్రమేయము - 4

**వెయ్యేండ్ల పరిపాలనలోని ఆరాధన:** అప్పుడు ఆరాధన, లోక సంబంధమైన యెరూషలేములో జరుగదు గాని నూతన పరుపబడిన యెరూషలేములో జరుగును. గనుక ఆరాధన మహామహిమతో నిండియుండును. నేటి సంఘమును ఎంత దిద్దినను, ఒక ప్రక్కను లోక సంబంధముగానే యుంటున్నది. గనుక మహిమతో కూడిన ఆరాధన సులువు కాదు. సంఘములు ఒకవేళ నూతన పరచబడుచున్నను, సంపూర్ణముగా నూతన పరచబడలేదు గనుక మహిమారాధన కష్టతరము. ఇప్పుడు మనము ఎంత భక్తిగా నుండవలెనని ప్రయత్నము చేసినను, మన నివాసము పాపలోకము గనుక దాని పొగరు (గాఢమైన వాయువు) ఏ విధము చేతనైనను తగులక మానదు. ఏ సంఘము యొక్క మెంబరైనను, విశ్వాసియైనను పాపశరీరముతో నున్నాడు గనుక మహిమారాధన చేయుట దుర్లభము. మరియు సైతానును, అతని సైన్యమును ఇంకా ఉన్నారు గనుక మహిమారాధన నడుపుట కష్టము. మరియు పాప ఫలితములు కూడ మన కంటబడుచున్నవి గనుక మహిమారాధన చేయుట కష్టము. అయితే వెయ్యేండ్ల పరిపాలనయందు a) లోక సంబంధము, b) శరీర సంబంధము, c) పాప ఫలిత సంబంధము, d) అపవాది సంబంధము మొదలగునవి ఉండవు గనుక మహిమారాధన చేయుటకు వీలుపడును. **అయినను కొంతవరకైనను, మహిమారాధన ఇప్పుడే జరుగవలెను.** అనగా ఆదివారమునాడే అనగా ఎప్పుడుబడితే అప్పుడే జరుగవలెను. నూతన పరచబడిన యెరూషలేములో ఆరాధించువారు, పరలోకమునుండి వచ్చిన భక్తులు గనుక ఆ ఆరాధన మహా మహిమగ నుండును. ఆ భక్తులయొక్క మనసు లోపల రెండు చిట్టాలు (జాబితాలు) ఉండును. ఒకటి విమోచన చిట్టా, రెండు దానముల చిట్టా. ఈ రెండిటిలోనుండి స్తుతి బయలుదేరును, ఆ స్తుతి మతాబువలె వెలుగును, అదే ఆరాధన. **విమోచనపు చిట్టా** అనగా పై నాలుగు ఆటంకముల నుండి విమోచింపబడిన చిట్టా. లోక సంబంధమునుండి, శరీర సంబంధమునుండి, పాప సంబంధమునుండి, అపవాది సంబంధమునుండి విమోచింపబడిన జాబితాల యొక్క కథ ఉండును. **దాన చిట్టా** అనగా ప్రభువు అనుగ్రహించిన వరముల కథ. అప్పుడు ఎన్ని వరములుండును? ఎన్నైనా ఉండును. పరిశుద్ధత అనే వరము, సర్వభాషా వరము,

నిరాటంకముగా ప్రపంచ సంచారము చేయు వరము, అద్భుతము చేయు వరము, మహిమగా సువార్త ప్రకటించు వరము, ప్రభువును చూచు వరము, ప్రభువు మాటలు విను వరము, దేవదూతలతో మిళితమయ్యే వరము, ఎక్కడబడితే అక్కడకు నిమిషములో వెళ్ళు వరము: ఇవన్నియు ఉండును. **ఈ వరములన్నిటిలో 'పరిశుద్ధత వరము' గొప్పది.** ఆరాధనకు ఎప్పుడు తెల్లబట్టలు ఉండవలెను.

***ధవళ సమాజము:*** పూర్వము క్రైస్తవులు ధవళాదివారమున, అందరూ తెల్ల బట్టలు ధరించుకొని గుడికివెళ్ళు వాడుక గలిగియుండిరి. మనముకూడ ధవళాదివారము వంటి ఒకరోజున, ధవళ వస్త్ర ధారులమై కూటములు జరుపుకొనుట మంచిదిగదా! ఆ దినమున దైవసన్నిధిలో సంఘమంతయు, మోకాళ్ళమీద ఒక గంట ఆరాధించి ముగించవలెను. దీనిలో ఒక కీర్తన పాడవలెను, బైబిలు చదువవలెను, రెండు మాటలు చెప్పవలెను, *తర్వాత అంతము వరకు నిశ్శబ్దముగా నుండవలెను. ఆ తర్వాత ముగింపు.* (White Sunday – ధవళాదివారము), ఇది సంఘముయొక్క ఇష్టము ననుసరించి యుండును. బూట్లు వేసికొని రాకూడదు, బెంచీలమీద, కుర్చీలమీద కూర్చుండ రాదు, పాదములు కడుగుకొనకుండ రాకూడదు. (ఈ ఆరాధనయందు పిల్లలు ఉండరు).

***అనుదిన కూట శేషము:*** ఈ కూటములకు జబ్బుగా నున్నవారు, అవసరమైన పని యున్నవారు, వీలులేని వారు, ఏదైన ఆటంకములు గలవారు, వస్త్రములు లేనివారు ఈ మొదలైనవారు రాకపోయినను ఫరవాలేదు. ఇష్టముగలవారందరు రావలెను. ఇష్టము లేనివారు కూడ వచ్చిన మంచిది. ఎండగాని, వానగాని, చలిగాని మహా అధికముగా నున్నప్పటికిని, రాగలిగిన కొద్దిమందితో (ఇద్దరు, ముగ్గురు) కూటము నడుపుకొనవలెను. ***నడిపించువారు లేనియెడల, కనిపెట్టుటలో గడిపి ముగించుకొనవచ్చును.***

# సమృద్ధి జీవనము

1. 'ప్రభువు నాతో బైబిలు ద్వారా మాట్లాడుచున్నారు'. ఈ నమ్మికతో ప్రతి దినము బైబిలు చదువవలెను.

2. 'నేను నా తండ్రితో మాట్లాడుటకు ప్రార్థన ద్వారా సెలవు దొరికినది' అనే నమ్మికతో అనుదినము ప్రార్థన చేయవలెను.

3. ***కుటుంబ ప్రార్థన, ఎంత తక్కువ సమయమున్నను చేసి తీరవలెను.*** ఎందుకంటే జనాంగములు, కుటుంబములో నుండియే వచ్చెను. అధికారులు, పండితులు, వేదాంతులు, శాస్త్రజ్ఞులు, యోధులు అందరూ అక్కడి నుండియే వచ్చిరి. *మీ పిల్లలు తుదకు ఏ మంచి విషయములో ప్రఖ్యాతి పొందుదురో మీకు తెలియదుగదా!* అందుచేతనే కుటుంబ ప్రార్థన చేయవలెను.

4. 'దేవుని ఇల్లగు' దేవాలయమునకు వెళ్ళుటకు సాకులు చెప్పిన యెడల, *'ప్రభువు మా ఇంటికి రాడు'* అనే తలంపుతో ప్రతి ఆదివారము గుడికి వెళ్ళి, నీ చేతిక్రింది పంతులుగారు ప్రసంగము చేసినను, ***విద్యార్థివలె కూర్చుండి వినుటకు వెళ్ళవలెను.*** గృహములు రెండు: 1) నీ గృహము, 2) నీ దేవాలయము.

5. మిక్కిలి ఇబ్బందిలో నున్నప్పుడు సహితము, దేవాలయముయొక్క చందావేయుట మానవద్దు. సమృద్ధిగా నున్నప్పుడు వేస్తే, అంత విలువలేదు. ఇబ్బందిలో నున్నప్పుడు వేసే దానికే విలువ. *గనుక నీవు చందావేసే ప్రతి దమ్మిడికి గొప్ప ఉద్యోగము కలదని మరువవద్దు.*

6. 'నాకు వర్తమానము రావడము లేదు' అని కోపగించుకొని, ఇతరులకు సువార్త చెప్పుట మానవద్దు. వాక్యము చెప్పుట మానుకొంటే సంఘము వృద్ధి కాదు. మాట్లాడు వ్యక్తివి నీవు కాదు, నీలోని వ్యక్తి.

7. క్రిస్మసు, ఈస్టరు మొదలగు పండుగలయందును, సౌఖ్యకాలమందును సంతోషించుట కంటే, ***శ్రమలలో సంతోషించుట మహాధన్యత*** అని మరచిపోవద్దు.

8. బీదలను, అక్కరగలవారిని ఒక కంట చూచుచుండుము.

9. మనము రాకడకు ముందు, అనగా రాకడకు సమీపముగా నున్నవారము గనుక ***తరచుగా ఆత్మవలన నింపబడుచుండవలెను.*** ఆకలివేయునపుడు ఉదరమును అన్నముతోను, నీళ్ళతోను నింపుకొనుచున్నాము గదా! మాటిమాటికి, నిమిష నిమిషమునకు గాలి పీల్చుచున్నాము గదా! ఇంకేమి? *అలాగే ఇది కూడాను.*

10. తప్పుడు దర్శనములు, తప్పుడు స్వప్నములు, తప్పుడు ఊహలు మనస్సులోనికి రానియ్యక, **చెప్పులు బయట విడిచివేయునట్లు వాటినికూడ విడిచి వేయుము.**

11. ఏది తప్పు అని నీకు తెలుసునో, అది మానివేయుము.

12. నీ జ్ఞానమును వృద్ధి చేసికొనుటకై, బైబిలును చదువుట మాత్రమేకాదు; ఇతర పుస్తకములు, పత్రికలు చదువుచుండవలెను. మరియు అందరితోను మాట్లాడు చుండవలెను. అప్పుడు సంగతులు తెలియగలవు.

13. రాకడ సమీపము గనుకను, దాని తరువాత సంఘము యొక్క పుస్తకములోని ప్రోగ్రాములో (కార్యక్రమములో) మరియొక సంగతి లేదు గనుకను, రాకడను గురించి రేయింబగళ్ళు, చెమట ఊర్చి కష్టపడవలెను. ***పరీక్ష నెల ఉన్నదనగా విద్యార్థి ఎక్కువ కష్టపడకపోతే, పరీక్ష అయిన పిదప కష్టపడునా?***

14. నీ తలంపులోనికి ఇంకా ఎన్ని నంబర్లు (అంశములు) వచ్చునో, వాటన్నిటి ప్రకారము చేసి తీరవలెను.

15. మీ ప్రదేశములలో మాత్రమే గాక, సర్వలోకమునకు సువార్త పంపుటకు మీరు సాధనములై యుండవలెను. ***'భూదిగంతముల వరకు'*** అని ప్రభువు చెప్పెను గదా! బైబిలు ఎన్ని భాషలలోనికి తర్జుమా అయినదో, అన్ని భాషలలోనికి సువార్త పంపుట మన విధి.

16. అన్ని ప్రార్థనలు అయిన తరువాత ఒక ముఖ్యమైన విషయము కలదు. అనేకులు ఇందులో తప్పిపోవుచున్నారు. మనము చెప్పిన యెడల వారికి కోపము వచ్చును గాని, ***"కనిపెట్టుటయే"*** ఆ అంశము.

17. అన్ని ప్రార్థనలు అయిన తరువాత, ప్రభుయేసు యొక్క రక్తముచేత శుద్ధి చేసికొనవలెను.

***ఉదా:*** అయ్యగారి మీదకు రెండు దయ్యాల గుంపులు వచ్చి, 'నీవు ప్రార్థన చేసికొనిన తరువాత 'ప్రభువు యేసు రక్తమునకు జయము' అని చెప్పలేదేమి'? అని అడిగినవి.

**జవాబు:** నా శరీరములో అన్ని అవయములెట్లు ఉన్నవో, అట్లే ప్రభు యేసు రక్తము కూడ ఉన్నది. నేను ఏ అలవాటు ప్రార్థన చేసినా, అది ప్రార్థనే గదా! అది పరలోకములో నెరవేరును. బైబిలు మిషనును శుద్ధి, వృద్ధి చేయుటకు ప్రభువు నన్ను ఏర్పర్చుకొన్నాడు గనుక నేను చేస్తాను.

Bible Mission HQ Guntur

# విశ్వాస జీవనము (మార్కు 11:24)

1. విశ్వాసమునకు గుడ్డితనమని చెప్పవచ్చును లేక పేరుపెట్టవచ్చును. లేనివి ఉన్నవనియు, ఉన్నవి లేనివనియు నమ్ముటయే విశ్వాసము. హెబ్రీ. 11వ అధ్యాయములో ఉన్నట్లు విశ్వాసపు కన్ను అని కూడా దీనికి పేరు.

2. రానివి వచ్చుననియు, వచ్చునవి రావనియు నమ్ముటయే విశ్వాసము.

3. నేత్రములు – నాలుగు

1) ఆత్మ నేత్రము

2) మనో నేత్రము

3) విశ్వాస నేత్రము

4) శరీర నేత్రము

**శరీర నేత్రము:–** భూలోకమును, మేఘములను, నక్షత్రములను, సూర్య చంద్రాదులను ఈ నేత్రము చూడగలదు. మొత్తముమీద శరర నేత్రము కొంతమట్టుకే చూడ గలదు. అంతా చూసేది అది వేరు. అది ఆత్మనేత్రము. ఇది మాంస నేత్రము గనుక మహిమను చూడలేదు. శరీర నేత్రము గనుక సర్వమును చూడలేదు. ***ఈ నేత్రము తరచుగా పాపము తట్టు నీడ్వబడుచుండును గనుక పవిత్రతను చూడజాలదు.*** దీని దృష్టి అంతయును ఇహలోకము తట్టుయుండును. ఈ నేత్రమునకు సాధ్యమైనవి సాధ్యమైనవిగానే కనబడును. ఇది అసాధ్యమైన విషయములను చూడ శక్తిలేని నేత్రము.

**విశ్వాస నేత్రము:–** విశ్వాసమును నేత్రము అనవచ్చును. ఎందుచేతనంటే ఇది అన్నిటిని చూడగలదు. దీనికి దూరదృష్టి (దివ్యదృష్టి) కలదు. *ఈ కంటికి, అసాధ్యమైన విషయములు సాధ్యములుగా కనిపించును.* ఇది లోక సంబంధులకు గ్రాహ్యము కాని నేత్రము, వారికి అర్ధముకాని విషయము. అనగా, ఒకరు వ్యాధిగా నున్న యెడలను, ఇంకనూ రోగి బాధపడుచున్నను; బాగుపడకముందే బాగుపడినట్టు, ***బాగుపడిన స్థితిని విశ్వాస నేత్రము ముందుగానే చూడగలదు.*** *లేమిలో నున్నప్పుడు కలిమిని చూడగలదు. దుఃఖములో ఉన్నపుడు సంతోషమును చూడగలదు. నిరాశలో నున్నప్పుడు నిరీక్షణను, నిస్సహాయములో నున్నపుడు సహాయమును చూడగలదు. బాధలలో నున్నప్పుడు స్వస్థతను చూడగలదు. బలహీనముగా నున్నపుడు బలమును చూడగలదు.*

***ఓ సహోదరుడా! విశ్వసించుట వేరు, విశ్వాస వరము కలిగియుండుట వేరని గ్రహించుము.*** *ఓ మిత్రుడా! నిరీక్షణ వేరు, విశ్వాసము వేరని గ్రహించుము. విశ్వసించుట సామాన్య విషయము కాదు. అది అబ్బినట్లైతే కష్టమైన విషయము కాదు.*

**నిరీక్షణ:–** నిరీక్షణ అనగా ఒక సంగతిని గూర్చి ప్రార్థించకముందు, 'నేను ప్రార్థిస్తాను, ప్రభువు వింటారు, అది నెరవేరుస్తారు' అని నమ్ముట. ఇది విశ్వాసము కాదు గాని నిరీక్షణ

అయియున్నది. ఒక సంగతిని గూర్చి ప్రార్థించిన తరువాత 'నేను ప్రార్థించినాను, ప్రభువు నా ప్రార్థన విన్నారు, తప్పక నెరవేరుస్తారని' నమ్ముట, ఇదియు విశ్వాసము కాదు సుమా! ఇదియు నిరీక్షణయే. నిరీక్షించువారు ధన్యులు, వారు నిరీక్షణ ఫలము పొందుదురు.

**విశ్వాసము:-** *విశ్వాసము అనగా ఒక సంగతిని గూర్చి ప్రార్థించిన తరువాత, ఆ ప్రార్థించిన విషయము జవాబు పొందని సమయమందు, 'జవాబు వచ్చెను', 'ప్రార్థన నెరవేరెను'* అని పలుకుటయే విశ్వాసము. ఇది విశ్వాసపు పలుకు. విశ్వాసమనగా ఇదియే. విశ్వాసమును గూర్చి వివరించుట కష్టము.

**ఉదా:** ఆకలి సమయమందు అన్నము పెట్టుకొని తింటిని, ఆకలి తీరెను. అంతలో ఒకరు వచ్చి అన్నము తింటివా? అని అడిగిరి. నేను 'ఔను, తినుట ముగించితిని' అని చెప్పితిని. ఆకలి తీరెనా? అని ప్రశ్నించిరి. 'అవును', తీరెనంటిని. ఏలాగు తీరెనని మరలా ప్రశ్నించిరి. తినుట వలన తీరెనని మరలా జవాబిచ్చితిని. అనగానేమి? అని మరలా ప్రశ్నించిరి. అనగానేమో తెలుసునుగాని వివరించలేనని జవాబిచ్చితిని. ఆకలి తీరుట ఎరుగుదును, తీరినదని చెప్పగలను గాని వివరించుట తెలియదు.

**విశ్వసించుట:-** ప్రార్థించిన సమయమందు అనేకమైన అపజయములు కలుగును. అయినను విశ్వసించుట కొనసాగింపుము. *ముగింపులో సంపూర్ణ జయము చూడగలవు.*

ఓ స్నేహితుడా! నీవును, నీ కుటుంబమును, విశ్వాసము వలన జీవింపవలెనని (శరీరాత్మల విషయము) నీకున్న యెడల, నీవును నీ కుటుంబమును దేవుని సన్నిధిలో మోకరించి ప్రార్థించి, విశ్వాస వరమును పొందుడి. అప్పుడు విశ్వాసమనగా నేమో నీవు గ్రహించుదువు. అప్పుడు అనుదినము విశ్వాస బ్రతుకులో, అనేకమైన ఆశ్చర్యకరమైన సంగతులు చూడగలవు. ***విశ్వసించువారు అనేకులు కలరు. అయితే విశ్వాసవరము గలవారు కొద్దిమందే ఉన్నారు.***

1. *నిన్ను గురించి, నీ మీద నీవు ఆనుకొనకుము.*
2. *నీ బంధువులను నమ్మి, వారిమీద ఆనుకొనకుము.*
3. *నీ స్నేహితులను నమ్మి, వారిమీద ఆనుకొనకుము.*
4. *నీ ఇరుగు పొరుగు వారిని నమ్మి, వారిమీద ఆనుకొనకుము.*
5. *నీ పేటవారిని నమ్మి, వారిమీద ఆనుకొనకుము.*
6. *నీ ఊరువారిని నమ్మి, వారిమీద ఆనుకొనకుము.*
7. *నీ అధికారులను (రాజ్యాధికారులు,* ***సంఘాధికారులు) నమ్మి, వారిమీద ఆనుకొనకుము.***
8. *నీ స్వంత మిషనును నమ్మి, దానిమీద ఆనుకొనకుము.*
9. *నీ మతమును నమ్మి, దానిమీద ఆనుకొనకుము*

*10. నీ* **చందాలను నమ్మి** // //

*11. నీ జీవితమును నమ్మి* // //

*12. నీ ప్రజాభిమానమును నమ్మి* // //

*13. నీ* **వృత్తిని నమ్మి** // //

*14. నీ శరీర బలమును నమ్మి* // //

*15. నీ జ్ఞానమును నమ్మి* // //

షరా:- సహోదరుడా, **పైనున్న *15* విషయములన్నియు నమ్ముటకు ఎంత నమ్మకము అవసరమో, అంత నమ్మకముతో ఒకసారిగా దేవుని నమ్ముము.** అప్పుడు నీవు నీ శరీరాత్మల విషయములో ఇతరులకంటే శ్రేష్ఠమైన వాడవుగా జీవించుచు, దేవుని మహిమను చూడగలవు. ఓ *మిత్రుడా! పైనున్న 15 విషయములన్నిటి మీద ఆనుకొనుటకు ఎంత శక్తి అవసరమో, అంత శక్తితో దేవుని మీద ఆనుకొనుము.* ఆలాగు ఆనుకొనుట, నమ్ముట అవసరము. ముందు నమ్ముము, నమ్మిన తరువాత విశ్వాస వరమును గూర్చి ప్రార్థించుము. ప్రార్థన ముగించిన తరువాత అభ్యాసము చేయుము. అటు తరువాత విశ్వాసమును గూర్చి ఏవైనా ప్రశ్నలు ఉన్న యెడల, ప్రశ్నలడిగి జవాబు పొందవచ్చును. నీవు పోయి ఈలాగు చేయుము.

దేవుడు నీకు దర్శనములోగాని, స్వప్నములోగాని కనబడినను, కనబడక పోయినను ఈలాగు చేయుము. అప్పుడు నీవు దేవునిని మహిమ పరచుచూ వర్థిల్లగలవు. **దేవుడు కనబడుట, కనబడక పోవుట అనునవి మన హృదయస్థితిని బట్టియు, అవసరమును బట్టియు ఉండును.**

'హృదయశుద్ధి గలవారు ధన్యులు వారు దేవుని చూతురు' అనునదియు నిజమే. ఇదొక మార్గము, అనగా హృదయశుద్ధి గలవారు ధన్యులు, వారు దేవుని చూతురు. వేరొక మార్గము గలదు. *అందరికీ ఒకే మార్గమైతే దేవుని దగ్గరున్న పద్ధతులు అన్నీ ఏలాగు ఖర్చుగును?*

1) దేవుని మీద ఆనుకొనుట, నమ్ముట 2) ఆయనే కనబడి, నెరవేర్చుట



ఫిలిప్పి. 4:19 చదివినారా?

ఫిలిప్పి4:19; మత్తయి 5:8. ఈ రెండునూ మార్గములే. దేవుని వాక్యమును ఆధారము చేసికొని, డాక్టర్॥ మార్టిన్ లూథర్‌గారు తీవ్రముగా తన పనిని కొనసాగించుటకు ఆధారమైన వచనము: "నన్ను బలపరచు వానియందే నేను సమస్తమును చేయగలను". ఫిలిప్పి. 4:13.

Bible Mission HQ Guntur

# విశ్వాస ప్రభావము

## హెబ్రీ 11వ అధ్యాయము

"విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటియొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది. దానిని బట్టియే పెద్దలు సాక్ష్యము పొందిరి. ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు, అందునుబట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడలేదనియు, విశ్వాసముచేత గ్రహించుకొను చున్నాము. విశ్వాసమును బట్టి హేబెలు కయీను కంటే శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెను. దేవుడతని అర్పణలను గూర్చి సాక్ష్యమిచ్చినప్పుడు, అతడు ఆ విశ్వాసమును బట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతినొందియు, ఆ విశ్వాసము ద్వారా మాటలాడుచున్నాడు. విశ్వాసమును బట్టి హనోకు మరణము చూడకుండునట్లు కొనిపోబడెను. అతడు కొనిపోబడక మునుపు దేవునికి ఇష్టుడై యుండెనని సాక్ష్యము పొందెను. కాగా దేవుడతని కొనిపోయెను గనుక అతడు కనబడలేదు. విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము. దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన ఉన్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా! విశ్వాసమును బట్టి నోవహు, అదివరకు చూడని సంగతులను గూర్చి దేవునిచేత హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై, తన ఇంటివారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధముచేసెను. అందువలన అతడు లోకముమీద నేరస్థాపనచేసి, విశ్వాసమును బట్టి కలుగు నీతికి వారసుడాయెను. అబ్రాహాము పిలువబడినప్పుడు, విశ్వాసమును బట్టి ఆ పిలుపునకు లోబడి, తాను స్వాస్థ్యముగా పొందనైయున్న ప్రదేశమునకు బయలు వెళ్ళెను. ***మరియు ఎక్కడికి వెళ్ళవలెనో అది ఎరుగక బయలు వెళ్ళెను.*** విశ్వాసమును బట్టి అతడును, అతనితో ఆ వాగ్దానమునకు సమాన వారసులైన ఇస్సాకు, యాకోబు అనువారు గుడారములలో నివసించుచు, అన్యుల దేశములో ఉన్నట్టుగా వాగ్దత్త దేశములో పరవాసులైరి. ఏలయనగా దేవుడు దేనికి శిల్పియు, నిర్మాణకుడునై యున్నాడో, పునాదులుగల ఆ పట్టణము కొరకు అబ్రాహాము ఎదురు చూచుచుండెను. విశ్వాసమును బట్టి శారాయు– 'వాగ్దానము చేసినవాడు నమ్మదగిన వాడని యెంచుకొనెను' గనుక తాను వయస్సు గతించినదైనను, గర్భము ధరించుటకు శక్తిపొందెను. అందుచేత మృతతుల్యుడైన ఆ యొకనినుండి, సంఖ్యకు ఆకాశ నక్షత్రముల వలెను, సముద్ర తీరమందలి లెక్కింప శక్యము కాని ఇసుకవలెను సంతానము కలిగెను.

వీరందరు ఆ వాగ్దానముల ఫలము అనుభవింపక పోయినను, దూరము నుండి చూచి వందనము చేసి, తాము భూమిమీద పరదేశులమును, యాత్రికులమునై యున్నామని ఒప్పుకొని, విశ్వాసము గలవారై మృతినొందిరి. ఈలాగు చెప్పువారు– 'తమ స్వదేశమును వెదకుచున్నామని విశదపరచుచున్నారు కారా'? వారు ఏ దేశము నుండి వచ్చిరో ఆ దేశమును, జ్ఞాపకమందుంచుకొన్న యెడల మరల వెళ్ళుటకు వారికి వీలుకలిగి యుండును. అయితే వారు మరి శ్రేష్ఠమైన దేశమును, అనగా పరలోక సంబంధమైన దేశమును కోరుచున్నారు. అందుచేత తాను వారి దేవుడనని అనిపించు కొనుటకు దేవుడు వారిని గూర్చి సిగ్గుపడడు; ఏలయనగా ఆయన వారికొరకు ఒక పట్టణము సిద్ధపరచి యున్నాడు. అబ్రాహాము శోధింపబడి విశ్వాసమును బట్టి ఇస్సాకును బలిగా అర్పించెను. ఎవడు ఆ వాగ్దానములు సంతోషముతో అంగీకరించెనో, 'ఇస్సాకు వలననైనది నీ సంతానమనబడును' అని ఎవనితో చెప్పబడెనో ఆ అబ్రాహాము, మృతులను సహితము లేపుటకు దేవుడు శక్తిమంతుడని ఎంచినవాడై, తన ఏక కుమారుని అర్పించి, ఉపమాన రూపముగా అతనిని మృతులలో నుండి మరల పొందెను. విశ్వాసమును బట్టి ఇస్సాకు, జరుగబోవు సంగతుల విషయమై యాకోబును, ఏశావును ఆశీర్వదించెను. విశ్వాసమును బట్టి యాకోబు, అవసానకాలమందు[1] యోసేపు కుమారులలో ఒక్కొక్కని ఆశీర్వదించి, తన చేతికర్ర మొదలుమీద ఆనుకొని దేవునికి నమస్కారము చేసెను. యోసేపు తనకు అవసానకాలము సమీపించినప్పుడు, విశ్వాసమును బట్టి ఇశ్రాయేలు కుమారుల నిర్గమనమును గూర్చి ప్రశంసించి, తన శల్యములను గూర్చి వారికి ఆజ్ఞాపించెను. మోషే పుట్టినప్పుడు అతని తల్లిదండ్రులు ఆ శిశువు సుందరుడై యుండుట చూచి, విశ్వాసమును బట్టి రాజాజ్ఞకు భయపడక, మూడు మాసములు అతని దాచిపెట్టిరి. మోషే పెద్దవాడైనప్పుడు విశ్వాసమును బట్టి ఐగుప్తు ధనముకంటె, క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని ఎంచుకొని, అల్పకాలము పాపభోగమును అనుభవించుట కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి, ఫరోకుమార్తె యొక్క కుమారుడని అనిపించుకొనుటకు ఒప్పుకొనలేదు; ఏలయనగా అతడు ప్రతి ఫలముగా కలుగబోవు బహుమానమందు దృష్టియుంచెను. విశ్వాసమును బట్టి అతడు అదృశ్యుడైనవానిని చూచుచున్నట్టు స్థిరబుద్ధిగలవాడై, రాజాగ్రహమునకు భయపడక ఐగుప్తును విడిచిపోయెను. తొలిచూలు పిల్లలను నాశనము చేయువాడు, ఇశ్రాయేలీయులను ముట్టకుండు నిమిత్తము అతడు విశ్వాసమును బట్టి పస్కాను, రక్తప్రోక్షణ ఆచారమును ఆచరించెను. విశ్వాసమును బట్టి వారు పొడినేల మీద నడిచినట్లు

1. లేక మరణకాలమందు

ఎర్ర సముద్రములోబడి నడచిపోయిరి. ఐగుప్తీయులు ఆలాగు చేయజూచి మునిగిపోయిరి. విశ్వాసమునుబట్టి, ఏడు దినముల వరకు ప్రదక్షిణము చేయబడిన తరువాత యెరికో గోడలు కూలెను. విశ్వాసమును బట్టి రాహాబను వేశ్య వేగుల వారిని సమాధానముగా చేర్చుకొనినందున, అవిధేయులతో పాటు నశింపక పోయెను. ఇకను ఏమి చెప్పుదును? గిద్యోను, బారాకు, సమ్సోను, యెఫ్తా, దావీదు, సమూయేలను వారిని గూర్చియు ప్రవక్తలను గూర్చియు వివరించుటకు సమయము చాలదు. వారు విశ్వాసము ద్వారా రాజ్యములను జయించిరి; నీతి కార్యములను జరిగించిరి; వాగ్దానములను పొందిరి; సింహముల నోళ్ళను మూసిరి; అగ్ని బలమును చల్లార్చిరి; ఖడ్గధారను తప్పించుకొనిరి; బలహీనులుగా ఉండి బలపరచబడిరి; యుద్ధములో పరాక్రమశాలులైరి; అన్యుల సేనలను పారదోలిరి. స్త్రీలు, మృతులైన తమవారిని పునరుత్థానము వలన మరల పొందిరి. కొందరైతే మరి శ్రేష్టమైన పునరుత్థానము పొందగోరి, విడుదల పొందనొల్లక యాతన పెట్టబడిరి. మరికొందరు తిరస్కారములను, కొరడా దెబ్బలను, మరి బంధకములను, ఖైదును అనుభవించిరి. రాళ్లతో కొట్టబడిరి, రంపములతో కోయబడిరి, శోధింపబడిరి, ఖడ్గముతో చంపబడిరి, గొర్రె చర్మములను మేక చర్మములను వేసికొని దరిద్రులై యుండి, శ్రమపడి హింసపొందుచు, అడవులలోను, కొండలమీదను, గుహలలోను, సొరంగములలోను తిరుగులాడుచు సంచరించిరి. ***అట్టివారికి ఈ లోకము యోగ్యమైనదికాదు.*** వీరందరు తమ విశ్వాసము ద్వారా సాక్ష్యము పొందినవారైనను, మనము లేకుండ సంపూర్ణులు కాకుండు నిమిత్తము, దేవుడు మనకొరకు మరి శ్రేష్టమైన దానిని ముందుగా సిద్ధపరచెను గనుక వీరు వాగ్దాన ఫలము అనుభవింపలేదు.

# విశ్వాసాభివృద్ధి

**1. వాగ్దానములు:** బైబిలునందు దేవుడు వ్రాయించిన వాగ్దానములు, అనగా రోగులకు తగినవి చదువుకొనవలెను. వాక్యమునందు a) పాపులకు తగినవి, b) బీదలకు తగినవి, c) అవిశ్వాసులకు తగినవి, d) భయకంపితులకు తగినవి, e) ఎట్టి అక్కరలోనున్న వారికైనను తగిన వాగ్ధానములు గలవు. (మత్తయి 5,6,7 అధ్యా॥లు; యోహాను 14:14; హెబ్రీ. 12వ అధ్యాయము; కీర్తన 25వ అధ్యాయము; యెహోషువా 1వ అధ్యాయము) మొదలగు వాగ్దానములు చదువుటవలన విశ్వాసము వృద్ధియగును. ***(ఇది సులువు మార్గము).***

**2. బైబిలు:** బైబిలులో నీ ఇష్టము వచ్చిన అధ్యాయములు, విశ్వాసము పెరుగువరకు చదువుము. ***జార్జిముల్లరు దొరగారు*** విశ్వాసములో ప్రసిద్ధి కెక్కినారు. తనకు విశ్వాసము మందగిలినప్పుడు ఆయన ఈ పద్ధతినే అవలంభించిరి.

**3. స్తుతి:** విశ్వాసమున్న యెడల స్తుతి బాగుగా వచ్చును. కొన్ని సమయములలో విశ్వాసము ఉండదు గనుక స్తుతి రాదు. అయినను బలవంతముగా స్తుతి మాటలు పలుకవలెను. అదివరకే స్తుతిమాటలు వచ్చియుండును గదా! స్తుతిమాటలు: స్తోత్రము, స్తుతి, వందనము, నమస్కారములు, నుతులు, కీర్తి, మహిమ, మంగళ స్తోత్రార్పణలు, వినుతులు, ప్రణుతి మొదలైనవి. *ఇది చాల కష్టమైన పద్ధతి. అయినను చేయవలెను.*

**4. ఆత్మ, స్తుతిని అందుకొనుట:** శరీరముతో స్తుతించుట అనగా తెలివిని ఉపయోగించి నాలుక స్తుతిచేయును. అట్టి స్తుతి చేయగా చేయగా, మనలోని ఆత్మ శరీరములోని స్తుతిని అందుకొనును. శరీరము స్తుతి చేసినంత వరకు చప్పగా నుండును. అయితే ఆత్మ అందుకొనగానే గొప్ప సంతోషము కలుగును. ***ఇక స్తుతి ప్రవాహము ఆగదు.***

**5. ప్రకటన:** ఎవరికైన ఒకరికి వాక్యము బోధించుము. అప్పుడు దైవాత్మ నీకు వర్తమానము ఇచ్చును. *విశ్వాసమునకు ఉద్రేకము కలుగును. ఒక ఉపాధ్యాయుడు, తన తరగతిలోని మంచి కుర్ర వానిని పెద్దగా ఏర్పరచుట కంటె, అల్లరి కుర్రవానిని ఏర్పరచుట మంచిది. అప్పుడతనికి అల్లరి చేయుటకు సమయముండదు.*

**6. సిలువ:** విశ్వాసము మందగిలునప్పుడు, ఏదో ఒక కష్టము కలిగిన యెడల ఆ మందస్థితి పోవును. ఏ దినము మందముగ ఉండునో ఆ రోజున, శ్రమను పంపవలసినదని ***సాధు సుందరసింగుగారు*** ప్రార్థించిరి. *శ్రమ కలిగినప్పుడే, అసలైన మూలుగు ప్రార్థన వచ్చును గదా!*

**7. కనిపెట్టుట:** ప్రభువు శిష్యులు – 'ప్రభువా! మా విశ్వాసము వృద్ధి చేయుము' అని ప్రార్థించిరి. మనమును అట్లేచేసి, ప్రభువు సన్నిధిలో కనిపెట్టవలెను. అప్పుడు మన స్వంత ప్రయత్నములు ఆగిపోవును. ప్రభువు నీకు వర్తమానమును, విశ్వాసమును, స్తుతిని దయచేయును. బైబిలు చదువుట, స్తుతి చేయుట, ప్రకటన చేయుట, సిలువ అనుభవించుట నీకు ఇష్టముండదు. అప్పుడు కనిపెట్టవలెను.

# విశ్వాసము యొక్క ఒప్పుదల స్తుతి

1. అంతా క్షేమమే
2. అంతా శుభమే
3. అంతా ప్రేమయే
4. అంతా ఆరోగ్యమే
5. అంతా జ్ఞానమే
6. అంతా శాంతియే
7. అంతా దేవుని సన్నిధియే
8. అంతా మార్గమే
9. అంతా పరిశుద్ధతయే
10. అంతా జీవమే
11. అంతా సత్యమే
12. అంతా రక్షణయే
13. అంతా బలియే
14. **అంతా కృపయే**
15. అంతా జయమే
16. అంతా ఆనందమే
17. అంతా సమృద్ధియే
18. అంతా మహిమయే
19. అంతా మేలే
20. అంతా తండ్రి చిత్తమే
21. అంతా తండ్రి స్వాధీనమే
22. **అంతా భాగ్యమే**
23. అంతా దీవెనయే
24. అంతా దృశ్యమే
25. అంతా గోచరమే

# క్రైస్తవుని స్థిర విశ్వాసము

బైబిలులో దేవునియొక్క నిశ్శబ్ద లక్షణమున్నది. అందుచేత క్రైస్తవుని యొక్క విశ్వాసము, దేవుని ఈ నిశ్శబ్ద లక్షణములో కలసిపోవును. అనగా బండవంటి విశ్వాసము, దేవుని నిశ్శబ్ద లక్షణముతో ఏకీభవించును. ఇసుక వంటి క్రైస్తవ విశ్వాసము కదలిపోవును. సైతాను, అతని దూతలు, పాపములు, వడ్డీ పాపములు, పాప ఫలితములు, చావు ఈ మొదలైనవి జరుగుచుండగా, దేవుడు ఎరగనట్లు (అనగా ఏమియు తెలియనట్లు) ఊరుకుంటున్నారు. అదే దేవుని నిశ్శబ్ద లక్షణము. అదే అనేక మందికి ఆటంకము. అయితే 'బండ' (రాయి) వంటి విశ్వాసికి మాత్రము ఈ లక్షణము ఆటంకము కాదు. 'ఇసుక'వంటి విశ్వాసికి దేవునిమీద నేరము మోపుట చేతనవును. ఎందుకనగా ఆయన నిశ్శబ్ద లక్షణమును అర్థము చేసికోలేదు గనుకను, ఇంకను ఆయన కనబడుట లేదు గనుకను. అయితే, రాతిమీద పునాది ఎంత గట్టిగా, స్థిరముగా ఉంటుందో, *బండవంటి క్రైస్తవుని విశ్వాసములో కూడ దేవుని నిశ్శబ్ద లక్షణము వలన, ఏ కదలిక ఉండదు.*

**ఉదా:** ఒక పంతులమ్మగారికి ఎప్పుడు జబ్బులేగాని, ఎన్నడూ విసుగు కొనలేదు. అది ఆశ్చర్యము. ఈ మనిషిది రాతి విశ్వాసము.

| **రాతి విశ్వాసము** | **ఇసుక విశ్వాసము** |
| --- | --- |
| 1. రాతి విశ్వాసిది కూడ నిశ్శబ్ద లక్షణమే. దేవునిని ఏమి అనడు. | 1. ఈ విశ్వాసి దేవునిమీద నేరము మోపుతాడు. |
| 2. కష్టము వచ్చినది; దేవుడు ఊరుకొన్నను ఏమి అనడు. | 2. కష్టమువస్తే, దేవుడు ఆపుచేయ కూడదా! అనును. |
| 3. దేవునిది తప్పు అని ఏనాడు అనడు. | 3. దేవునిది తప్పు అని అంటాడు. |
| 4. దేవునికి ఉన్న **నిశ్శబ్ద లక్షణము** ఉన్నది గనుక, ఏది వచ్చినా, దేవా! నీకే స్తోత్రం అంటాడు. | 4. విసుగుకుంటాడు. |

**ఉదా:** రామచంద్రాపురములో ఒక చాకలి, వర్షం వస్తే ఒక పాకలో నుండగా, పిడుగు పడి చనిపోయెను. అది అజ్ఞానము వలన సంభవించినది. ఇసుక క్రైస్తవుడైతే దేవుడు ఎందుకా తరుణము రానిచ్చినాడు? అని నిందించును. ఆకాశమునుండి వర్షము వచ్చి ఇసుకమీది ఇల్లు పడిపోయినది, నష్టము కలిగినది. ఆకాశములోని వర్షము వల్ల ఇసుక కరిగిపోవునట్లు, ఆలాగే దేవుని నిశ్శబ్దము వలన అవిశ్వాస క్రైస్తవుని యొక్క ఇసుక క్రైస్తవునియొక్క విశ్వాసము కరిగిపోవును.

Bible Mission HQ Guntur

వర్షము వచ్చినది, ఆ నీళ్ళు ఇసుక (పునాది) మీద ప్రవహించడము వల్ల ఇసుక కరిగిపోతుంది. అట్లే భూమిమీద నుండి వచ్చు అవమానములనే వర్షము వలన విశ్వాసము కరిగిపోతుంది. **దేవుని నిశ్శబ్దం వలన, మనుష్యుల నిందల వలన విశ్వాసము చెడును.** వర్షము మంచిదే, అలాగే దేవుని నిశ్శబ్దము మంచిదే. అయితే వరదలు, నిందలు చెడ్డవి. మంచిదైన వర్షము వరదల వలన చెడునట్లు, మంచిదైన దేవుని నిశ్శబ్దము ఈ నిందల వలన అపార్ధము చేయబడును. ఆ చెడ్డదైన వరదలనే ఆక్షేపణలవల్ల విశ్వాసము చెడును. భూమిమీది బురదగల వరద, మనుష్యులయొక్క ఆక్షేపణలకు సమానము. కనుక **రాతి విశ్వాసము గలవారు వేటికీ ఉలకరు, పలకరు, స్థిరులై ఉంటారు.**

## స్థిర విశ్వాస విద్య

ఒక అంశమును గూర్చి పూర్తిగా ప్రార్ధన చేసిన తరువాత అది నెరవేరును, అనగా దేవుని కృపలో నెరవేరియుండును. ఆ నెరవేర్పు మనకు కనిపించే వరకు స్తుతి చేయవలెను. ప్రార్ధనలో ఎంత పట్టుదల ఉండునో, ఆసక్తిలో అంతే పట్టు ఉండవలెను. ఇవి రెండూ కలిసి స్తుతిలో ఉండవలెను. అప్పుడు నెరవేర్పు ఉండవలెను. దీనికే స్థిరమైన విశ్వాసమని పేరు. జంకు ఉండకూడదు. **నెరవేరకపోవడమునకు గల ఆటంకములు, గురుతులు, నీడలు కనిపించునప్పుడు మరింత ఎక్కువ నమ్మవలెను, ఎక్కువ స్తుతింపవలెను.** ప్రార్ధన మాత్రము ఒక్కసారితో ముగింపవలెను. అయితే నెరవేర్పు అగువరకు స్తుతి చేయుచుండవలెను.

# విశ్వాస ప్రమాణము

1. అనాదియు అనంతముగల దేవుడు, అనాది కాలమునందే నన్ను రక్షించవలెనని తలంచినాడని నేను నమ్ముచున్నాను.

2. ఆయన ఎట్టివాడో నరుడుకూడా అట్టివాడై యుండవలెనని, తన దివ్య లక్షణములతో ఆయన నరులను పరిశుద్ధ వంతులనుగా కలుగజేసెనని నేను నమ్ముచున్నాను.

3. మనుష్యులను కాపాడే సహాయకులు అవసరమని; ఆదిని దేవదూతలను ప్రకాశమాన వ్యక్తులుగాను, ఆత్మ స్వరూపులుగాను కలుగజేసెనని నేను నమ్ముచున్నాను.

4. మనుష్యులు పుట్టకముందే వారికి కావలసిన గాలి, వెలుగు, నీరు, ఆహార వృక్షాదులు మొదలయినవి కలుగజేసి, తన ప్రేమను బైలుపర్చినాడని నేను నమ్ముచున్నాను.

5. ఆది దంపతులు సృష్టింపబడిన పిమ్మట వారితో సహవాసము చేసెనని నేను నమ్ముచున్నాను.

6. ఆది మనుష్యులు ఆజ్ఞ మీరగానే వారిని పలుకరించి, రక్షణయొక్క వాగ్ధాన దీవెనలను, భూఫలముల యొక్క దీవెనలను, సంతానము యొక్క దీవెనలను వినిపించుటవల్ల, పాపులను తన దరికి చేరదీసినాడని నమ్ముచున్నాను.

7. రక్షకుడు భూమిమీద జన్మించేవరకు చేయవలసిన సరందములన్నియు, మనుష్యులలో తన భక్తులద్వారా చేసినాడని నమ్ముచున్నాను.

8. అవిశ్వాసులను, విశ్వాసులను కొన్ని యేండ్ల వరకు మందగా నడిపించినను; అవిశ్వాసులను బట్టి విశ్వాసుల శాఖ అంతరించిపోవునేమో అని వారిని విడదీసి, ఒక ప్రత్యేక జనాంగముగాను, రక్షకుడు జన్మించే జనాంగముగాను నియమించినాడని నేను నమ్ముచున్నాను.

9. ఆదిని పరిశుద్ధ స్థితిలో యున్నట్లు, పాప పతనము తరువాత దేవుడు మనుష్యులలో నివసింప వీలులేక పోయినప్పటికిని, అప్పుడప్పుడు తన మాటలు వినిపించుచు, ***పదే పదే తన ప్రేమను బయలుపర్చినాడని*** నేను నమ్ముచున్నాను.

10. అన్యులెంత అవిశ్వాసులైనను వారినికూడ విడువక, వారితో వారి మనస్సాక్షి ద్వారా మాటలాడుచు, వారికి కూడ సృష్టిలోని భాగ్యములను అనుగ్రహించుచుండెనని నేను నమ్ముచున్నాను.

11. కాలము పరిపూర్ణమైనప్పుడు తండ్రి తన కుమారుని పంపి, వాగ్దానములను నెరవేర్చుకొనెనని నేను నమ్ముచున్నాను.

12. యేసుప్రభువు లోక రక్షకునిగా మనుష్య రూపముతో వచ్చి, తన బోధవల్ల మనుష్యులను, పాపులను తన దరికి చేరదీసినాడని నమ్ముచున్నాను.

13. ***మానవుడు నెరవేర్చవలసిన విధులన్నియు యేసుప్రభువు నెరవేర్చినాడని నమ్ముచున్నాను.***

14. ఈ లోక రక్షకుడు సిలువమీద నా పాపములు, వ్యాధులు, శిక్షలు తనపై వేసికొని, నాలోనున్న కీడంతయు తొలగించెనని నమ్ముచున్నాను.

15. ఈ నా రక్షకుడు మరణమును జయించి పునరుత్థానమగుట వలన, ఆత్మీయ జయమును, ఆత్మీయ స్వేచ్ఛను, నేను సంపాదింపలేనివి గడించిపెట్టినాడని నేను నమ్ముచున్నాను.

16. ఈ సర్వలోక రక్షకుని యొక్క శుభ చరిత్ర, అన్ని రాష్ట్రములలో యొక దరినుండి ప్రకటన యగుచుండగా, మరియొక దరినుండి సంఘమనే 'పెండ్లికుమార్తె' సిద్ధమగు చున్నదనియు, ఆయన వచ్చి సంఘమును కొంచు పోవుననియు నమ్ముచున్నాను.

17. ***ఆయన నన్నుకూడ సిద్ధము చేయునని నేను నమ్ముచున్నాను.***

18. అటుతరువాత మిగిలిపోయిన విశ్వాసులకు 7సం॥లు శ్రమలు ఉన్నప్పటికిని, శ్రమద్వారా అనేకమందిని మోక్షమునకు సిద్ధపర్చుననియు నమ్ముచున్నాను.

19. మానవులు బోధలు వినక, శ్రమలలో కూడ మారుమనస్సు పొందక యున్నారు. గనుక చనిపోయిన తరువాత కూడా, హేడెస్‌లో మారుమనస్సు పొందుటకు అట్టివారికి గడువు ఇచ్చుచున్నాడని నమ్ముచున్నాను.

20. పెండ్లి కుమార్తెకు విందైన వెనుక (తరువాత), ప్రభువు భూలోకమునకు వచ్చి, అంతెక్రీస్తును, అబద్ధ ప్రవక్తను నరకములో వేయుననియు; ఆ సమయమందే, ఒక్క సాతానును మాత్రము చెరలో బంధించుననియు నమ్ముచున్నాను.

21. అటుతరువాత ప్రభువు భూమిమీదికి వచ్చి, నూతన పర్చబడిన ఈ భూమిమీద తన సింహాసన మేర్పరచుకొని, తానును, తన భక్తులును భూమిమీద నీతి పరిపాలన చేయుదురనియు, అప్పుడే సర్వలోకమునకును సువార్త పూర్తిగా ప్రకటింపబడుననియు, అప్పుడుకూడా చాలామంది మారుమనస్సు పొందుదురనియు నేను నమ్ముచున్నాను.

22. తుదకు సైతాను గతి ఏదనగా, ప్రభువు వాడిని నరకములో వేయుననియు; ఆ పిమ్మట ఆదాము మొదలుకొని ఆ నిమిష పర్యంతము, సమాధులలో యున్న అవిశ్వాసులయొక్క సమూహమును పోగుచేసి, అంత్యతీర్పు చేయుననియు నేను నమ్ముచున్నాను.

23. అటు తరువాత భూమికూడా పరలోకములో ఒక భాగము అయిపోవుననియు, అందరకును మోక్షానందము కలుగుననియు నేను నమ్ముచున్నాను. ***ఇది కేవలము మంచి క్రియవల్లనే కాక, హృదయ విశ్వాసమువల్లకూడ లభించుననియు నేను నమ్ముచున్నాను.***

24. నేను పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. యేసుక్రీస్తు ప్రభువు విశ్వాసులకు, వారి విశ్వాస జీవనముయొక్క అభివృద్ధి నిమిత్తమై, పరిశుద్ధాత్మతో బాప్తిస్మము ఇచ్చుననియు నమ్ముచున్నాను.

25. పరిశుద్ధాత్మ వల్లనే వెలిగింపు కలుగుననియు, ముఖ్యముగా వాక్యము యొక్క సత్య భావములు తెలియుననియు; ఆయన వలననే నానావిధములైన వరములు దొరుకుననియు నమ్ముచున్నాను.

26. బైబిలు గ్రంథములో దేవుడు ఆయా కాలములయందు, ఆయా కాలపు ప్రజల విషయమై చేసిన అద్భుతములు, లోకాంతము వరకు అవసరమును బట్టి చేయుననియు, విశ్వాసులు అందుకొను శక్తినిబట్టి చేయుననియు నేను నమ్ముచున్నాను. ఆమేన్.

# తలుపు వేసికొనుము

*మనోనిదానము కుదురుటకు ఈ క్రింది అంశములను ధ్యానించి, వాటిని తీవ్రముగా అభ్యసించుము:*

**తలుపు వేసికొనుము** 1) ప్రభువు మాత్రమే జ్ఞాపకము రావలెను.
2) ఇతర సంగతులు రాకూడదు.
3) బోధ వినవలెను.

**ప్రార్థన:–** ప్రభువా! ఇవి మూడును కష్టమైన పనులు గనుక మనో నిదానము ఉన్నా, మాకు కావలసినది అంతా పొందగలము. ***దొమ్మర్లకు, సర్కసు వారికి మనో నిదానమున్నది.*** మాకు అంతకన్న ఎక్కువ కావలెను. గనుక మేము ***పరిశుద్ధ పౌరుషము*** తెచ్చుకొని, మనో నిదానము కుదుర్చుకొను కృపదయచేయుము.

**1వ సంగతి:–** నీవు ప్రార్థన గదిలోనికి వెళ్ళిన తరువాత తలుపు వేసికొనవలెను. నీవు గదిలోనికి వెళ్ళునప్పుడు బయట ఏమి విడిచి వెళ్ళుదువు? పిల్లలు, కోళ్ళు మొ॥నవి, అంతేకాక బయటి మనుష్యులను, పనులను, గందర గోళములను విడిచి వెళ్ళుదువు గదా! ఈ వేళ గదిలోనికి వెళ్ళుటేకాదు, తలుపుకూడ వేసికొనవలెను. లేనిచో కోడి పెట్ట వచ్చును (తలంపులోనికి), తోసివేసినా సరే మరి వచ్చును. కుక్క వచ్చును, కుండలు బుటకరించును (బోర్లదోయును). పిల్లలు వత్తురు, పొరుగువారు వచ్చి కేకవేయుదురు. వేటిని రాకూడదని బయట విడిచినామో అవే వచ్చును. గనుక తలుపు వేయవలెను. ఎవరినీ రావద్దని చెప్పాను గదా! కావలి మనిషిని పెట్టానుగదా! అంటే ప్రభువుయొక్క వాక్యమునకు విరుద్ధము. ఎందుకనగా అవి ఉన్నవి గనుక రావలసి ఉన్నవి. కాబట్టి ***వట్టి ఏకాంత ప్రార్థనలో మాత్రమే ఈ గొప్ప అనుభవమును సంపాదించుకొనగలవు గనుక నీ హృదయ తలుపు వేసికొనవలెను.***

**2వ సంగతి:–** మొదటి తలుపు కర్రతో చేసిన ఇంటి గుమ్మపు తలుపు. రెండవ తలుపు నీ హృదయ తలుపు. నీవు లోపలకు వెళ్ళిన తరువాత కోడివచ్చునా? రాదు. అయితే నీ ఇంటి

తలుపు వేసినా సరే, కోడికూత, కాకికూత, పిల్లల అరుపులు మొదలగునవి అన్ని లోపలికి వచ్చును. తలుపు వేసినను, తప్పకుండా అవి లోపలికి వచ్చును. ఇది నిజమా? అను తలంపుకూడ లోనికి వచ్చును. హృదయములోనికి వచ్చును. గనుక హృదయముయొక్క తలుపువేయుట కూడా అంత అవసరము. హృదయము తలుపు వేసికొనక పోతే కుక్క, నక్క, అడవి జంతువులు, అనుకొనని వన్నీ లోనికి వచ్చును. ***తలుపు వేసిన యెడల ఏమి వచ్చినను లెక్కచేయము.***

హృదయము అంటే ఏమిటి? వేయుట అనగా నేమి? ఇంటి తలుపు వేయుట సుళువు. హృదయమనగా మనస్సు. తలుపు వేయుట అనగా మన మనస్సులోనికి అవి జ్ఞాపకము రాకుండా చేయుట. అనగా బయటనున్న వేమియు జ్ఞాపకము చేసికొనక పోవుట. ***ఇది కష్టమే గాని అలవాటైన తరువాత కష్టముకాదు.*** ఉదా: ఒక బైరాగికి కూతలు వినబడినవి. వెంటనే చెవులు మూసికొనెను. అప్పుడు పాము కాలిమీద నుండి పోయెను. ఇతను మెదలలేదు గనుక కరవలేదు. అంత మనో నిదానముతో ఆయన ఉండెను.

హృదయము తలుపు వేసికొని, ఏ తలంపులు రానీయకుండయుంటే ఎవరు వచ్చును? పరలోకపు తండ్రియే వచ్చును. ***ఎవరిని, వేటిని రానియ్యక పోవుట ప్రభువును రానిచ్చుటకే.*** అప్పుడు ప్రభువుతో ధారాళముగా మాట్లాడవచ్చును. ఇతర సంగతులు మనసులోనికి వచ్చిన యెడల స్థితి పోవును. ప్రభువు తప్ప ఇతర సంగతులేవియు రాకూడదు. అప్పుడు ప్రభువును అడుగవలసినవి అడుగుము. అప్పుడు ప్రభువుకూడా చెప్పును. కళ్ళు మూసికొని, ఆత్మకండ్లు తెరచి ప్రభువును చూస్తు అడగండి.

## సన్నిధి సూర్యకిరణముల గుంపు

నీతి సూర్యుని కిరణముల రాశి. అనగా కుమారునిలో నుండి వచ్చిన వరముల రాశి. నిధి = సమూహము = గుంపు. సర్వ కోరికలు నెరవేర్చు ఒక సూత్రము, దైవసన్నిధి.

**దేవుని సన్నిధి:** మనము ఉదయమునే లేచి నీళ్ళతో ముఖము కడుగుకొని, కొన్ని వాక్యములు చదువుకొని, వీలైన యెడల ఒక కీర్తన పాడుకొని, ఈలాగు ప్రార్థించిన తరువాత కనిపెట్టుట మంచిది.

"ప్రయాసపడి భారము మోయుచున్న సమస్తమైన వారలారా! నాయొద్దకు రండి అని సెలవిచ్చిన ప్రభువా! నీకు స్తోత్రము. నీవు రమ్మన్న ప్రకారముగా నేను నీయొద్దకు వచ్చినాను. నేను నీ సన్నిధిలో కూర్చుని యున్నాను. నీ కిరణములు నామీద పడనిమ్ము. నా శరీరాత్మలమీద నీ కిరణములు పడనిమ్ము. నీ గుణములు నాకురానిమ్ము. నాకు నేటి దినమున నీ ప్రత్యేకమైన వర్తమానమేమైన చెప్పుటకు యున్న యెడల సెలవిమ్ము. ఆమేన్", అని ప్రార్థించిన తరువాత లోకమును, శరీరమును, సాతానును, పాపమును మరువవలెను. 'సదాకాలము నేను మీ దగ్గరనున్నానని' సెలవిచ్చిన యేసు ప్రభువు 'నాతో ఉన్నారు, నా ప్రార్థన విన్నారు' అని విశ్వసించవలెను. ఇట్టి విశ్వాసముతో కనిపెట్టవలెను. ***దేవుడు నా దగ్గర ఉన్నాడు, నేను***

***దేవుని దగ్గర యున్నాను*** అనే ఈ రెండు తలంపులు మాత్రమే కలిగియుండవలెను. ఇట్టి తలంపులతో కనిపెట్టిన యెడల, ఆ సమయమందు ప్రభువు యొక్క కిరణములు శరీరము మీదను, ఆత్మయందును పడును. ఆ కిరణముల వలన ఆత్మలోని చీకటి అవిశ్వాసము, నిరాశ, చింత, దుఃఖము, భయము, పిరికితనము అనునవియు, ఇంకా చెడుగునకు సంబంధించినవన్నియు గతించిపోవును. హృదయమునకు శాంతి, సంతోషము, ఆదరణ వచ్చును. మోషే నలుబది దినములు దేవుని దగ్గర కనిపెట్టినందున, ఆయన ముఖమునకు దైవకళ వచ్చెను. మనుష్యులకు కనబడకుండా ఆ కళను బట్టతో కప్పుకొన్నను, బట్టలోనుండి బైటికి వెళ్ళి, మనుష్యులమీద పడెను. మోషే నలుబది దినములు దేవుడు చెప్పినది చేసెను. దేవుడు చెప్పిన మాటలు వ్రాసుకొనెను. ***ఆయన ముఖకాంతి, కళ, సౌందర్యములను మోషే సంపాదించుకొనెను.*** *ఆలాగుననే మనమును దేవుని సన్నిధిలో కనిపెట్టుకొనిన యెడల, దేవుని కిరణములు మనమీద పడును. మోషే నలుబది దినములు కనిపెట్టుకొని అంత మహిమను సంపాదించుకొంటే,* ***మన జీవిత కాలమంతటిలో ప్రతి దినమును కనిపెట్టగలిగిన యెడల, మనమెంత సంపాదించుకోగలము.*** కనిపెట్టుట వలన సాతానుకు ఇష్టము లేదుగానీ, దానికి చాలా కష్టము. కనిపెట్టు వారనగా దేవునికి చాలా ఇష్టము.

***ఉదా:*** యాకోబు తనకు కలిగిన కుమారులందరిలో, తన దగ్గర కూర్చుండిన కుమారుని ఎక్కువగా ప్రేమించెను. తక్కిన కుమారులు తండ్రియొక్క పొలములో కష్టపడి పనిచేయువారు. వారిని తండ్రి ప్రేమించెను గాని తన దగ్గర కూర్చుండిన కుమారునిని మిక్కిలిగా ప్రేమించెను. *ఆలాగుననే మన పరలోకపు తండ్రి, తన వాక్కు వినగోరువారిని మిక్కిలిగా ప్రేమించుచున్నాడు.* ఈ కాలంలో సువార్త ప్రకటించువారు అనేకులున్నారు. పత్రికలు పంచువారు ఉన్నారు, ప్రసంగీకులున్నారు, ప్రార్థించువారు ఉన్నారు, సంగీతములు పాడువారు ఉన్నారు ***గాని కనిపెట్టువారు లేరు.*** కనిపెట్టుట ఎంతో మంచిది. కనిపెట్టుట మనకు చిన్నప్పటి నుంచి లేదు. యోహాను ప్రకటన గ్రంథములో నున్న విషయములన్నిటిని కనిపెట్టు సమయములో చూచెను. దర్శనములు చూచుట, వాగ్దానములు పొందుట, మాటలు వినుట, బోధలు, పాటలు దేవుని దగ్గర నేర్చుకొనుట; అనునవి కనిపెట్టు సమయములో జరుగు విషయములై యున్నవి. *ఒక వేళ ఇవి వెంటనే జరుగకున్నను,* ***కిరణములు పడుట అనుదినము తప్పక జరిగి తీరును.*** నీకు ప్రారంభమందు, కనిపెట్టుట ద్వారా లాభమనిపించనట్టు కనబడవచ్చును. గాని ఆయన కనబడని సమయములోనే కనిపెట్టుటనునది (మానవుల కొరకు కనిపెట్టుట కంటె) ఎక్కువగా కొనసాగించ వలెను. అప్పుడు అన్ని విధములైన లాభములు పొందగలము. ***కనిపెట్టు వారికి విశ్వాసమును, శ్రద్ధయు, ఓపికయు ఉండవలెను.*** *సోమరితనమును, బద్ధకమును, జయించవలెను. ఈ రెండును జయించి కనిపెట్టువారు, కనిపెట్టుటలో ఎంత మహిమ యున్నదో అనుభవించి, అంతవరకు సాక్ష్యమియ్యగలరు.* దినమునకు అధమ పక్షము ఒక గంట కనిపెట్టుట చాలును. ఆ తరువాత మీ ఇష్టము.

# ధ్యానపరుని వృద్ధి -I

*"అతడు, నీటి కాలువల యోరను నాటబడినదై, ఆకువాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుండును" కీర్తన 1:3.*

మన మనో దృష్టిలో నీటికాలువను, దాని ఒడ్డున ఉన్న ఒక చెట్టును తలంచవలెను. ఈ చెట్టులో రెండు భాగములున్నవి: 1) ఆకులు, 2) పండ్లు. నీరు నేలమీద ప్రవహించును. భూమి లోపలికి పోవును. అయితే బైబిలులో నున్నది చిత్రమైన కాలువ. అది, మన కాలువ వంటి కాలువ కాదు. ఈ నీరు చెట్టుపైకి పోవును. ఈ కాలువ నీరు ఈ అడంగు (ఉత్పత్తి స్థానము) నుండి, ఆ పై అడంగునకు వెళ్ళును. అనగా ఈ కాలువ నీరు చెట్టు వ్రేళ్ళనుండి పై కొమ్మలకు, ఆకులకు, పండ్ల వరకు వెళ్ళును. నీటి కాలువ దగ్గరనున్న చెట్టులోని నీరు, చెట్టు క్రిందనుండి చెట్టుపైకి ప్రవహించును. సమస్త సృష్టిలో నీరు ఉన్నది. కాలువలో, నదిలో, సముద్రములో, చెరువులో, బావిలో, సరస్సులో, లోయలలో, మేఘములలో, కొండలలో, చెట్లలో, ముంజెలలో, మనిషిలో, సమస్త సృష్టిలో నీరు ఉన్నది. ఈ దావీదు కీర్తనలోని కాలువలోని నీరు, 'చెట్టు అన్నిభాగములకు వెళ్ళినది' అని బైబిలులో లేదుగాని సృష్టిలోనున్నది. 1)బోధించువారు బైబిలులో నున్నవి చెప్పవచ్చును. 2) బైబిలులో లేకపోయినను, సృష్టిలోనున్నవి చెప్పవచ్చును. 3) అనుభవములో నున్నవి చెప్పవచ్చును. ఎండలో నడిచిన తర్వాత నీరు త్రాగిన చల్లగానుండును. ఇది బైబిలులో లేదు గాని అనుభవములో గలదు. బోధించునప్పుడు ***1) బైబిలులోనున్న వాటినిగాని, 2) సృష్టిలోని వాటినిగాని, 3) అనుభవములో నున్నవాటిని*** గాని కొట్టివేయరాదు. జామ పండు తియ్యగా నుండునని బైబిలులో, సృష్టిలో లేకపోయినను అనుభవములో నున్నది.

బైబిలు మిషను బోధ, బైబిలులో నున్నదా? అని అడిగినప్పుడు పై మూడింటిలో నున్నదని చెప్పవలెను. ఒకరు ప్రార్థించుచు ఊగెను, అది నీకు లేకపోవచ్చును. అంత మాత్రమున 'అతని ప్రార్థన వట్టిది' అనకూడదు. ప్రార్థించినప్పుడు ఆనందము కలిగి స్తుతివచ్చును. అది నా అనుభవములో లేదు గాని వాని అనుభవములో నున్నది. అంత మాత్రమున 'అతని స్తుతి వట్టిది' అనకూడదు. మ్రాను, కొమ్మలు, వ్రేళ్ళు వాక్యములో (కీర్తన 1వ అధ్యాయములో) లేకపోయినను సృష్టిలో నున్నవి. గనుక సృష్టిలోనున్నవి, బైబిలులో లేకపోయినను వాక్యమునకు వ్యతిరేకము కాదు. ఆలాగే అనుభవములోనివి వాక్యములో లేకపోయినను, వాక్యమునకు విరుద్ధము కాదు. ఊట మ్రానులో నుండి పైకి వెళ్ళుచున్నది. చెట్టుయొక్క వ్రేళ్ళు భూమిలోపలి వరకు ఎదిగి వ్యాపించి యున్నవి. చెట్టు వాయు మండలము వరకు ఎదిగియున్నది. అతడు (విశ్వాసి), నీటి కాలువ యోరను నాటబడిన చెట్టువలె నుండును. చెట్టు విశ్వాసులకు పోలిక. ఇందు అవిశ్వాసులు, అన్యులు లేరు. విశ్వాసులే నీటి ఒడ్డున నున్న చెట్టు. ఆకు, పండ్లు అన్ని మంచివే, చెడుగేమియు లేదు. ఆలాగే విశ్వాసి మంచివాడే. గనుక విశ్వాసులకే ఈ బోధ. అవిశ్వాసులకు ఇంకా అనేక వాక్యములున్నవి. అవిశ్వాసి, పాపి, దుష్టుల ఆలోచన

ప్రకారము చేయువారు; వారికి మార్పు అవసరమా? లేక నీతిమంతుడు, విశ్వాసి, సజ్జనుడు, దేవేష్టుడు; వీరికి మార్పు అవసరమా? పై జాబితా వారికి అశుభ్రత పోయి శుభ్రత రావలెను. ఆలాగే, విశ్వాసులకు కూడ మార్పు అవసరము. అనగా వృద్ధి కావలెను. **అవిశ్వాసికి శుద్ధి, విశ్వాసికి వృద్ధి కావలెను అని** బైబిలులో లేదుగాని సృష్టిలో నున్నది. విశ్వాసి, ఈ భూమిమీద పండ్లు కాచేవరకు అనగా బహిరంగ భక్తి వచ్చేవరకు ఎదగవలెను. పండ్లు బయటికి కనబడును అనగా విశ్వాసియొక్క క్రియలు అందరూ చూతురు గాని ***వ్రేళ్ళు పైకి కనబడవు. అనగా ప్రభువునకును, విశ్వాసికిని ఉన్న సంబంధము అంతరంగ సహవాసము. పైకి కనబడదు.*** పండ్లు కనబడినట్లు విశ్వాసి యొక్క క్రియలు కనబడవలెను. "మనుష్యులు మీ సత్ క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు, వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" (మత్తయి 5:16). చెట్టు చివరి వరకు నీరు వెళ్ళును. ఆలాగే, విశ్వాసికి ప్రతి దినము ఊట (అనగా దేవుని వాక్యము) ఎక్కవలెను. దేవుని వాక్యము చదువునప్పుడు సంతోషము, ఉద్రేకము వచ్చును. ***ఊటవేరు, వాగువేరు. వాక్యము వేరు, వర్తమానము వేరు.*** వాక్యము కథ మాత్రమే. పక్షవాత రోగికి ప్రజలు, ఇల్లు, పెంకులు, కప్పు ఆటంకముగా నున్నను ప్రభువు నొద్దకు వెళ్ళెను. ఇది వాక్యములో నున్న కథ. వర్తమానమనగా ఆటంకములున్నను, ప్రభువు సన్నిధికి తప్పక వెళ్ళవలెను. ఉదయముననే బైబిలు చదువుటకు ఆటంకములున్నను చదువవలెను. వాక్యములోని సారము గ్రైకొనవలెను. ప్రభువు సముద్రము మీద నడచెను. ఆలాగే ఆటంకములున్నను, మనమును లోకములో నడువవలెను. చెట్టు ఊటను లాగినట్లు, మనమును వాక్యములో నుండి వర్తమానము అందుకొనవలెను. విశ్వాసి ఇట్లు చేయుచు తన సత్ క్రియలు కనబడు వరకు, మోక్షమునకు వెళ్ళు వరకు ఎదగవలెను.

**పెండ్లికుమార్తె సంఘము:** 'ప్రభువు రెండవసారి వస్తారు' అని ఎదురుచూచు విశ్వాసులు తమ క్రియలు కనబడువరకు ఎదగవలెను. అక్కడ నుంచి మేఘము వరకు, అక్కడ నుండి నూతన యెరూషలేము చేరువరకు ఎదగవలెను. వీరిలో సజీవుల గుంపు గొప్పది. ఈ దినము ప్రభువు వచ్చిన యెడల, వారు సమాధిలోకి వెళ్ళరు. వారు రాకడ వరకు, మేఘము వరకు, నూతన యెరూషలేము వరకు ఎదుగవలెను. మరణించిన విశ్వాసులు సమాధిలోనికి వెళ్ళి, రాకడలో పాలు పొందుదురు. సజీవులు ఒక్కసారే మేఘము లోనికి, నూతన యెరూషలేమునకు పోవుదురు. ***వాగు దగ్గరనున్న చెట్టు మరణము పొందే విశ్వాసికిని, ఊట దగ్గరనున్న చెట్టు మరణము లేని విశ్వాసికిని మాదిరిగా నున్నది.*** ప్రభువు రాకడకు ముందు కొందరు విశ్వాసులు చనిపోవుదురు. ఎందుకనగా వారి ఆయుష్కాలము పూర్తి అయిపోయినది. మరియు విచారము, జబ్బు, ఇబ్బంది వలన కొందరు చనిపోవుదురు. కసింద చెట్టు (తగరచెట్టు) ఎదుగదు. చింత, తాడిచెట్టు ఎదుగును. వాక్యము చదువునప్పుడెల్ల ఊట లాగుకొనవలెను. విశ్వాసి యొక్క వాగు, విశ్వాసియొక్క మ్రాను, కొమ్మలు, ఆకులు, పండ్లు, వేరు ఇవన్నీ ఏమిటి? విశ్వాసి అవి కలిగియున్నాడా? *సాయంకాలము పరుండక ముందు ఈ ప్రశ్న వేసికొనవలెను:* ***ఈ దినము***

*ఎంత వరకు ఎదిగినాను?* నిన్న ఉన్నంత ఉన్నానా? ఇంకా ఏమైన ఎదిగినానా? అని పరీక్షించుకొనవలెను. *గతించిన సంవత్సరములో ఉన్నంతే ఉన్నానా? లేక ఏమైనా ఎదిగినానా?* అని ప్రశ్నించుకొనవలెను. ***ప్రార్థన:*** – 'మేము వృద్ధి పొందవలెను' అనే పాఠము. చెట్టును బట్టి మాకు నేర్పిన ప్రభువా! వందనములు. మేము నీ సంఘములో, ఆత్మీయ వృద్ధిలో ఎంతవరకు ఎదగవలెనో, బయట సువార్తపని చేయుటలో మేమెంత వరకు పని చేయవలెనో, అంతవరకు చేయించుమని వేడుకొను చున్నాము. ఆమేన్.

## ధ్యానపరుని వృద్ధి - 2

***ప్రార్థన:*** ఓ ప్రభువా! చెట్టు ఏ విధముగా సారము పీల్చుకొనునో, అట్లే మా ఆత్మీయ జీవనవృద్ధి కొరకు నీ వాక్యములోనుండి సారము తీసికొనగలుగు కృప అనుగ్రహించుము. వర్తమానమిచ్చినందుకు వందనములు. చెట్టు ఊటను ఏలాగు అందుకొనునో, అట్లే నీ వర్తమానమును మేము అందుకొనునట్లు చేయుము. వినువారు అందుకొనలేక పోయినను, నీవు వర్తమానము ఇస్తావు గనుక వందనములు. రాజకుమారుని పెండ్లి విందు అందరికిని; రాజబాటలో నున్నవారిని కూడ తోడుకొని రమ్మని చెప్పిన తర్వాత, చాలాస్థలము ఉండిపోయెను. గనుక ఒక్కొక్కరు అందుకొన వలసిన వర్తమానము అందుకొనే కృప దయచేయుము. ఆమేన్.

*"అతడు నీటి కాలువల యోరను నాటబడినదై, ఆకువాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుండును"* కీర్తన 1:3. వృక్షమునకు వృద్ధిగలదు. ఆలాగే విశ్వాసికూడ వృద్ధి పొందవలెను. లోకములో అందరు వృద్ధి కోరుకొందురు. వర్తమానము వినునప్పుడు *1) పరాకు, 2) పరధ్యానము, 3) మనోనిదానము లేకపోవుట, 4) చెప్పిన సంగతులు సరిగా వినకపోవుట;* ఇవన్నియు పాపము. ఇవన్నియు మన వృద్ధికి ఆటంకము. మానవ జీవితములో; పుట్టినప్పుడు శిశుజీవితము, తరువాత బాల్య స్థితి, యౌవన స్థితి, కౌమార స్థితి, చివరగా వృద్ధాప్యము; ఈ రీతిగా వృద్ధిగలదు. ఈ వృద్ధి అవసరము లేదనేవారు లేరు. ***గాలివలన, నీటివలన, ఆహారము వలన వృద్ధి కలుగును.*** మరుగుజ్జు వాళ్లు పైవాటన్నిటిని తిందురుగాని ఎదుగరు. శరీర జీవితములో మరియొక వృద్ధి ఏదనగా, పెద్దవారైన తరువాత 'సొమ్ము కావలెనని కోరుదురు'. వర్తకుడు 'పది రూపాయలు, మొదటగా, తర్వాత ఇరవై రూపాయలు:' ఈ రీతిగా వృద్ధి కావలెనని కోరును. ఏది కావలెనో దాని వృద్ధి కోరుదురు. ***ధనవృద్ధి అవసరము గాని ధనాపేక్ష తప్పు.*** మరియు విద్య అవసరమే, దానిలోని వృద్ధికూడ అవసరమే.

నీటికాలువ యోరను నాటబడిన చెట్టు– మానవ జీవితములోని వీటన్నిటియొక్క వృద్ధికి మాదిరిగా నున్నది. వృక్ష జీవితములో వృద్ధి కావలెను. శరీర జీవితములో వృద్ధి కావలెను. ఆలాగే ఆత్మీయ జీవితములో కూడ వృద్ధి కావలెను. విశ్వాసి ఎందులో వృద్ధి పొందవలెను? బైబిలు చదువుటలో వృద్ధి పొందవలెను. ఆది, నిర్గమ, లేవి మొదలైనవి చదివి, దినవృత్తాంత గ్రంథములలో పేర్లు ఉన్నవని మానివేసిన యెడల, అది వృద్ధి కాదు. ***బైబిలు క్రమముగా చదువుటలో వృద్ధిపొందవలెను.*** చదువుట వలన కథలలో వృద్ధి, గాని అందులోని ఊట లాగవలెను. ***ప్రతి కథకు బోధ ఉన్నది.*** ఆ బోధ గైకొనిన యెడల బైబిలుజ్ఞానములో వృద్ధి

పొందుదుము. ఎవరు బైబిలు జ్ఞానములో వృద్ధి పొందరో, వారు ఆత్మీయ జీవితములో వృద్ధి పొందరు. బైబిలు చదువుట మాత్రమే కాదు. ఆ సారము తీసికొంంటేనే వృద్ధి కలుగును. అందులోని సారమే బైబిలు అనుభవము. మరియు ప్రార్ధనలో వృద్ధి పొందవలెను. ఎన్ని ప్రార్ధనలు చేసినను, నెరవేరనప్పుడు ఎట్లుండును? అప్పుడు నిరాశపడితే ప్రార్ధనలో వృద్ధి ఉండదు. వాక్యము చదువునప్పుడు, దానిలో నాకు ఏ సారములేదని విసుగుకొంటే వృద్ధిలేనట్లే. ప్రార్ధనకు జవాబు రాకపోయినను సంతోషించవలెను. అప్పుడు ప్రార్ధనలో వృద్ధి కలుగును. మరియు ఆత్మీయ జీవనవృద్ధి కొరకు సేవచేయవలెను, ఇతరులకు సువార్త చెప్పవలెను. శరీర జీవితము, ఆత్మీయ జీవితము రెండును కలిసి మానవ జీవితమైనది. ఒకరు మంచి విద్యావంతుడైనంత మాత్రమున, అతడు శరీర జీవితము గలవాడుగాని ఆత్మీయ జీవితము గలవాడు కాడు. ***ఈ రెండు జీవితములు అనుభవించుటకు, దేవుడు మానవుని కలుగజేసెను.*** యేసుప్రభువు ఈ భూలోకమునకు వచ్చినప్పుడు చేసిన ఒక ముఖ్యమైన పని ఆత్మ రక్షణ. యేసు ప్రభువు రేపు మేఘముమీద వచ్చినప్పుడు చేయు ముఖ్యమైన పని, శరీర రక్షణ అనుగ్రహించుట. మొదటవచ్చి పాపములను పరిహారము చేసి, ఎట్లు రక్షించెనో, అట్లే రేపు శరీర రక్షణ కలుగచేయును. ఇక్కడ దేహమునకు జబ్బు రాకుండ చేయలేము గనుక ఆయన మన దేహ సంరక్షణ చేయుచున్నాడు గాని అప్పుడు రక్షణ కలుగజేయును. అప్పుడు మన దేహముతో అమెరికాకు వెళ్ళగలము, ఎక్కడికైనా వెళ్ళగలము. చీకటిగాని, మరేదియు అడ్డురాదు. ఇప్పుడు దేహమునకు ఆయనే అన్ని సదుపాయములు ఇచ్చుచున్నాడు. గాని పరిపూర్ణ రక్షణ రాలేదు (రోమా 8వఅధ్యా). శరీర జీవనమునకు కావలసిన ప్రార్ధన: 'మా దినాహారము నేడు మాకు దయచేయుము'. ఆత్మీయ జీవనమునకు కావల్సిన ప్రార్ధన: 'మా ఋణస్థులను మేము క్షమించిన ప్రకారము మా ఋణములను క్షమించుము'. రేపు ప్రభువు వచ్చిన తరువాత మన దేహమునకు ముండ్లుగాని, మరేమియు గాని అడ్డు రావు. ఇవి శరీర జీవితమునకు సరిపడు మాటలు, ఆత్మీయ జీవితమునకు సరిపడు మాటలు. శరీర జీవిత వృద్ధికి సరిపడు మాటలు, ఆత్మీయ జీవిత వృద్ధికి సరిపడు మాటలు విన్నారు. గనుక రెండవ రాకడకు సిద్ధపడండి. శరీర జీవితమును వృద్ధి చేసికొనుచున్న మీరు, ఆత్మీయ జీవితములో వృద్ధిపొందినారా? ఆత్మీయ జీవితములో అనగా, **వాక్యము, ప్రార్ధన, సేవ** వీటిలో వృద్ధి పొందిన యెడల, ఈ లోకములోను పరలోకములోను సౌఖ్యము కలుగును.



# మోకాళ్ళ జీవనము

1) స్తుతి రాకపోయినను సరే,

*2) చందా ఇచ్చే మనసు లేకపోయినను సరే,*

*3) లేనిపోని తలంపులు వచ్చినను సరే,*

*4) ఇష్టము లేకపోయినను సరే,*

***5) సమయము లేకపోయినను సరే,***

*6) నిద్ర వచ్చినను సరే,*

*7) బైబిలు చదువుటకు ఆశ లేకపోయినను సరే,*

*8) ఎన్ని నిందలు వచ్చినను సరే,*

***9) మోకాళ్ల నొప్పి వచ్చినను సరే,***

*10) ప్రార్థన రాకపోయినను సరే,*

*11) ఫలితము లేకపోయినను సరే,*

*12) ధ్యానించుట లేకపోయినను సరే,*

***13) మిష, సాకులు, అడ్డములు చెప్పక మోకాళ్ళూనవలెను.***

ఇవన్నియు లేకపోయినను సరే మోకరించవలెను. ఇదే అన్నిటికి మార్గము. క్రీస్తు ప్రభువు వారు రెండవ రాకడలో మహిమ జీవనము చూపును. అప్పుడందరు మోకరింతురు. గనుక ఇప్పుడే అది చేయవలెను.

ప్రార్థన లేకపోయినను, పాపవిసర్జన లేకపోయినను, ఉజ్జీవము లేకపోయినను, బైబిలు చదువుట లేకపోయినను, కీర్తనలు పాడకపోయినను, ప్రసంగములు చేయక పోయినను: ***"మోకాళ్ళమీద నుండిన యెడల" వీటన్నిటికి ద్వారముగా ఉండును.*** అవన్నియు కలుగును. షరా: అనుదినము 4గం॥కు లేచి మోకాళ్ళని ప్రార్థన, స్తుతి చేయవలెను. ***శ్రమలున్నప్పటికినీ, అవి తప్పించుకొనుటకు మోకాళ్ళ జీవనమే ఒక గొప్ప సాధనము.*** ఇది శ్రమయైనను చేయవలెను.

## మన బ్రతుకుయొక్క జీవనము

1) నామక జీవనము ↓

2) విసర్జన జీవనము ↓

3) సామాన్య జీవనము →

4) ఉజ్జీవ (ఉత్సాహ) జీవనము ↑

5) ప్రత్యక్ష జీవనము ↑

6) మహిమ జీవనము

Bible Mission HQ Guntur

# నమ్మకమైన సేవ -I

*'అతడు (అబ్రాహాము) నమ్మకమైన మనసుగలవాడని (దేవుడు) ఎరిగి' (నెహెమ్యా 9:8);*

*'ప్రాణాపాయము వచ్చినను నమ్మకముగా ఉండుము' (ప్రకటన 2:10).*

పనిచేయుటకు అనేకములైన ఆటంకములు కలుగుచున్న వారలారా! 'ప్రాణాపాయము వచ్చినను నమ్మకముగా నుండుము', అని చెప్పబడిన ధన్యత మీకు కలుగును గాక. నెహెమ్యా గ్రంథములో, అబ్రాహామునుగూర్చి 'నమ్మకమైన మనస్సు గలవాడని' యున్నది. ప్రకటనలో, ఆపద ఉన్నను నమ్మకముగా నుండుమని ప్రభువు స్ముర్న సంఘముతో చెప్పుచుండెను. ***నమ్మకమైన మనసు గలవాడు, నమ్మకమైన పనిచేయలేడా? చేయగలడు.*** అయితే, ఆటంకము వలన చేయలేక పోవుచున్నాడు. ఒక మనిషి గంభీరమైన పనిచేయుచున్నాడు, గొప్ప పనిచేయుచున్నాడు. *గాని తన మనస్సు నమ్మకమైనది కాదు. అయితే, విధులనుబట్టి చేయుచున్నాడు.* ఈ రెండు తరగతుల వారున్నారు. మరియొక వరుస: దేవుడు మనలను నమ్ముట, మనము దేవుని నమ్ముట. మనమందరమును ఈ ప్రశ్న వేసికొనవలెను: 1) మనుష్యులు నన్ను నమ్ముచున్నారా? 2) ప్రభువు తన సేవలో నన్ను నమ్ముచున్నాడా? అబ్రాహాము క్రియ చేయకముందే అనగా పని చేయకముందే దేవుడతనిని నమ్మెను. 1) అబ్రాహాము నమ్మకమైన మనస్సు గలవాడని దేవుడు కనిపెట్టినాడు. 2) మనస్సు కలిగియుండుట మాత్రమేకాదు. ప్రవర్తనలో దానిని కనుపర్చవలెను, 3) సేవలో కనపర్చవలెను. ***మన ప్రవర్తననుబట్టి నమ్మకమైన మనస్సు గలవారని ప్రజలు తెలిసికొందురు.*** మన సేవనుబట్టి నమ్మకమైన మనస్సుగల వారమని ప్రజలు మనగూర్చి తెలిసికొందురు.

I. అబ్రాహామునకు 1) నమ్మకమైన మనస్సు ఉన్నది. 2) నమ్మకమైన క్రియ ఉన్నది. 3) నమ్మకమైన ప్రవర్తన ఉన్నది. గనుక దేవుడు అబ్రాహాముతో ***'ఊరు'*** అను పట్టణమునుండి, నేను చూపించు దేశమునకు వెళ్ళుమని చెప్పినప్పుడు అబ్రాహాము వెళ్ళెను. గనుక అతనికి నమ్మకమైన మనస్సు ఉన్నది. మరియు క్రియకూడ నున్నది. అబ్రాహాము చరిత్రనుబట్టి, దేవుడు బయలు దేరమంటే ఆయన బయలుదేరెను, కుమారుని అర్పించుమంటే ఆలాగు చేసెను. *గనుక* ***మనస్సునుబట్టి దేవుడు సాక్ష్యమిచ్చును. క్రియలనుబట్టి మనుష్యులు సాక్ష్యమిత్తురు.*** నమ్మకమైన మనస్సుగలవారు, నమ్మకమైన క్రియగలవారు; నమ్మకమైన ప్రవర్తనగలవారు. నమ్మకమైన సేవచేయగల కొందరు నమ్మకమైన మనస్సు గలవారైనను, ఆటంకములనుబట్టియు, మిషనులనుబట్టియు సరియైన సేవ చేయలేరు. మరియు కొందరు నమ్మకమైన మనస్సు లేకపోయినను ఆచారాలనుబట్టియు, విధినిబట్టియు, భయమును బట్టియు, మెప్పును బట్టియు సేవ చేయుదురు. అబ్రాహాము తన కుమారుని బలివేయవలసినదని, దేవుడు అతనితో చెప్పినప్పుడు బలి వేసినాడా? అతడు అంతరంగములో బలిచేసెను. 'మృతులలో నుండి అబ్రాహాము తన కుమారుని పొందెనని' పౌలు తన పత్రికలలో వ్రాసెను. అపనమ్మిక అబ్రాహాము మనస్సులో లేదు. ప్రభువు మనకు ప్రత్యక్షముగా కనబడకపోయినను, ఆయన మనకు ఇచ్చిన పనిని మనము నమ్మకముగా చేయవలెను. తన కుమారుని బలి ఇచ్చుటయే

అబ్రాహాము చేసిన గొప్పసేవ. మన మనస్సునకు గొప్ప కష్టమువచ్చే పని దేవుడు ఇచ్చిన యెడల మనము చివరి వరకు చేయగలమా? అబ్రాహామువలె చేయవలెను. అబ్రాహామునకు కఠినమైన పని ఇవ్వబడెను. *'నేను కుమారుని అర్పించనని చెప్పి వెళ్ళిపోవలసినదే'* గాని అట్లు చేయలేదు. మొదటి నుండి చివరి వరకు అబ్రాహాము నమ్మకమైన సేవకుడై యున్నాడు. మనకు ఇదే గొప్ప పాఠము. ***మీరు మీ పనిలో నమ్మకమైన మనస్సు, నమ్మకమైన సేవ రెండును కలిగియున్నారా?*** కొంతకాలము నమ్మకమైన మనస్సు కలిగియుండిన తర్వాత నమ్మకము పోగొట్టుకొన్నారా? కొంతవరకు నమ్మకమైన పనిచేసి తర్వాత విడిచిపెట్టినారా? నమ్మకమైన సేవ విడిచిపెట్టిన యెడల కొంతకాలమునకు నమ్మకమైన మనస్సుకూడ పోవును. చివరి వరకు నమ్మకమైన మనస్సు, సేవ నిలిచియుండునట్లు దేవుని ప్రార్థింపవలెను.

II. దోతాను దగ్గర యోసేపు అన్నలున్నారు. వారు గొర్రెలను మేపుచున్నారు. అక్కడ అన్నలు యోసేపును గుంటలో పడవేసి, అన్నము తినుచున్నారు. పదిమంది చేతులలో యోసేపు ఉన్నాడు. వారి తండ్రియైన యాకోబు, ఆ పదిమంది కుమారులకు యోసేపును అప్పగించెను. వారేమిచేసినారు? గోతిలో పడవేసినారు! మీకు ప్రభువు సంఘములు అప్పగింపవచ్చును, అన్యులను అప్పగింపవచ్చును. మీరు వారిని అమ్ముకొందురా? అన్నలు తమ్ముని అమ్ముకొన్నారు కదా! యోసేపును గోతిలోవేసి, వారు అన్నము తినుచున్నారు. మీకప్పగింపబడిన వారిని మీరేమి చేయుచున్నారు? మీకు అప్పగింపబడిన సంఘములను సరిగాచూచి, వాక్యము చెప్పినయెడల సంతోషమే. ప్రభువు మిమ్ములను నమ్మి- మీ చేతులలో పెట్టిన ఆయా సంఘములలోను, పాఠశాలలలోను, గ్రామాదులలోను మీరు నమ్మకమైన సేవచేయుచున్నారా? రేపు తీర్పు దినమందు ప్రభువు అడుగును. *మిమ్ములను నమ్మి మీకప్పగించిన వాటిని ఏమిచేశారు?* అని అడుగును. అబ్రాహాము నమ్మకముగా పనిచేసెను గాని అతని మునిమనుమలు అనగా, యాకోబు పదిమంది కుమారులు నమ్మకముగా పనిచేయలేదు. ***ఉదా:*** ఒకరు ఒక కర్రను కొని కుర్చీచేయుమని, వడ్రంగిని నమ్మి ఇచ్చెను. అతనిని నమ్మి ఇచ్చినాము *గనుక* మంచిచేసిన అతనిదే, చెడుచేసిన అతనిదే భారము. నీవు భూలోకములో జీవించినంత కాలములో, ఆయన నీకు పని ఇచ్చినాడు. నీవు నమ్మకముగా సేవచేసి ఉన్నయెడల, అంత్యదినమున ప్రభువు *'భళా నమ్మకమైన మంచివాడా'!* అని మెచ్చుకొనును.

***బైబిలు మిషను సువార్తికుడా! నీవు నమ్మకమైన మనసు కలిగి పనిచేయుచున్నావా? నమ్మకమైన సేవ చేయుచున్నావా? 'భళా నమ్మకమైన మంచి సువార్తికుడా!' అను మెప్పు రేపు వచ్చునా? ఆలోచించుకొని, నీ మనస్సాక్షికి నీవే జవాబు చెప్పుకొనుము.***

## నమ్మకమైన సేవ -2

III.) ఐగుప్తులో పోతీఫరు తన ఇల్లంతటిని యోసేపునకు అప్పగించెను. పోతీఫరుయొక్క భార్య ఒక్కతే గృహములో గలదు. యోసేపు యౌవనుడు. బంగళాలో ఎవ్వరును లేరు, కూలీలుకూడ లేరు. అప్పటికి 3 సం॥ల నుండి యోసేపు ఆ ఇంటిలో నుండెను. *ఈ 3 సం॥లు ఆ స్త్రీ యోసేపునకు ఆటంకముగా నుండెను.* తండ్రియొద్ద యోసేపు మతము

నేర్చుకొన్నాడు గనుక అన్ని కష్ట పరిస్థితులలోను దేవుని యెడల నమ్మకముగా నుండెను. మంచి ప్రవర్తన కలిగియుండెను. గనుకనే ఆమెయొద్దనుండి పారిపోయి, క్రియలో తన నమ్మకము కనపర్చినాడు. 1) ఒక కుమారుని (ఇస్సాకును) అబ్రాహామునకు దేవుడిచ్చి, తన యెడల నమ్మకము కనుపర్చుకొనెను. అబ్రాహామును నమ్మకముగా నుండెను. 2) ఒక సహోదరుని (యోసేపును) 10 మంది సహోదరులకు దేవుడప్పగించెను. గాని వారు నమ్మకముగా అతనియెడల పని చేయలేదు. 3) ఒక స్త్రీని దేవుడు యౌవనస్థుడైన యోసేపున కప్పగించెను. యోసేపు తన పనిలో నమ్మకముగా నుండెను. *అబ్రాహాము ప్రవర్తన మంచిది. కాబట్టి సేవకూడ మంచిది. 10 మంది అన్నల ప్రవర్తన మంచిదికాదు, కాబట్టి సేవకూడ మంచిదికాదు.* ***యోసేపు ప్రవర్తన మంచిది గనుక సేవకూడ మంచిదిగా నుండెను.*** దేవుడే యోసేపును అన్నల దగ్గరకు, గోతిలోనికి, వర్తకులయొద్దకు, ఐగుప్తుకు, పోతీఫరుయొద్దకు, జైలుయొద్దకు, సింహాసనము నొద్దకు నడిపించెను. దేవుడు మనలను ఒక క్రొత్త గ్రామములో, పరజనుల మధ్య పనిచేయుమని అప్పగించిన యెడల, యోసేపువలె నమ్మకముగా ఉండి పనిచేయవలెను. ***ఉదా:*** *వజ్రమును పెంటలోవేసిన లేదా పేడలో వేసిన ఇత్తడిగా మారదు. వజ్రము వజ్రమువలెనే యుండును.* ఆలాగే యోసేపు ఇంటిదగ్గర హేళనలో యున్నప్పటికిని, యోసేపుగానే యున్నాడు. గోతిలో నున్నప్పటికిని యోసేపుగానే యున్నాడు. ఐగుప్తు బజారులో నున్నప్పటికిని యోసేపుగానే యున్నాడు. ఖైదులో నున్నప్పటికిని యోసేపుగానే యున్నాడు. ***ఎన్ని శోధనలలోనున్నను యోసేపుగానే యున్నాడు. వజ్రము మారదు.*** ఆలాగే యోసేపు మారలేదు. ***యోసేపువంటి గొప్ప దృష్టాంతము బైబిలులో ఎక్కడను లేదు.*** యోసేపు ప్రవర్తనలోను, సేవలోను మాదిరి చూపించెను.

IV) **ఒక స్త్రీకి పురుషుని అప్పగించిన కథ:** ఆ స్త్రీ ఉన్నది పారశీకదేశము. అది అన్య దేశము. ఆమె యూదురాలు, భక్తిగల స్త్రీ. ఆ కాలములో యూదులందరికి గొప్ప అపాయము వచ్చినది. అదేదనగా, యూదులైనవారు ఎక్కడున్నా వారందరిని చంపవలెనని రాజాజ్ఞ బయలుదేరెను. ఆమె రాజుయొక్క బంగళాలోనున్నది. దేవుడామెను అక్కడ ఎందుకు ఉంచెను? ఆమెను దేవుడెందుకు అక్కడకు పంపించెను? *ఆమె జనాంగమునకు వచ్చిన గొప్ప ఆపదను తప్పించుటకు.* దేవుడామె చేతికి రాజును అప్పగించెను. ఒక దినమున ఆమె రాజుగారి సముఖమునకు వెళ్ళగా, 'ఎందుకు వచ్చితివని' రాజు అడిగెను. ఆ స్త్రీయైన రాణి– 'మా స్వజనులను చంపివేయుటకు ఎందుకు మీరు ఆజ్ఞ ఇచ్చితిరని' అడిగెను. 'అది మంత్రిచేసిన పని: నేను వ్రాలుచేసిన దానిని మార్చలేను గనుక మరియొక చట్టమును చేయుదునని చెప్పి' మరియొక చట్టము వ్రాసి, యూదుల విరోధులనందరిని చంపవలెనని వ్రాయించి, వ్రాలుచేసి రాణికప్పగించెను. ఈరీతిగా యూదులను రక్షించినది ఎస్తేరురాణి. అన్యరాజైన పారశీకరాజు, యూదురాలి పక్షమాయెను. యూదుల పక్షమైనాడు గనుక ఆ రాజు దేవుని పక్షమైనాడు. అబ్రాహాము యొక్క ప్రవర్తన, సేవ బాగున్నది; యోసేపు యొక్క ప్రవర్తన, సేవ బాగున్నది; ఆలాగే ఎస్తేరురాణి యొక్క ప్రవర్తన, సేవ బాగున్నది.

Bible Mission HQ Guntur

V) **ఏర్పాటు జనాంగమైన ఇశ్రాయేలీయులు:** కనానీయులు, హిత్తీయులు, అమోరీయులు, హివ్వీయులు, పెరిజ్జీయులు, యెబూసీయులు, గిర్గాషీయులు- ఈ 7 జనాంగములను దేవుడు యూదులకు అప్పగించెను. వారికి యెహోవా మతము నేర్పవలెను. వారికి దేవుని సంగతులు చెప్పవలెను. మరియు మోషే ధర్మశాస్త్రమును వారికి బోధింపవలెను. అయితే *మీరు వారితో కలిసియుండరాదు, వారితో వివాహములు చేసికొనరాదని* చెప్పెను. మరియు ఆ ప్రదేశమునుండి వారిని తోలివేయవలెననికూడ చెప్పెను. అయితే 10 మంది సోదరులు ఏలాగు నమ్మకముగా పనిచేయలేదో, ఆలాగే యూదులుకూడ నమ్మకముగా పని చేయలేదు. ప్రభువు మనలను నమ్మి, 'సర్వ రాష్ట్రములకు సువార్త చెప్పి, శిష్యులనుగా చేయండి' అని ప్రభువు మనకు పని అప్పగించియున్నారు. దేవుడు అబ్రాహాము సంతతికి అన్యజనులను అప్పగించి, 'మీ ఇష్టమొచ్చినట్లు చేయండి' అనెను (నెహెమ్యా 9:24). ***ఆలాగే దేవుడు మనకు గ్రామములను, సంఘములను మొదలగువాటిని అప్పగించినాడు.*** గనుక మనము నమ్మకముగా పనిచేసి, భళా నమ్మకమైన సేవకుడా! అను మెప్పు పొందవలెను. యూదులు దేవుడప్పగించిన పనిని నమ్మకముగా చేయలేదు గనుక (నెహెమ్యా 9:30) దేవుడు వారిని అన్యజనుల చేతికి అప్పగించెను. మనమును దేవుని పని నమ్మకముగా చేయనియెడల ఇతరుల చేతిలో పడుదుము. కనుకనే పౌలు '*మనుష్యులందరి కొరకు, ముఖ్యముగా రాజులందరి కొరకు ప్రార్థన చేయవలెనని*' వ్రాసెను. అప్పుడు సంఘము క్షేమముగా నుండును. మన ప్రవర్తన బాగున్నదా? దేవునికి ఇష్టమైనదా? మన సేవ బాగున్నదా? దేవుని కిష్టమైనదా? నీ కప్పగింపబడిన పని నమ్మకముగా చేయుచున్నావా?

## నమ్మకమైన సేవ - 3

'అతడు (అబ్రాహాము) నమ్మకమైన మనస్సుగలవాడని (దేవుడు) ఎరిగి (నెహె. 9:7,8). అబ్రాహాము బహు నమ్మకస్థుడై యుండెను. మానవుని హృదయములోనున్న ఒక్కొక్క మంచి లక్షణము దేవుని దగ్గర బహుమానము సంపాదించును. మానవునిలోని ఒక్కొక్క మంచి శక్తికి, ఒక్కొక్క మంచి ఫలితము దొరుకును. ఒకనికి కాళ్ళలో ఎక్కువ సత్తువ గనుక ఎంత దూరమైనను నడువగలడు. ఒకరికి వృక్షములు పెంచుటయందు ఆశ, మరియొకరికి తోటను పెంచుటయందు ఆశ. ***వారి పనులనుబట్టి సమయము వచ్చినప్పుడు, వారిలోని లక్షణములు బయలుపడును.*** కొందరు, తమ అధికారి దూరములోనున్నను పని నమ్మకముగాచేసి అప్పగించుదురు. *అబ్రాహాములోనున్న మంచి గుణము నమ్మకము.* అందుచేత దేవుడతనికి భూదానము చేసెను. అబ్రాహాము తనలోనున్న స్వభావమును తన స్వజనులకు బోధించుటలన వారిని నమ్మకస్థులనుగా చేసెను. యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగములో '*సాత్వికులు ధన్యులు, వారు భూలోకమును స్వతంత్రించుకొందురు*' అని బోధించెను. అది అబ్రాహాము విషయములో చూచుచున్నాము గాని వెయ్యేండ్ల పరిపాలనలో పూర్తిగా చూచెదము. పిల్లలు నమ్మకముగా యుండునట్లు మనము తర్ఫీదు చేసిన యెడల వారికట్టి స్వభావము కలుగును. అప్పుడు వారు భూదానము పొందుదురు. ప్రభువు తన శిష్యులకు భూగోళమంతయు

అప్పగించెను. (మార్కు 16:15) 'మీరు సర్వ లోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి'. సువార్తను నమ్మకముగా మనము ప్రకటించవలెను. లోకమంతయు మనది, అనగా వెయ్యేండ్ల పాలనలో పూర్తిగా మనదగును.

నమ్మకమనునది గొప్ప లక్షణము. దేవుడు మనలను నమ్మబట్టి, భూబంతిని మనచేతికి అప్పగించి వెళ్ళిపోయెను. పాడుచేసినను, బాగుచేసినను భూగోళమును దేవుడు సంఘమునకు అప్పగించెను. అది సంఘము యొక్క పని. ***దేవుడు మనలను నమ్ముచున్నాడు గనుక మనమును ఆయనకు నమ్మకముగా నుండవలెను.*** ఉపాధ్యాయుడు తనపనిని నమ్మకముగా చేసినయెడల పిల్లలు పరీక్షలో కృతార్థులగుదురు. సంఘకాపరి నమ్మకముగా పనిచేసి, సంఘమును సరిగా నడిపించిన యెడల దేవుడు బహుమానమిచ్చును. *తల్లిదండ్రులు తమ పిల్లలను నమ్మకముగా పెంచవలెను.* నెహెమ్యా 9:8లో ఇశ్రాయేలీయులు తమ పితరుడైన అబ్రాహామును తలంచుకొని, ఆయన నమ్మకస్థుడు గనుక ఈ దేశము మాకు లభించినదని దేవునిని స్తుతించిరి. ***ఉదా:*** మనము కమ్మర దుకాణమునకు వెళ్ళిన యెడల, ప్రతి ఇనుపముక్క అది వంకరదైనను వాటిని కమ్మరి సరిచేయును. *ఆలాగే పిల్లలు తల్లిదండ్రుల చేతిలోని బాణములవంటివారు గనుక పిల్లలను వారు ఎటువంచిన అటు వంగుదురు.* గనుక తల్లిదండ్రులు పిల్లలను బాల్యమునుండి సరిగా తయారు చేయవలెను. బిడ్డలను ఆరోగ్య పద్ధతిలోను, దైవభక్తిలోను పెంచు విషయములో వారు దేవునికి నమ్మకస్థులై యుండవలెను. *ఒక సువార్తికుడు మిక్కిలి కఠినమైన ప్రదేశములో* నమ్మకముగా సేవచేసి, చివరకు గొప్ప ఫలితము పొందెను (ఇది ఒకచోట జరిగెను). మోషేను దేవుడు ఫరో కుమార్తెకు అప్పగించెను. ఆ స్త్రీ, దేవునికి నమ్మకస్థురాలై ఆయనను పెంచి పెద్దవానిగా చేసెను. గనుకనే మోషే నమ్మకముగానే జీవించెను. ఐగుప్తుయొక్క సకల విద్యలు మోషే నేర్చుకొనెను. పిల్లలను నమ్మకముగా పెంచిన యెడల అందువలన కలిగిన బహుమానమును, మేలును తల్లిదండ్రులు పొందుదురు. అప్పుడు ప్రభువును స్తుతించెదరు. ఇశ్రాయేలీయులు అబ్రాహామును తలంచుకొని దేవుని స్తుతించిరి. భూమిమీద ఒక పాపి మారుమనస్సు పొందిన యెడల, పరలోకములో సంతోషము కలుగును. ఈ లోకములోకూడ సంతోషము కలుగును. ***ప్రభువు మనలను ఏ స్థితిలోనికి తీసికొని వచ్చిన, ఆ స్థితిలో నమ్మకముగా నుండవలెను. మనలో ప్రతివారికి దేవుడు ఒక స్థితి ఇచ్చియున్నాడు. ఆ స్థితిలో మనము నమ్మకముగా నుండవలెను.*** దేవుడు మనకు సూది బెజ్జమంత చిన్నపని ఇచ్చినను, నమ్మకముగా చేసిన యెడల, దేవుడు అట్టివారికి ఇంకా గొప్పపని అప్పగించును. *గనుక ప్రతిపనిలో, ప్రతి విషయములో, నమ్మకస్థులైయుండుట మహా గొప్ప విషయము.*

## నమ్మకమైన సేవ-4

*ప్రార్థన:* ఓ దేవా! నీ వాక్యము ఇచ్చినందుకును, నేర్పించినందుకును, నెరవేర్చు చున్నందుకును, నీ వాక్యములోనుండి మాట్లాడుచున్నందుకును నీకనేకమైన వందనములు. ఓ తండ్రీ, నీవు ప్రతి ఆదివారమును నీ వాక్యము వినిపించుచున్నావు గనుక స్తోత్రము. నీ ***వాక్యము ఆకాశముకంటెను, భూమికంటెను, దేవదూతలకంటెను, మానవులకంటెను గొప్పది.***

ఇంత గొప్ప వాక్యమును మేము చదువుటకును, నేర్చుకొనుటకును, అనుసరించుటకును మాకిచ్చినావు గాన నీకనేక స్తోత్రములు. నీ వాక్యము వలన పాపస్థితిలో నున్నవారు, పరిశుద్ధ స్థితికి రాగల వర్తమానము దయచేయుము. వ్యాధిగ్రస్థులకు స్వస్థత కలిగించు వర్తమానము; సువార్త చేయలేనివారికి సువార్తచేయు శక్తిగల వర్తమానము; ఇదివరలో ఈ సంగతి విన్నవారికి, వారి అనుభవములోనికి రాగల వర్తమానము; క్రొత్త వారికి క్రొత్త వర్తమానము; ప్రార్థన వాలులేని వారికి ప్రార్థన వాలు కలిగించు వర్తమానము ఇచ్చి దీవించుము. ఇది త్వరగా రానైయున్న శ్రీ యేసు ద్వారా అంగీకరించుము. ఆమేన్.

మనము నమ్మకస్థులమై యుండవలెను. ఎందుకనగా దేవుడు మనలను నమ్మి ఒకపని అప్పగించినాడు. ఇది మిషను పనివారికి మాత్రమేకాదు. అందరకు, అనగా ప్రతివారికిని. ***ప్రతివారికి దేవుడు ఒకపని అప్పగించినాడు.*** దేవుడు ఒకరికి ఒక ఉపకారము చేసిన యెడల, ఆ ఉపకారము పొందినవారికి ఒక పనియున్నది. మనము ఎందుకు పని చేయవలెననగా, 1) ఉపకారము పొందియున్నాము, 2) రక్షణ పొందియున్నాము, 3) వాక్యము నేర్చుకొనుచున్నాము. గనుక దేవుడు మనకందరికిని పని అప్పగించియున్నాడు. సువార్తపనివారికి మాత్రమేకాదు, సంఘములోనున్న అందరకును దేవుడు పని అప్పగించినాడు. ఆయన మనలను నమ్మి ఆ పని అప్పగించినాడు. గనుక మనము నమ్మకముగా నుండవలెను. ఇది ఋజువు పర్చుటకు బైబిలులోనున్న వాక్యములు ఎత్తి చెప్పుచున్నాను. 1) నెహెమ్యా 9:8లో దేవుడు ఆరు జనాంగములను యూదులకు అప్పగించియున్నాడు. 2) యేసుప్రభువు సంఘమునకు ఒక పని అప్పగించియున్నాడు. 'మీరు వెళ్ళి సమస్త రాష్ట్రములకు సువార్త చెప్పవలెననే' పని అప్పగించెను. ముందు 11మందికి సువార్త అప్పగించెను. వారు అంత్య దినమువరకు ఉన్న సంఘమునకు పెద్దలై యున్నారు. 3) కార్యములు 2:9-11. పెంతెకొస్తునాడు దేవుడు 16 జనాంగముల వారిని, యెరూషలేము తీసికొని వచ్చియున్నాడు. ఈ 16 జనాంగములవారు క్రొత్తగా బాప్తిస్మము పొందినవారు. వీరిని అపోస్తులులకు అప్పగించియున్నాడు. ఆ పది దినములకు ముందు, యేసుప్రభువు శిష్యులతో, మీరు వెళ్ళి సమస్త రాష్ట్రములకు సువార్త చెప్పండి అని చెప్పెను. ఇప్పుడు సమస్త రాష్ట్రములను తీసికొనివచ్చి, ప్రభువే వారికి అప్పగించియున్నాడు. ***ఇప్పుడును అంతే. దేవుడు మనకు పని అప్పగించి, ముందుగా ఆయనే పనిచేయును.*** ఈ 16 రాష్ట్రములవారే ఈ లోకములోనున్న వారందరి ప్రతినిధులు. వీరిని యేసుప్రభువు తీసికొనివచ్చి అపోస్తులులకు అప్పగించినాడు. అందరు భాషలతో మాట్లాడినారు. అయితే, వీరిలో ముఖ్యుడు పేతురు. పేతురు యేసు ప్రభువు విషయమై అంతా వరుసగా చెప్పినాడు. విన్నవారి హృదయములు గ్రుచ్చుకొనేటట్లు వాక్యము ఉపదేశించెను. సువార్తికులుకూడ ఆదరణకరమైన వర్తమానము, జ్ఞానోదయ వర్తమానము, హృదయములకు గ్రుచ్చుకొనే వర్తమానము దయచేయుమని ప్రార్థించవలెను. శిష్యులు- యేసు ప్రభువే ప్రభువు, ఆయనే రక్షకుడు, ఆయనే దేవుడు అని నమ్మినారు. గనుక ఆయా దేశములవారిని ప్రభువే తీసికొనివచ్చి శిష్యులకు అప్పగించెను. వారిని పేతురు సంఘములోనికి తీసికొనివచ్చినట్లుగా

కార్యముల గ్రంథములోనున్నది. గాని ప్రభువే వారిని సంఘములోనికి తీసికొని వచ్చెను. దేవుడే పేతురునకు, సర్వరాష్ట్రముల వారికి సువార్త చెప్పగల శక్తి ఇచ్చినాడు. ఆ శక్తిని పేతురు నమ్మకముగా వాడెను. కొందరు పనివారు గ్రామాదులలో పనిచేయుచున్నారు. గాని ఎవ్వరును మారడములేదు. పేతురువలె నమ్మకముగా పనిచేసిన యెడలను, వర్తమానము చెప్పిన యెడలను ప్రభువే వారికి సహాయము చేయును. అప్పుడు ప్రజలు మారుమనస్సు పొందుదురు. ఎప్పుడు మారుమనస్సు పొందుదురు? ఇప్పుడు కొందరు; రాకడప్పుడు కొందరు; ఏడేండ్ల పరిపాలన కాలములో కొందరు; వెయ్యేండ్ల కాలములో కొందరు; సజీవుల తీర్పు సమయమున కొందరు; అంత్యతీర్పు సమయమున కొందరును మారుమనస్సు పొందుదురు. సంఘకాల ప్రారంభమునుండి, అంత్యతీర్పు సమయమునకు సర్వరాష్ట్రములకు సువార్త వినబడితీరును.

1. 'సర్వ రాష్ట్రములకు' అను ప్రవచనము యేసు ప్రభువు కాలములో ఇవ్వబడెను.

2. 'సర్వరాష్ట్రములకు సువార్త' పేతురుద్వారా పెంతెకొస్తునాడు అందెను. 3. 'సర్వరాష్ట్రములకు సూచన' 7ఏండ్ల పరిపాలన. 4. 'సర్వరాష్ట్రములకు వృత్తాంతము' వెయ్యేండ్లకాలములో. ఆది సంఘము మొదలు, ఈ మనకాలము నుండి, అక్కడనుండి వెయ్యేండ్ల కాలము వరకు, దేవుడు సంఘమునకు పని అప్పగించినాడు. 1. ప్రవచనము 2. సిద్ధపర్చుట 3. సూచన 4. వృత్తాంతము.

సర్వలోక రక్షణార్థమ్ ఈ వార్త-చాటించుట ప్రధానమ్ = సర్వలోక రక్షణార్థమ్ - చాటించుట ప్రధానమ్ - సర్వదేవ సన్నిధానమ్ - సర్వలోక కాలమానమ్ - క్రిస్మస్ జయ్‌జయ్.

॥దేవలోక॥

# నమ్మకమైన సేవ - 5

1. పేతురును యూదులు యెరూషలేములో ఖైదులోనుంచిరి (కార్య. 12:1-10). చేతులకు సంకెళ్ళను, కాళ్ళకు బొండను వేసినారు. ఖైదుకు తాళము వేయబడియున్నది. సంఘములోనివారు ఆయనను విడిపించలేక పోయినారు. గ్రామస్థులందరు నిద్రపోవు చున్నారు. ఖైదులో పేతురుకూడ నిద్రపోవుచుండెను. *గాని గ్రామ సంఘము మాత్రము నిద్రపోకుండ ప్రార్థించుచున్నది.* పేతురునకు ప్రకటించు పని ఉన్నది. ఇప్పుడు సంఘమునకు, పేతురు విడుదల కొరకు ప్రార్థించు పని ఉన్నది. వారు క్రొత్తగా సంఘములో చేరిరి, వారికి గుడిలేదు. అయితే వారు తీవ్రముగా ప్రార్థించిరి. *ఈ ప్రార్థన* పరలోకమునకు వెళ్ళవలెను. చెరసాల తలుపులు విప్పబడవలెను. సంకెళ్ళు ఊడవలెను. ఈ సంగతి ఆ కాలము వారికి తెలియబడవలెను. అందరకు తెలియవలెను. అట్లు సంఘస్థులు ప్రార్థించు చుండగా వారి ప్రార్థన పరలోకమునకు వెళ్ళినది. దేవుడు వారి ప్రార్థన విన్నాడు. దేవుడు దేవదూతను పంపగా ఆయన పేతురును తీసికొనివచ్చి పట్టణములో విడిచిపెట్టిరి. అప్పుడు పేతురునకు మెళకువ వచ్చినది. వారి ప్రార్థనవలన చెరసాల తలుపులు తెరువబడెను, సంకెళ్ళు ఊడెను, పేతురు విడిపింపబడెను. అప్పుడు పేతురు, వారు ప్రార్థన చేయుచున్న గది దగ్గరకు వచ్చి తలుపు తట్టినాడు. సంఘము నమ్మకమైన పని చేసినది అనగా ప్రార్థనపని. అయితే, ఆ సంఘమునకు విశ్వాసము తక్కువ. ఎందుకనగా ప్రార్థనలోని ఒక అమ్మాయి, తలుపు దగ్గరకు వెళ్ళి పేతురు చేయు చప్పుడు విని, పేతురు వచ్చియున్నాడని

చెప్పినప్పుడు వారు నమ్మలేదు. పేతురు వచ్చినాడను సంగతి సంఘస్థులు నమ్మలేదు. ఆయన వస్తాడని సంఘమునకు తెలియదుగాని 'పేతురును పంపించుము, విడిపించుము. లేకపోయిన స్తెఫనును చంపినట్టు చంపివేస్తారు ప్రభువా!' అని తీవ్రమైన ప్రార్థన చేసినారు. వారు మనవులుచేసి, ప్రార్థన పెట్టుకొన్నారు. ప్రియులారా! ఎవరి విషయమైనను తీవ్రమైన పట్టుదలతో ప్రార్థించిన యెడల, తప్పక జరుగును. ***ఎటువంటి ప్రార్థనయైనను పట్టుదల, తీవ్రమైన ఏకీభావము కలిగిన ప్రార్థన చేయవలెను.***

2. యూదా ఇస్కరియోతును నమ్మి, ప్రభువు సొమ్ము సంచిని ఇచ్చియున్నాడు. ఉదా: పిల్లి మెడకు రొయ్యలమూట కట్టినట్లున్నదని కొందరు అనుచున్నారు. యోహాను 12:4-6. పన్నెండుమంది శిష్యులలో ఇతడు ఖజానాధికారి. అతడు దొంగిలించువాడని తెలిసికూడ, దేవుడతనికి ఎందుకు డబ్బుసంచి అప్పగించవలెనని అనేకులు అభ్యంతర పడుచున్నారు. దేవుడతనికి పని అప్పగించియున్నాడు. ***దొంగ మారుటకు క్రీస్తుప్రభువు సన్నిధికన్నా వేరొక స్థలము గలదా!*** అతడు బాగుపడుటకు ఇంతకన్నా వీలైన స్థలము వేరొకటి గలదా! గనుక ప్రభువు అతనిని తీసికొనివచ్చి తన సన్నిధిని చేర్చుకొన్నాడు. ప్రభువు, అతనికి 3 1/2సం॥లు గడువిచ్చినను మారలేదు. ప్రభువు సన్నిధిస్థలములోనైనను యూదా మారలేదు. ప్రభువిచ్చిన గడువు కాలములోనూ మారలేదు. ప్రభువు తన అధికమైన ప్రేమచేత, తన్ను నమ్మి డబ్బు సంచి ఇచ్చినందుకు (పేతురునకు ఇవ్వవలసినది), యూదా ఇంకా ఎక్కువ నమ్మకముగా నుండవలసినది. చివరి రాత్రి ప్రభు భోజనము దగ్గర రొట్టె ఇచ్చి, చివరి గడువు ప్రభువతనికి ఇచ్చియున్నారు. అప్పుడైనను యూదా మారలేదు. ప్రభువు సన్నిధిలో, ఆయన గడువు కాలములో, చివరి కాలములోనైనను యూదా మారలేదు. గనుక 'యూదా! నీవు చేయవలసినది త్వరగా చేయుమని' ప్రభువు చెప్పెను. ***యూదా విషయమై ప్రభువు ప్రార్థించలేదా?*** ప్రార్థించెను. అయినను, తనకప్పగించిన పని నమ్మకముగా చేయకుండా తన మీదికి ముప్పు తెచ్చుకొన్నాడు, ఇస్కరియోతు యూదా. చివరకు, దేవుని సన్నిధినుండి వెళ్ళిపోయినాడు. నేడును అనేకమంది బోధకులు, క్రైస్తవులు యూదావలె చేయుచున్నారు.

3. యెహోవా దేవుడు కయీనుతో, నెమ్మదిగా దయగలిగి మాట్లాడినాడు (ఆది 3:9). నీ తమ్ముడెక్కడ అని అడిగినాడు. నా తమ్మునికి నేను కావలివాడనా? అని కయీను కరుకుగా జవాబిచ్చెను. ***తాను కానుక ఇచ్చియున్నాడు గాని, తనను కానుకగా ఇచ్చుకొనలేదు.*** 1) తండ్రి కాలములో యెహోవా దేవుడు కయీనుకు గడువు ఇవ్వగా, అతడు కరుకుగా మాట్లాడి దేవుని సన్నిధిలోనుండి వెళ్ళిపోయినాడు. 2) యేసు ప్రభువు కాలములో యూదా ఇస్కరియోతు దేవుని సన్నిధిలో నుండి వెళ్ళిపోయినాడు. 3) పరిశుద్ధాత్మ కాలములో అననీయ సప్పీరాలు, పరిశుద్ధాత్మ సన్నిధిలోనుండి వెళ్ళిపోయినారు. ***అనేకులు సువార్త పనిచేయుచున్నారు గాని తమ హృదయమును దేవునికిచ్చుట లేదు.*** నా కుమారుడా! నీ హృదయము నాకిమ్మని ప్రభువు అడుగుచున్నారు. మూడు కానుకలు: హృదయ కానుక, సరుకు, సొమ్ముకానుక. మూడు పనులు: ప్రార్థనపని, సువార్త పని, కానుకలపని. ఈ మూడు పనులు దేవుడు మనలను

నమ్మి, మనకు అప్పగించియున్నాడు. స్ముర్నసంఘముతో ప్రభువు– ప్రాణాపాయము వచ్చినను, నమ్మకముగా నుండుమని చెప్పెను (ప్రకటన 2:10). అపాయములు ఎన్ని రకములు? పోషణ, అన్న వస్త్రాదులకు ఇబ్బంది, వ్యాధి, నింద, శత్రువులు, ప్రాణాపాయము మొదలైనవి. పోషణ విషయములో నమ్మకము కలిగి ఉండుము. వ్యాధుల విషయము ప్రార్థించుము. శత్రువుల విషయము ప్రార్థించుము. ప్రాణాపాయము వచ్చినను నమ్మకముగా నుండుము. రాళ్ళు తీసికొని స్తెఫనును కొట్టినప్పుడు, అతడు మోకరించి ప్రార్థన చేసెను. ప్రాణాపాయము వచ్చినదని తెలిసి ప్రార్థించెను. ***రెండు అనుభవములు: సిలువ మ్రానుమీది అనుభవము. ప్రాణాపాయములో నమ్మకమైన అనుభవము.*** గనుకనే జీవ కిరీటము దొరికినది. శ్రమలో సహించే ఉద్యోగము, దేవుడు స్తెఫనుకు ఇచ్చియున్నాడు. స్తెఫనుకు పరలోకము, దేవుని కుమారుడు, జీవకిరీటము, దేవదూతలు కనబడిరి. మనకు ఇబ్బంది, *వ్యాధి, నింద, శత్రువులు,* ప్రాణాపాయము ఉన్నను పనిపాటలలో నమ్మకముగా నుండవలెను.

## శ్రమజీవి ప్రసంగము

I పేతురు 4:12; యాకోబు 1:12; ఆది.కాం. 6:5; I కొరింథీ 10:13; మలాకీ 3:10; II కొరింథీ 12:7.

యెరూషలేము మందిరముయొక్క వెలుపల యేసు ప్రభువు సిలువ నెత్తుకొని యున్నారు. తనప్రజల మీద కూడ వారు (యూదులు) సిలువ నెత్తి యున్నారు. ఆలాగే ఆయన కాడికూడ ఎత్తుకున్నారు. ప్రజలమీద కూడ దానిని ఎత్తియున్నారు. ఆయన సిలువధారియై యున్నారు. ఆయనను వెంబడించువారును సిలువధారులై యున్నారు. నా కాడి సుళువు, నా భారము తేలికగా యున్నది అని ఆయన చెప్పినారు. అది సుళువు కాదు గాని ప్రభువు చెప్పినారు గనుక సుళువు. అది భారమే గాని ప్రభువు చెప్పినారు గనుక భారము లేదు. ప్రతి మనిషి మీద ఒక కాడి యున్నది. ఎడ్లకు కూడ కాడి యుండును. ఆ కాడి 2 భాగములు. ఒక ప్రక్క ఒక కర్ర, రెండవ ప్రక్క రెండవ కర్ర. రెండును కలిపి లాగితే సుళువు. *ఈ శ్రమ, కష్టము, ఒంటరిగా సహింపవలెనంటే సహింపలేము గాని మనతోపాటు ఆయనకూడ మన కష్టములను వహిస్తున్నాడు, మరియు మనమిద్దరము కలిసి సహిస్తున్నాము గనుక ఆ కాడి భారము కాదు.* మనతోపాటు ప్రభువు కూడ సహిస్తున్నారు, సహాయము చేస్తున్నారు గనుక దీనిని సుళువుగానే గ్రహింపవచ్చును. ***ఇది మహా ముఖ్యమైన బోధ.*** కనుక ఇది కేవలము నేర్చుకొనుటకు కాదు గాని నేర్చుకొని అవలంభించుట కొరకే. అనగా అభ్యాసములో చూపించవలెను. అప్పుడుగాని ఆయన నేర్పిన విద్యకు, పడిన ప్రయాసకు ఫలితం దొరకదు *ట్రైనింగ్ ఇచ్చి అక్కడే ఉంచరు గాని అనేక స్థలములకు పంపుదురు, నేర్చుకున్నది అవలంభించవలెనని చెప్పుదురు.*

**1. కాడి:** ప్రభువు మోపిన కాడి

**2. సిలువ:** కష్టాలన్నీ కలిపి ఒక సిలువ అయినది.

**3. ముల్లు:** పౌలు ప్రార్థించితే తీసివేస్తానని ప్రభువు చెప్పలేదు గాని 'నా కృప యుంచినాను, అది నీకు సరిపోయినది. సహించేశక్తి నీకను గ్రహించినానని' చెప్పిరి. కష్టములను, సహించేశక్తిని కూడ ఆయనే ఇచ్చును.

**4 శోధన:-** మీకు శోధనలు కలుగునుగాని సహించలేనంత శోధన రానియ్యను. శోధనలు, కష్టములు సహించుకునే సాధనములుకూడ ఏర్పరతును అని ప్రభువు చెప్పెను.

**5. శ్రమ:-** అగ్నివంటి శ్రమ అని పేతురు పత్రికలో ఉన్నది. అందుకు ఆశ్చర్యపడకుడి. అగ్నివంటి శ్రమల వలననైనను మీకు బాధ కలుగదు. అది మీకు సహనము నేర్పించుట కొరకే. **ఉదా:** గ్రామములోని పంతులుగారు కుర్రవానిని 4 దెబ్బలు కొడితే ఎదిరించును. అప్పుడు మరిన్ని దెబ్బలుకొట్టి, గోడకుర్చీ వేయించి, బెంచిమీద, వరండామీద నిలువబెట్టును. ***ఎదిరించినాడు గనుక మరింత శిక్షించి, సహించేటందుకు నేర్పించినాడు.***

ప్రధమ ఉపాధ్యాయుడు మాదిరి పాఠము చూపించినాడు. ప్రభువును అలాగే చూపించినారు. సిలువనెత్తి కొన్నారు, అంటగొట్టబడినారు, సిలువలో హతమై పోయినారు, భూస్థాపనైనారు గనుక ***'మీరుకూడా ఈలాగు మారండి'*** అని మాదిరి పాఠము చూపించినారు. ఆయన సిలువ మీద నున్నప్పుడును, బల్లెముతో పొడిచినపుడును, చంపినపుడును విసుగుకొనలేదు. ఆయన సహించిన దానికంటె ఎక్కువైన శ్రమ మనకు వచ్చునా? రాదు. స్వల్పమైన శ్రమ, ఇసుక రేణువంత శ్రమే మనకు ఉన్నది. అదే మనము సహించలేము. **ఉదా:** ఎదిరించేవారిని చూచి, ఇన్స్పెక్టర్‌గారు సస్పెండ్‌చేసి పంపినారు. అప్పుడాయన వారిని చూచి 'మీరు పనిచేయలేరు, పోయి మొదటి తరగతిలో నేర్చుకోండి' అనును. ఆలాగే ప్రభువుకూడ సహించలేని వారిని ఎక్కడో ఒక చోట కూర్చుండబెట్టును.

1. ప్రభువు సహనమును గూర్చి చెప్పినారు, 2. ప్రభువు విసుగుకొనలేదు

3. ఆయన నిన్ను, నన్ను పిలిచేటప్పుడును, రక్షించేటప్పుడును ఎన్ని పర్యాయములు ఆయనమీద విసుగుకున్నామో. మూలపాఠము:- ***మనము విసుగుకొనేటప్పుడు, ఆయన విసుకు కొనలేదు గనుక మనమును విసుగుకొనకూడదు అని జ్ఞాపకమునకు తెచ్చుకొనవలెను.***

4. మనము సహించ గలిగేటంత గొప్ప శ్రమే మనకు వస్తుందిగాని దానిని మించి రాదు. దేనిని చూచికూడ అనగా సిలువ, కాడి, ముల్లు, శోధన, శ్రమలను చూసి విసుగు కొనకూడదు.

5. శ్రమకాడి మనమీద, అనగా మన భుజములమీద ఉండి మోస్తున్నపుడు, ప్రభువు మనతోకూడ ఉండి మోస్తున్నారు గనుక విసుగు పడకూడదు.

6. మనము సిలువ మోసినందుకుగాను, ఆయన భూలోకములోనే ఒక గొప్ప బహుమానము అనుగ్రహించనై యున్నారు. **ఉదా:** రైతు చెప్పిన పని కూలీ చేసినాడు. ఆలాగు చెప్పినట్లు చేస్తే, బహుమానము ఇచ్చును. ఆలాగే ప్రభువు భూలోకములోనే మనకు బహుమానము ఇవ్వదలంచినారు గనుక ఆ బహుమానమును చూచి మనము ఆనందించవలెను.

**అప్పుడు శ్రమ, శ్రమగా ఉండదు.** ఆనందము వలన ఆ శ్రమను బట్టి కలుగు బహుమానములు అధికమగును. ఎన్ని? ఒకటికాదు, రెండు కాదు. మనము అనుభవించే శ్రమలెన్నో, మనము పొందే బహుమానములు అన్నే. ఎన్ని రోజులు కష్టపడితే అన్ని రోజులు కూలి వచ్చును గదా! కాబట్టి శ్రమలు వచ్చినప్పుడు బుసబుస మంటున్నవారలారా! రుసరుసమంటున్న వారలారా! ఆలాగనకండి (ఇప్పటికి ఎన్ని మాటలు చెప్పినట్టు? 6 మాటలు).

7. ఎవరైతే శోధన సహించగలరో వారికి జీవ కిరీటము, అనగా పరలోకపు బహుమానము దొరుకును. వారు పరలోకములో రాజులై యుంటారు. సింహాసనములమీద ఉంటారు.

1) శ్రమ మాకక్కర లేదంటే, మోక్షము మాకు అక్కరలేదన్న మాటే.

2) శ్రమ మాకక్కరలేదని ఎవరంటారో, వారికి మహిమ సింహాసనము అక్కరలేదు.

3) శ్రమలు అక్కరలేదంటే, వారికి కిరీటము అక్కర లేదన్నమాట.

4) దేవునియొక్క అనంత సహవాస భాగ్యము అక్కర లేదన్నమాట. **దేవదూతలు దేవుని పరలోకము మధ్య ఉన్నట్లు, మనము శ్రమల మధ్య ఉండవలెను.**

(1) భూలోక బహుమానములు ఏవి? శ్రమ సమయములో ఒక బహుమానము కావలెను. అదేదనగా సహింపు. అప్పుడు శ్రమచూచి హడలిపోయినాము గదా? అయితే ఆయన శక్తి అనుగ్రహించినారు గనుక ఇప్పుడు శ్రమ అంటే లెక్కలేదు. శ్రమకాలమందు అరటి పండ్లు, టెంకాయలు అవసరమా? శ్రమ అనుభవించే స్థితి అవసరము.

(2) బహుమానము:- శ్రమపడే సమయమందు దేవుని వలన శక్తి పొందుచున్నాము. 'సహోదరులు శత్రువుల మధ్య ఉన్నారు, వారు ఒంటరిగానే ఉన్నారు. గాని దేవుడు మాకు సహాయకారిగా ఉన్నాడని' వారి నిమిత్తమును ప్రార్థించవలెను. ఏమని? ప్రభువా! మాకు శక్తి ఇస్తున్నమాట సత్యమే. మా సహోదరులు, శత్రువుల చేతిలో శ్రమపడుచున్నారు. గనుక వారికికూడా శక్తి దయచేయుము. **మన శ్రమలలో మనకు ప్రభువే మాదిరి.** సిలువలో ఆయన చుట్టు రెండు గుంపులవారున్నారు. స్నేహితులు, శత్రువులున్నారు. ఆయన వారి నిమిత్తమై ప్రార్థించినారు. శ్రమ వచ్చినపుడు, కండ్లు పైకెత్తి దూరమున ఉన్న వారి నిమిత్తమై ప్రార్థించవలెను.

(3) యోబు నేర్పిన మాట:- ఎన్ని శ్రమలో అన్ని దానములు. శ్రమలమధ్య యోబు చదివిన పద్యము "యెహోవా ఇచ్చెను యెహోవా తీసికొనెను, ఆయనకే స్తుతికలుగును గాక!" ఈలాగు యోబువలె మనమును స్తుతి చేయవలెను. సమర్పణ చేయవలెను.

1) సహింపు<br>2) ప్రార్థన } బహుమానము<br>3) స్తుతి

శ్రమలు ఈ ప్రపంచములో మాత్రముండును. అయితే వాటికి గొప్ప బహుమానముండును, సహాయముకూడ దొరుకును.

1) శ్రమలు వచ్చినప్పుడు ప్రభువు తీసివేయగలరు.

2) శ్రమలు వచ్చినప్పుడు ఒక్కోసారి ప్రభువు తీసివేయరు గాని శక్తి అనుగ్రహిస్తారు.

బబులోనులో నెబుకద్నెజరు కథ: షద్రకు, మేషాకు, అబెద్నెగో అను వారికి ఆయన శ్రమ తీసివేయలేదు. పడ్డవారెందరు? ముగ్గురు. కనబడ్డవారు ఎందరు? నలుగురు. అనగా ఒక్కరు ఎక్స్ట్రాగా (అదనముగా) కనబడ్డారు.

'అగ్నిని కలుగజేసిన సృష్టికర్తే, అగ్నిని సృష్టించిన సృష్టికర్తే దగ్గర ఉంటే, అగ్ని ఏమియు చేయలేదు. అగ్నివంటి శ్రమలో గొప్ప కాపుదల ఉన్నది. మా దేవుడు తప్పించ గలవాడు. అయితే, ఒకవేళ ఆయన తప్పించడా! అదీ మా భాగ్యమే' అని వారు చెప్పిరి. అధికమైన శ్రమలు వస్తే అదికూడ ఆయన తప్పించగలరు.

సహించే దానికంటే ఎక్కువ శ్రమ రానివ్వడు. ***ఒకవేళ సహించలేని శ్రమ రానిస్తే, దానికి మించిన గొప్ప ఉపకారము కూడ రానివ్వగలడు.***

పౌలుకు శరీరంలో ఉన్న ముల్లు, సాతాను దూత. ప్రభువు– 'నేను తీసివేయను. నీ దగ్గర కృప ఉన్నది' అన్నారు. గనుక మన శ్రమలో ఆయన ఈ రెండు విధముల వర్తించుచున్నారు.

1) శ్రమలో సహింపు దయచేయుట, 2) శ్రమ తీసివేయకుండుట, కృప అనుగ్రహించుట.

ఉదా: ఆరుగురు పిల్లలు ఆడుకొనుచున్నారనుకొనండి. వారి ఎదురుగా తిండి పెట్టితే, నోరూరి చప్పరించుట జరుగును. వారి నోట ఊట వచ్చును. అలాగే మీరు శ్రమ అనుభ విస్తున్నప్పుడు, శ్రమవైపు చూచి మురుస్తూ ఉంటారా! లేక అరుస్తారా? క్రొత్త శ్రమవస్తే క్రొత్త బహుమానము వచ్చును. ***గనుక శ్రమవైపు చూడక, దాని వెంబడి ఉండే బహుమానమును చూచి ఆనందించవలెను.*** కీడు చాటున ప్రభువు పెట్టిన మేలేమిటో, అని ఆనందించవలెను. "*కీడు కేవలముగ కీడంచు భావించి ఖిన్నుడనైపోదునా?... క్రీస్తు దాచిన మేలు చూడకుండగ నుందునా?*"

శ్రమలు అనుభవించండి. దానికి ఆయన అనేక బహుమానములిస్తారు. శ్రమ అనుభవించేవారు ఇది గ్రహించవలెను. వారికి అనేక బహుమానములున్నవి. ***ప్రభువు నేర్పరి, తీర్పరి.*** పిల్లవాడు చింతగింజలు మింగివేసినాడు. ఒక లెంపకాయ, రెండు లెంపకాయలు తల్లి కొట్టినది. ఎందుకు? కక్కివేయుటకు. ఆలాగే పాపం కక్కివేయకపోతే మీరు ప్రభువునకు ***దక్కరు, చిక్కరు, పరలోకమునకెక్కరు.*** దేవుడు ఎప్పుడూ ఎవరిమీదికి శ్రమ పంపరు. అవి మన పాపమువల్ల, అజాగ్రత్తవల్ల వచ్చును. ఎవరికిని ఏవిధమైన శ్రమను రానివ్వరు. ముగ్గురు మనుష్యులను పడవేసినపుడు దేవుడు తప్పించినారా? లేదా! ఆలాగే మన శ్రమలనుండి కూడ మనలను తప్పించి, రక్షించి, కాపాడవలెనని ఆయన కోరుచున్నారు. అట్టి స్థితి ప్రభువు మీకు అందించును గాక. ఆమేన్.

# ఆది క్రైస్తవ సంఘము - హింసలు

క్రైస్తవ మతము వచ్చి దాదాపు రెండువేల సం॥లు అయినది. ఈ మతములోనున్న వారికి మేళ్ళు గలవు, కష్టములు కూడ గలవు. ఆది క్రైస్తవులకు బోధచేయవద్దని మత విరోధులు, గవర్నమెంటువారు చెప్పిరి. గాని వారు మానలేదు. అందువలన ఖైదు అనుభవించిరి. **వారిని ఖైదులో నుంచినను మతము ఖైదులో లేదు.** మతము బయటికి వచ్చి, ఇప్పటివరకు నడిచివచ్చెను. అన్ని దేశములకు వ్యాపించెను. ఆది క్రైస్తవులకు ఎన్నో హింసలు కలిగెను. వారిని రకరకములైన బాధలు పెట్టిరి. నరుకుట, కొట్టుట, కాల్చుట మొ॥వి. అప్పుడు వారు పొరుగు దేశములకు పారిపోయిరి. ఇతర దేశములకు బోధచేయుటకు వెళ్ళలేదు. గాని హింసల వలన వెళ్ళిపోయిరి. అయితే ఆ దేశములవారు– మీరు ఎందుకు ఈ దేశము వచ్చినారని అడిగినప్పుడు, బోధ చెప్పుచుండగా మమ్మును హింసపెట్టిరి. అందుకనే వచ్చివేసినామని చెప్పిరి. ఆలాగు అక్కడకూడ ఆ బోధ చెప్పిరి. ***వారు పారిపోయిరి గాని మతము పారిపోలేదు.*** ఎందుకు వచ్చివేసినారని అడిగినప్పుడు కారణము చెప్పిరి. అదే బోధ ఆయెను. దయ్యము ఒకటి తలంచును. దేవుడు మరొకటి చేయును. దయ్యము వారిని హింసల కప్పగించుట వలన మతము ఆపుచేయ జూచెను గాని, వారు అన్ని దేశములకు చెదిరిపోయి, వాక్యము అంతటను ప్రకటించిరి. క్రైస్తవమత విరోధులు 'బోధ వద్దు' అన్నారు, 'ప్రార్థనకూడ చేయకూడదు' అన్నారు. ప్రార్థన ఎవరును వినరు. అయితే, ఎవరిగదిలో వారే చేసికొనినను, వద్దు అన్నారు. 'ఊరిలో ప్రార్థన చేయవద్దు' అన్నారు. అప్పుడు శ్మశానములోనికి వెళ్ళి ప్రార్థనలు పెట్టుకొనిరి. అక్కడ కూడ చేయవద్దని వారిని కొట్టిరి. అప్పుడు వారు కొండలలోనికి, గుహలలోనికి వెళ్ళి, ప్రార్థనలు చేసికొనిరి. ***ప్రార్థనపని, బోధపని వారు మానలేదు.*** రాజుగారు క్రైస్తవుల నందరిని చంపుటకు ఆజ్ఞాపింపగా వారు పాటలు పాడిరి. 'పాడవద్దు' అని చెప్పినను ఆపుచేయలేదు. ఆ కీర్తనలకు చక్రవర్తి, ఇతరులు కలసి, క్రైస్తవులను కత్తితో నరుకుటకు వరుసగా నిలువబెట్టిరి. ప్రజలు చుట్టు ఉన్నారు. నరుకుచుండగా వారేమియు మాట్లాడుటలేదు. **వారికేదో భాగ్యము కనబడుచున్నదని చూచుచున్నవారు అనుకొని,** మేముకూడ క్రైస్తవులము అని చెప్పి చంపబడుటకు వరుసలో నిలువబడుచుండిరి. ఈలాగు క్రైస్తవులు ఎక్కువగుచుండగా ఇక చంపలేమని చక్రవర్తి చెప్పిరి.

చక్రవర్తియు, మంత్రులును నరికేవారిని పిలిపించి, 'వీరు ఎక్కువగుచున్నారు' అని ఒక ఆలోచన చేసిరి: "ఊరి మధ్య ఒక విగ్రహము నిలువబెట్టి, అందరు ఆ దేవత పేరు చెప్పి సాంబ్రాణి పొడుము నిప్పులో వేయవలెను. 'మీరు క్రీస్తునే పూజించుకొండి, ప్రార్థించు కొనండి గాని పొడుము మాత్రము నిప్పులో వేయండి, చావు తప్పును' అని చాటించిరి. కొందరు క్రైస్తవులు పొడుములో ఏముంది? ప్రభువునే ప్రార్థించుకొందుము గనుక పొడుము మాత్రము వేయుదమనిరి. పొడుము వేసినంత మాత్రమున పూజ చేస్తామా? దానికి నమస్కారము చేయుమని చెప్పలేదు కదా! మరలవచ్చి యేసు ప్రభువునే ప్రార్థన చేయవచ్చుననిరి. కొందరు– ఇదంతా

మాయ! ఆలాగు పొడుము వేయకూడదు అనిరి. ఇట్లు వారిలో వారు రెండు భాగములైరి. గనుక ఏది వచ్చినను, ప్రభువు పక్షముగా కొందరు నిలిచిరి. కష్టములలో మానవునియొక్క స్థిరత తెలిసికొన వచ్చును. **హింసలలోనే, అసలు క్రైస్తవులెవరైనది తెలియును.** ఆదికాల క్రైస్తవులు హింసలకు వెరవని వారు గనుక ఇంతవరకు ఆ మతము వచ్చెను. మరియు 'రంగ స్థలములలో' అందరు కూర్చొని, మధ్యను క్రైస్తవులనుంచి క్రూరమృగములను వారిపైకి విడిచిరి. అవి వారిని చీల్చి చంపెను. ఒక భక్తుడు అట్లు చంపబడుచుండగా ఇట్లు పలికెను: *'నేను గోధుమగింజను, సింహపునోరు తిరుగలి. దాని నోటిలో పడి నేను పిండి అగుదును. ఆ పిండి పరలోకము వెళ్ళును. అక్కడ ప్రభువు రొట్టె కాల్చుకొని తినును'* అని సంతోషించెను. క్రీస్తు ప్రభువు మా కొరకు అన్ని కష్టములు అనుభవించెను. మేము ఆయన కొరకు కష్టపడవద్దా! అని వారు సంతోషముతో శ్రమలు అనుభవించిరి. *"అప్పుడు ప్రభువు వంతు; ఇప్పుడు మా వంతు"* అని వారు శ్రమలకు ఎదురు వెళ్ళిరి.

ఆది క్రైస్తవులు పొందిన రకరకములైన శ్రమలు: 1. కొందరికి తారుపూసి నిప్పు అంటించిరి. 2. కొందరిని ఇరుకు సంచులలో దూర్చి వేసి దొర్లించిరి. 3. అగ్నిలోవేసి కాల్చిరి. 4. కర్రలకు కట్టి, కట్టెలుపేర్చి నిప్పు అంటించిరి. 5. తల్లి దండ్రుల ఎదుట బిడ్డలను కాల్చిరి. 6. **చర్మము ఒలిచి, కాల్చిన రేకులపై పరుండబెట్టిరి.** 7. రంగ స్థలములలో క్రూరమృగములకు వేసిరి. 8. కొండమీద నుండి క్రిందికి పడద్రోసిరి. 9. బల్లెములతో పొడిచిరి. ఇంకా అనేక రకములైన శ్రమలు అనుభవించిరి. 10. వాదము. పైవన్ని లెక్కచేయక పోయినను వాదము పెట్టి ఓడింతురు. గనుక ఇదే ముఖ్యమైనది. ఎందుకనగా సైతాను, యేసు ప్రభువును శోధించుటకు వాదమునే వాడెను. ఇది కత్తివాతవలె భయపెట్టదుగాని కత్తి శోధనకంటే ఇదే గొప్పది. హెబ్రీ 11అధ్యాయము చివరి వచనము. "వీరందరు తమ విశ్వాసము ద్వారా సాక్ష్యము పొందిన వారైనను...... వీరు వాగ్దాన ఫలము అనుభవింపలేదు". ఎందుకు ఈ తిప్పలు అని అడుగగా, 'ఈ తిప్పలు పడుట వలన పరలోకములో పప్పులు పెడతారు' అని వారు చెప్పిరి. ఈ శ్రమలు పడిన వారందరు ప్రార్థనచేసి అన్ని కష్టములు అనుభవించిరి. వారు తమ ప్రార్థనయొక్క ఫలితము పొందలేదు. వారు ఈ లోకములోని బహుమానము కొరకు, ఫలితము కొరకు ఆశింపలేదు. ఈ ప్రార్థనలు భూలోకములో నెరవేరిన యెడల ఫలితము తక్కువ గనుక మాకక్కరలేదు అని వారు భావించిరి. పైన పరలోకములో బహుశ్రేష్ఠమైన ఫలితము గలదు. గనుక దానినే వారు ఆశించిరి. వారు శ్రమలద్వారా బహు శ్రేష్ఠమైన పరలోక బహుమానము సంపాదించిరి.

గనుక జబ్బు పోకపోయినను, దయ్యముమీద ఉన్నను, కత్తి, శ్రమ ఏది ఉన్నను– ***ఇవన్నియు నన్ను మోక్షము చేరకుండ చేయలేవు అను గట్టి విశ్వాసము అవసరము. ప్రార్థన:*** *ఓ ప్రభువా! 'ఏమి పోయినను, నీ యందు భక్తి వదలము' అను వ్రతము దయచేయుము. ఆదిక్రైస్తవులలో 'పొడుము పార్టీకి' ఆ వ్రతము లేదు, మిగత వారికి ఉన్నది. ఈ వ్రతము, ఈ మతము, సమ్మతముగా బోధించు కృప బోధకులకు దయచేయుము. ఆమేన్.*

# నక్షత్రములు యుద్ధము చేసెను

*“నక్షత్రములు ఆకాశమునుండి యుద్ధము చేసెను. నక్షత్రములు తమ మార్గములలో నుండి సీసెరాతో యుద్ధము చేసెను” న్యాయాధి. 5:20.*

న్యాయాధిపతుల గ్రంథములోని కథలో నక్షత్రములు యుద్ధము చేసెనని గలదు. దేవుని బిడ్డల పక్షముగా అవి యుద్ధము చేసెను. నీతిమంతుడు ఏ కష్టములో నుండియైనను పైకి రాగలడు. ఎందుకనగా దేవుడు, ఆయన కలుగజేసిన సృష్టి; నీతిమంతుని పక్షముగా నుండును. మన ఆత్మీయ జీవనమునకు కావలసిన పాఠములు ఇందులో నేర్చుకొనవలెను. యుద్ధములో పటాలములు భూమిమీద నుండును. గనుక నక్షత్రములు భూమికి రానిదే ఏలాగు యద్ధము చేయగలవు? జవాబు: అవి తమ మార్గములలో నుండి యుద్ధము చేసెను. క్రైస్తవ జీవితములో యుద్ధము గలదు. పాపము, సైతాను, శోధన, మరణము వీటన్నిటితో మనము యుద్ధము చేయవలెను. ఈ పోరాటములో మనము ఒక్కరమే లేము, గనుక మనకు సహాయము చేయువారు లేరని అనుకొనకూడదు. మనకు సహాయము చేయువారు ఇంకొకరు ఉన్నారు. ఇశ్రాయేలీయులకు నక్షత్రములు సహాయము చేసెను. వారికి ఆ నక్షత్రములు ఏలాగు సహాయపడెనో, మనకుకూడ ఆయన సహాయమిచ్చి యున్నాడు. గనుక మనము ఒంటరిగా యుద్ధము చేయనవసరము లేదు. శత్రువుల పటాలము ఎంత ఎక్కువ ఉన్నను, వారికన్న మన పటాలమే ఎక్కువ. ఇసుక రేణువులంత సైన్యము మనకు కలదు.

చాల చిత్రమైన సంగతి: ఓ క్రైస్తవుడా! నేనొక్కడనే పోరాడుచున్నానని నీవు అనుకొనవద్దు. **నీకు విశ్వాసమున్న యెడల వారు నీకు సహాయము చేయుదురు.** నీకు విశ్వాసము లేకపోయిన యెడల వారు సహాయపడరు. పడిపోయిన యెడల వారు నిన్ను లేవదీయుదురు. పరలోకపు తండ్రి ఏమనును? – ‘*పడిపోయినాడు, చాల గొప్ప దెబ్బ తిన్నాడు, అయినను విశ్వాసమున్నది గనుక లేవదీయండి*’ అని పటాలమును పంపును. మన శత్రువులు వాయు మండలములో నున్నారు. మరియు వారితోపాటు కరవు, పాపము, వ్యాధి మొదలైనవి మనకు ఉన్నవి గనుక వీటిని మనము పరలోక పటాలపు సహాయము లేకుండ జయించలేము. ఇశ్రాయేలీయులకు సహాయకులు ఆకాశ నక్షత్రములు. మనకు సహాయకులు దూతలు. నక్షత్రములవలె, తళుక్కు మనునంతలో వారు మన దగ్గర నుందురు. గాని విశ్వాసము పోయిన, (లేని) వారికి, సహాయము చేయవలెనను ఆర్డరు వారికి ఉండదు. విశ్వాసమున్న యెడల వారువచ్చి లేవదీయుదురు. వారు గొప్ప పటాలము. వారికి మరణభీతి లేదు. మనకుకూడ అట్టి భీతి ఉండకూడదు. ***అపజయము కలిగినను క్రైస్తవునికి భీతి ఉండకూడదు. అపజయము కలిగినను క్రైస్తవునికి భీతి ఉండరాదు.*** ఎన్ని శోధనలు వచ్చినను, నశించిపోదునను భయముండకూడదు. సైతాను మనకన్న బలము కలదైనను, భయముండకూడదు. ఎందుకనగా మన సహాయకులు గొప్పవారై యున్నారు. భూమిమీదనున్న విశ్వాసులకన్నను, దూతలు చాల ఎక్కువ మందియై ఉన్నారు. వారు గొప్ప ఆలోచనాపరులు. క్రైస్తవులు– ‘ఈ’ యుద్ధము చేయుటకును, జయించుటకును; ఈ శోధన, కీడు, శాపము తొలగించుటకును ఎట్లు?’ అని ఆలోచించుచుండగా, ఆత్మ తండ్రి

మనకు గొప్ప ఉపాయము అందించును. ఏమి చేయవలసినది మనకు తోచునట్లుగా చేయును. దూతలు, ఆలోచన లేకుండ శత్రువులమీద పడరు. ఆలోచించి మనకు సహాయ పడుదురు. "యెహోవా సహాయము చేసినాడు. ఆయనను కీర్తించుడి" అనికూడ వాక్యములో గలదు. దూతలు గొప్ప ధైర్యము గలవారు. కోటానుకోట్ల దయ్యములున్నను, ***దూతలకు ధైర్యము గొప్ప వరముగా ఇయ్యబడెను.*** శత్రువుల పటాలము ఎంత పెద్దదైనను, దూతల ముందు వారు నిలువలేరు. ***మనకు విశ్వాస మున్నప్పుడు గొప్ప ధైర్యము కలుగును.*** మనలోనున్న విశ్వాసమును చూచి మన శత్రువులు భయపడుదురు. ధైర్యము లేకపోయిన యెడల శరీర బలమున్నను లాభములేదు. మనలో విశ్వాసమున్న యెడల అవి ఏమియు చేయలేవు. ప్రకటనలో– 'పరలోక పటాలమును చూచి భూలోక పటాలము గజగజ వణకిపోవును' అని గలదు. ఆ పరలోక పటాలము ఇప్పుడు మనకు కనబడదుగాని దాని కళ మాత్రము కనబడును. ***పరలోక పటాలము ఒక్క నిమిషములో మన సహాయమునకు రాగలదు. ఇదే విశ్వాసులకు గల గొప్ప ఆదరణ.*** మన శత్రువులు ఎటువంటి వారనగా, ఇది వరకు ఓడిపోయినవారే. ఎలాగనగా మనకు బదులుగా యేసు ప్రభువు వాటన్నిటిని జయించెను. ఆయన కొరకు కాదుగాని మనకొరకే వాటిని జయించెను. గనుక 'ధైర్యముతో వెళ్ళండి, జయించగలరు' అని ఆయన చెప్పుచుండెను. జయము రాకముందే మనకు జయము ప్రకటింపబడెను. గనుక పుట్టబోయే వారికికూడ ఈ జయమే గలదు.

నక్షత్రములనగానేమి? మొక్కలువేసి వాటి కాపుదలకు కంచెకూడ వేయుదురు. దేవుడు ఆకాశమును, భూమిని సృజించి, సృష్టికంతటికి దూతలను కావలిగానుంచెను. శత్రువు రాకముందే దేవదూతలను కావలిగా నుంచెను. ఈ దూతలు నక్షత్రములను, నదులను, మనలను, చెట్లను, పశువులను కాపాడుచుందురు. ***సృష్టి అంతటిని కాయుటకు దేవుడు కోటానుకోట్ల దూతలను కావలియుంచెను.*** ఈ కావలి దూతలే, ఈ భూమిమీద నున్నవారే ఇశ్రాయేలీయులకు యుద్ధములో సహాయము చేసెను. వీరికి రంగు, కాంతి గలదు. శత్రువుల రంగు చీకటి. మన సహాయకుల రంగు వెలుగు. *వెలుగే జయించును గాని చీకటి గెలువదు.* రోమా 13వ అధ్యాయములో వెలుగు, చీకటిని గురించి గలదు. మరియు నక్షత్రముల సహాయము అనగా సాధారణముగా ఇలా అందురు: *'నెల పొడిచినది గాని లేకపోతే మా పని అయిపోయి ఉండును'* అని అంటారు. చంద్రుడు వీరికేలాగు సహాయపడెనో, నక్షత్రములు ఇశ్రాయేలీయుల కట్లు సహాయపడెను. నక్షత్ర కాంతికి శత్రువులు స్పష్టముగా కనబడిరి. మరియు సృష్టిని కాపాడు దూతకు, (నక్షత్రములు) సహాయము చేసిరి. మనకు యేసు ప్రభువు, దూతలు, పరిశుద్ధులు సహాయము చేతురు. ఇన్ని సహాయములు మనకున్నవి *గనుక విశ్వాసులకు మరణభీతి లేదు.* పెండ్లి కుమార్తెకు మరణభీతి లేదు. అసలు మరణమే లేదు. విశ్వాసులు చనిపోయిన తర్వాత పరలోకములో జ్యోతులవలె ప్రకాశింతురు. నక్షత్రములు ఎక్కడనుండి సహాయపడెను? ఆకాశమునుండి. ఆలాగే విశ్వాసులును, వారెక్కడ నియమింపబడిరో, అక్కడనుండి సహాయము చేయగలరు. అక్కడనుంచి దగ్గరకు వచ్చి కూడ సహాయము చేయగలరు.

***గనుక ఎట్టి ఆపద వచ్చినను విశ్వాసి భయపడవలసిన పనిలేదు.***

# ఆపదల నివృత్తి

యుద్ధములవలన గాని, బాంబుల వలనగాని, మరియే ఇతర శ్రమలవలనైనను శరీరమునకే హాని. అయితే పాపము వలన శరీరమునకును, ప్రాణమునకును, ఆత్మీయ జీవనమునకును హాని కలుగును. ఆపదల నివృత్తిని గూర్చి చెప్పవలసి వచ్చినప్పుడు, కొన్ని గుంపులను గూర్చి చెప్పవలసి యుండును.

**1. మొదటి గుంపు విశ్వాసులు:** దానియేలు 3వ అధ్యాయము. షద్రకు, మేషాకు, అబెద్నెగో అను ముగ్గురు అగ్ని హోత్రము పాలగుటకు ఒప్పుకొన్నారు. వారు భయపడలేదు. 'మా దేవుడు మమ్మును రక్షింపగలడు, ఒకవేళ రక్షింపక పోయినను పరవాలేదు' అని వారు చెప్పిరి. అగ్నిలో చనిపోవుటకును వారు సిద్ధముగా నున్నారు. అయితే దేవుడు వారిని రక్షించెను. ఆలాగే కొందరు విశ్వాసులు యుద్ధములకుగాని, బాంబులకుగాని, భయపడరు. దేవుని చిత్తమైన యెడల, బాంబులవల్ల చనిపోవుటకు కూడ సిద్ధముగా నున్నామని అందురు. మరియు శరీర మరణమునకు జడియరు. ప్రభువు– 'శరీరమును చంపువారికి భయపడవద్దు', 'దేవునికి మాత్రమే భయపడవలెనని' చెప్పెను. విశ్వాసులు– యూదుల యౌవనుల వలె యుద్ధ సమయములలోను, బాంబులకును భయపడరు. తాము పాపము చేసిన యెడల, మోక్షము దొరుకదు అని పాపము చేయుటకు ఆ ముగ్గురు భయపడిరి. హెబ్రీ. 11:35లో కొందరు మరి శ్రేష్టమైన పునరుత్థానము పొందగోరి యాతన పెట్టబడిరి అని గలదు. గనుక ఎట్టి శ్రమలకైనను విశ్వాసులు భయపడరు.

1942 సం॥ము మార్చి 13వ తేదీన బాంబుల సంగతి రాజమండ్రిలో వినబడి గొప్ప ఆందోళన కలిగెను. ఎందువలననగా,దేవునియందు విశ్వాసము లేకపోవుట వలన. విశ్వాసి అయితే "ప్రభువు చిత్తము, తప్పింపక పోయినను సరే" అని భయపడకుండును. **కొందరు ఎన్ని కష్టములు వచ్చినను, 'అన్నియు మేలు కొరకే'** అని పలుకుదురు. **విశ్వాసులకు కీడు అనేది లేదు.** 'బ్రతికినచో ప్రభువు సేవచేయుదును. చనిపోయినచో, మహా గొప్ప మహిమతో దేవదూతలు చేయు సేవ చేయుదును' అనునది విశ్వాసుల వాక్యమై యున్నది. ఆత్మ, పాపము వలన ఈ జీవితములో దేవునికి దూరమైన యెడల అది గొప్ప హాని, అదే కీడు అని విశ్వాసి తలంచును. పాప, మరణముల వలన నిత్య నరకమునకు ఆత్మ పోవుట కీడు అని విశ్వాసికి తెలుసును గనుక పాపమునకు భయపడును. శరీరమునకు, ఆస్థికి, ఘనతకు కలుగు నష్టము దిద్దుబాటునకును, ఆత్మ జీవనాభివృద్ధికిని సహాయ పడునని విశ్వాసి యొక్క అనుభవమై యున్నది. ఏదైనను సరే, మరణమైన సరే, ప్రభువు రక్షించినను సరే, రక్షించకపోయినను సరే! అనువారు మొదటి గుంపు వారైయున్నారు. క్రీస్తు ప్రభువు యెదుటనుండి ఆ గిన్నె తొలగిన మనకు రక్షణలేదు. ఒకానొకప్పుడు విశ్వాసులకు శరీర హాని తప్పదు. ఆ సమయమందు వారు స్తుతి ఎక్కువ చేయుదురు. హత సాక్షులు చంపబడినంత మాత్రమున, అపజయము పొందినారని చెప్పకూడదు. లోకముయొక్క దృష్టిలో వారు అపజయము పొందినట్లు కనబడినను,

దేవుని దృష్టిలో వారు జయమే పొందియున్నారు. అయితే నాశనము కోరుకొనువారిని కూడ దేవుడు ఒకప్పుడు తప్పించును. యోనా నీళ్ళలోపడి మునిగి, నశించుటకు కోరుకొనెను గాని నాశనమైనాడా? లేదు. ఆయన శరీర రీతిగా కూడ రక్షింపబడి, అనేక వేల మందిని రక్షించుటకు కారకుడాయెను. అందువలన దేవునికి మహిమ. బాంబులు పడి క్రైస్తవ విశ్వాసులు ఎందుకు నశించుచున్నారను ప్రశ్నకు ఈ వ్యాసము జవాబైయున్నది. క్రైస్తవులు ఎందుకు బాంబులవలన నశించినారను మరియొక ప్రశ్నకు జవాబు: వారిలో ఏదో ఒక లోపముండుట వలన.

**2. రెండవ గుంపు విశ్వాసులు:** వీరు అపాయము వచ్చినప్పుడు తప్పించుకొనుటకు ప్రయత్నము చేయుదురు. శత్రువులు తరిమినప్పుడు మరియొక గ్రామము వెళ్ళవచ్చునని ప్రభువు చెప్పిన మాటయును (మత్తయి 10:23), దేవదూతలు లోతును తప్పించిన చరిత్రయును వీరికి ఆధారము (ఆది. 19వ అధ్యా॥). తప్పించుకొన వచ్చునుగాని భయపడరాదను సిద్ధాంతము వీరిది. అపాయము నిమిత్తము ప్రార్థనచేసి, తమ ప్రార్థన దేవుడు నెరవేర్చునని నమ్మిుదురు గాని ఆ ప్రార్థనయొక్క నెరవేర్పు నిమిత్తము తాము కూడ ప్రయత్నము చేయుదురు. ఇది ఈ గుంపువారి లక్షణము. శిష్యులు గాలి తుఫానుకు భయపడిరి. గాని ప్రభువు భయపడెనా? ఆయన హాయిగానే, అపాయము లేనట్టే నిద్రించుచుండెను. ఇదే విశ్వాసి నేర్చుకొనవలసిన పాఠము.

**3. మూడవ గుంపు విశ్వాసులు:** "అపాయము నీ యొద్దకు రాదు" (కీర్తన 91:7). వీరు ఈ వాగ్దానము పట్టుకొందురు. అపాయము రాకుండ చేయుమని నేను ప్రార్థించినాను, 'హాని రానివ్వనని' దేవుడు వాక్యములో వ్రాయించినాడు. అది తప్పక నెరవేరునని ఈ గుంపువారు గట్టి పట్టు పట్టుదురు. వీరు ఆపద సమీపించుట చూచి, కూర్చుని బైబిలు విప్పి ప్రార్థనచేసి, మార్కు 11:24తో ముగించి సంతోషముతో నుందురు. అందరికి ఆపదగాని నాకు మాత్రము ఆపద సంభవింపదు అని ప్రచారము చేతురు. ఈ గుంపులోని వారు వాగ్ధానములు పొందుదురు.

**4. నాల్గవ గుంపు విశ్వాసులు:** ఈ గుంపువారు దర్శన జీవితమును వాడుక చేయువారు. వీరు పైమూడు గుంపుల వారి విశ్వాస చరిత్ర మెచ్చుకొందురు. అయినను ప్రభువు దర్శనమందు చూపించునవి చూచుటకును, కనబడి చెప్పునవి వినుటకును కోరుకొందురు. **దేవుని కృపవలన ఇట్టివారు మన బైబిలు మిషనులో కొద్దిగా నున్నారు.** గనుక రాత్రి హాయిగా నిద్రించి, తెల్లవారు జామున 4 గం॥ల నుండి బళ్ళున తెల్లవారు వరకు మోకాళ్ళ మీద ఉండండి. అప్పుడు ప్రభువు కనబడి మాట్లాడును. ***ఈ ప్రకారము చేయకపోయిన దర్శనవరము పోవును.***

**5. ఐదవ గుంపు విశ్వాసులు:** విశ్వాసులను అనుకొనే విశ్వాసులు వీరు. విశ్వాసులను అనుకొని యుండుట మాకు సంతోషము అని అందురు. మాకు దర్శనములు లేవు, ప్రభువు చూచాయగానైన కనబడుటలేదు. కొందరికి వ్రాత కనబడుతుందట, మాకు అది కూడ లేదు. మా కూటములలో దర్శనములున్న వారు గలరు. వారు ఏమి చెప్పుదురో అదే మేము విని, ఆ ప్రకారముగా యుందుము. బాంబులు పడునప్పుడు వారు ఇంటిలోనున్న యెడల మేమును

ఉందుము. వారు పారిపోయిన యెడల మేమును పారిపోవుదుము. “యెహోవా మీ పక్షమున యుద్ధము చేయును, మీరు ఊరకయే యుండవలెను” (నిర్గమ. 14:14) అని దర్శన జీవనముగల మోషే చెప్పినమాట విని, ఇశ్రాయేలీయులు నమ్మి ఎఱ్ఱ సముద్రము అడ్డుబడినారు. అట్టివారే ఈ గుంపులోనివారు. ***గొప్ప గొప్ప విశ్వాసులు కూడ ఈ గుంపులో నుందురు.*** ఆరు లక్షల మందిలో దర్శనవరము పొందినవారు ఇద్దరే గదా! మోషే, అహరోనులు. మిగిలినవారు దర్శనవరము లేకపోయినంత మాత్రమున అవిశ్వాసులని చెప్పకూడదు. దర్శన వరము గలవారు కూడ సహజభీతి కలిగియుండవచ్చును. అది అవిశ్వాసముకాదు. దర్శనములో మహిమ సంగతులు, భయంకరమైన సంగతులు, అసహ్యమైన సంగతులు బయలుపడును. ప్రభువు వాటిని భయపడుటకు చూపించలేదు. అట్టివి కలవని చెప్పుటకు చూపించును. ధైర్యముగలవారు ఎట్టివాటినైనను చూచి తెలిసికొందురు.

**6. ఆరవ గుంపు విశ్వాసులు:** వీరు ‘నడిపింపు’ గుంపు విశ్వాసులు. అనగా ప్రభువు మమ్ములను ఏలాగు నడిపించిన ఆలాగు నడుస్తాము అని చెప్పే గుంపు. వీరికి దర్శనములు ఉండవు. గాని దేవుడు వారిని చక్కగా నడిపించును. ఎట్లనగా, రేపు బాంబులు పడుననగా ఈ దినము ‘పలానివారు జబ్బుగా నున్నారు, వెంటనే రమ్మని’ ఉత్తరము వచ్చును. నీవు బయలుదేరి వెళ్ళుదువు. తర్వాత బాంబులు పడి అనేకులు నశింతురు. నీవు తప్పింపబడుదువు.

## శ్రమలువచ్చు విధములు - వాటి వలన కలుగు లాభములు

**శ్రమలు వచ్చు విధములు:**

1. ఇతరుల వలన వచ్చు శ్రమలు: ఆదాము, ఆకాను.
2. స్వంత పాపముల వలన వచ్చు శ్రమలు.
3. బంధువుల వలన వచ్చు శ్రమలు.
4. దుర్మార్గుల వలన వచ్చు శ్రమలు.
5. సైతాను వలన వచ్చు శ్రమలు.

**శ్రమలవలన కలుగు లాభములు:**

*1.* మనలను మనకు చూపించును.
*2.* మనలను ఇతరులకు బైలుపర్చును.
*3.* పాపమునుండి మళ్ళించును.
*4.* ఆదరణ కలుగజేయును.
*5.* సైతాను వలన వచ్చు అన్నిటిపైన జయమిచ్చును.
*6.* ఓపిక నిచ్చును.

# లేని రాని పాట

**ప్రశ్న:-** పెండ్లికుమార్తె వరుసలోనికి వెళ్ళదగిన వారెవరు?

***జవాబు:*** ఈ ప్రశ్నకు ఇదివరకు ఎన్నియో సమాధానములు చెప్పబడియున్నవి. అయినను దీనికి కొన్ని క్రొత్త సమాధానములు తెలిసికొనవలెను.

అవి ఏవనగా: ప్రస్తుతము మీకు కలిగియున్న చిక్కులు, శ్రమలు, నిందలు, ఇబ్బందులు, భీతులు మున్నగు ప్రశ్నల జాబితాలన్నియు నొక పత్రముపై వ్రాసికొనండి. ఒక్కొక్క దానిని గురించి తండ్రిని స్తుతించండి.

*స్తుతించునపుడు మీ మనస్సులలో గమనించ వలసిన విషయములివి.*

1) తండ్రీ! నా లోపములను బట్టియే ఇవి అన్నియు నాకు కలిగినవి.

2) దేవా! కేవలము నీవు నాయందు మహిమ పరచబడుటకై, నీ మహిమ వలననే శ్రమలు వచ్చినవి. కాబట్టి నీకు స్తోత్రములు.

3) ఏ విధముగా శ్రమలు వచ్చినను, అవి నీ సెలవుపైననే వచ్చును. వీటన్నిటికి ఒక మిష యున్నది. అనగా నొక్కొక్క శ్రమకు, ఒక్కొక్క పని యున్నది. ఆ పని పూర్తికాక పూర్వము లేక ఆ శ్రమ తొలగక పూర్వము అది మమ్మును విడనాడి పోదని మాకు తెలియును. కాబట్టి నీకు నమస్కారములు.

4) ప్రతి దానివలన మాకు మేలు కలుగవలెనని నీవు ఆజ్ఞాపించుచున్నావని మేము గ్రహించుకొనుచున్నాము. గనుక నీకు ప్రణుతులు.

5) ప్రతి శ్రమవలన నీకు (దానివలన కాదుగాని), అనగా వాని మిషమీద మా ద్వారా నీకు మహిమ రావలెనని, నీ యుద్దేశ్యమై యున్నదని మేము గ్రహించు కొనుచున్నాము. కాబట్టి నీకు స్తుతులు.

6) ఈ శ్రమవలన మేము విసుగుచెందక ఆనందించుటవలనను, నిన్ను స్తుతించుట వలనను, ఇతరులు మమ్మును చూచి, మా వలన మంచి పాఠములను నేర్చుకొందురని మాకిట్టి శ్రమలను కల్పించుచున్నావు. గనుక నీకు వినుతులు.

7) మాకు కలిగిన శ్రమలలో మేము నిన్ను స్తుతించుచుండగా, పిశాచి మరియు దాని అనుచరులు చూచి, సిగ్గుపడి ముఖములను వాల్చుకొని, హడలిపోయి పారిపోవలెనని, ఈ శ్రమలను కల్పించుచున్నావు. గనుక నీకు స్తోత్రములు.

8) ఈ శ్రమవలన మేము నూతనానుభవమును, విశ్వాసాభివృద్ధిని పొంది, నీ ప్రేమయొక్క ప్రత్యక్షతను చూడవలెనని నీవిట్టి శ్రమలను కల్పించుచున్నావు (లూకా 22:28-30) గనుక నీకు నమస్కారములు.

9) ఇన్ని విధములైన శ్రమల ననుభవించు చున్నందువలన, ఇహలోకములో నొక అమూల్యమైన అనుభవమును, బహుమానమును పొందుట మాత్రమేకాక, పరలోకములో

నీవనుగ్రహించు బహుమానమును బొందుటకే, నీవు మాకు శ్రమలను కల్పించుచుంటివి (1పేతురు. 4:12-13) గనుక నీకు ప్రణుతులు.

10) ఇట్టి శ్రమలను సహించువారము మేమొక్కరమే కాదు. మాతో చాలామంది జత కలిసియున్నారు. పూర్వకాలమున శ్రమల ననుభవించిన వారును, ప్రస్తుత కాలములో శ్రమల ననుభవించుచున్న వారును, ఇంకను అనుభవింప వలసియున్న వారును మాకు జతగాయున్నారు. మేమొక్కరమేయని అనుకొనక, దిగులుపడక, మహాధైర్యముతో నుండుటకే, ఇంతమందిని శ్రమల లోనికి రప్పించుచున్నావు (I పేతురు 5:9,10). గనుక నీకు మంగళ స్తోత్రములు.

మా యెడల నీవు చూపుచున్న కృపలలో నిది యొకటి.

11) మాకన్న ముందుగా పరలోకమునకు వెళ్ళిన యొక జనసమూహ మున్నది. వారు గడిచి గట్టెక్కినవారు. గనుక వారిని ఈ శ్రమలేమియు చేయజాలవు. కాబట్టివారు నిత్యము నిన్ను స్తుతించుచున్నారు. మేమో! శ్రమల లోపలఉండి నిన్ను స్తుతించుచున్నాము. వారి స్తుతికిని, మా స్తుతికిని చాల బేధమున్నది. ఒక గదిలో నున్నవారు (పాటలో) పల్లవి పాడినచో, రెండవ గదిలోని వారు అందుకొందురుగదా! అట్లే శ్రమలలోనున్న మనము స్తుతి గానము చేయుచున్న యెడల, శ్రమల సరిహద్దునకు అవతలనున్న వారందుకొని పాడుదురు. శ్రమలో ఉన్న స్తుతులను మనము అందుకొని పాడుచుండగా, వారు అనగా శ్రమల సరిహద్దున కవతల నున్నవారు, మన స్తుతుల నందుకొని పాడుదురు. తండ్రీ! మాకిట్టి భాగ్యము కలుగు నిమిత్తమై నీవు మాకు శ్రమలను కల్పన చేయుచున్నావు. కాబట్టి నీకు స్తోత్రములు. *'శోధన సహించువాడు ధన్యుడు; అతడు శోధనకు నిలిచినవాడై, ప్రభువు తన్ను ప్రేమించువారికి వాగ్దానముచేసిన జీవకిరీటము పొందును'* (యాకోబు 1:12).

12) దేవా! నిన్నాశ్రయించెడి వారిలో కొందరిని శ్రమలలో ఉంచి రక్షించెదవు. మరికొందరిని శ్రమలలోనుండి రక్షించెదవు. మరికొందరిని శ్రమలు లేకుండజేసి రక్షించెదవు. కాబట్టి నీకు స్తోత్రములు.

ప్రభువునందు ప్రియులారా! రేపు కలుగనైయున్న గొప్ప శ్రమారంభమునకు ముందు, ప్రభువు మేఘముమీద వచ్చి, పెండ్లికుమార్తెను తీసికొని వెళ్ళును.

***షరా:*** 1. పై నుదహరించిన వాటినిబట్టి ఎవరు మోకరించి స్తుతి చేసెదరో, వారి ఆత్మలకు **ఆనందకరమైన పాట** పరలోక వాస్తవ్యులచే అందింపబడును. ఇది మిక్కిలి గొప్ప అనుభవము. అందరును పొందవలసినది.

2. ఒకప్పుడు శ్రమలను తీసివేయుమని ఎంత మొరపెట్టినను, అవి తీసివేయబడవు. ఇది యొక రకమైన కృప. నా కృప నీకు చాలును (II కొరింథీ. 12:9).

***ఈ పాట మన మెరుగని రాగము గలది. మన మెరుగని సంగతి కలది.***

# భవిష్యత్తు

భూ గోళ వాస్తవ్యులైన సహకారులారా! నేడు అనగా (2003) ఆపత్కాల సమయము గనుక ఇది తప్పించుకొనగల శక్తి మీకు కలుగునుగాక! మా బైబిలు మిషనులోని కొందరికి వచ్చిన దర్శనముల సందేశము వినండి. క్రీస్తు ప్రభువు ఇట్లు చెప్పుచున్నారు. "మిగుల త్వరలోనే లోకమంతటను భయంకరమైన భూకంపము కలుగును, అనేకులు నశింతురు. గాని దైవప్రార్ధనలోను, ధ్యానములోను ఉండువారు ఆ భూకంపమును తప్పించుకొనగలరు." ప్రియులారా! భూకంపమైనను, మరియే ఆపదయైనను పాపము వలననే కలుగును. పాపము మాని పవిత్రులుగా జీవించువారు నిర్భయముగా నుందురు. ఇతర మతస్తులకు కూడ 2003వ సం॥ము భూకంప సం॥రమని, వారికి తోచినది చెప్పుకొనుచున్నారు. అన్ని మతముల వారు సృష్టికర్తను మాత్రమే పట్టుదలతో ప్రతిదినము ప్రార్థింపవలెను. ఇతర పూజలను మానవలెను. తప్పించుకొనగల ఉపాయము కొరకు ప్రార్థించండి. ఎంతమంది ఎన్ని మారులు ప్రార్థించినను, భూకంపము రాకమానదు గాని ప్రార్థనా పరులకు ఇది తప్పిపోవును. ఎంత చెప్పినను నమ్మనివారును, ప్రార్థింపనివారును ఉందురు గనుక భూకంపమును తప్పదు. ఇట్టి భూకంపమును మనుష్యులు ఎరుగరు.

ప్రియులారా! మీరందరు ప్రార్ధనలో ఉండి తప్పించు కొనవలెననియే ఈ పత్రిక వ్రాయుచున్నాము. యేసు ప్రభువు ఈ అంశముమీద మాకు చాల సంగతులు తెలియపరచుచున్నారు. వీలైన యెడల ఎవరైన ఈ సందేశములను అచ్చువేయించిన మాకు ఎంతో సంతోషము. ఈ విషయములు అన్ని భాషలలో పడవలసినదే. ఎవరు ఈ ప్రయత్నము చేయగలరో చూడవలెను. ప్రియులారా! 'భూకంపము జరుగదు. అయినను ఇదంతయు మీకెందుకు?' అని మీరందురేమో! తీరా జరిగినప్పుడు, మీరు చూచి మాకేల చెప్పలేదు? అని మమ్మును అడుగుదురు. జరుగని యెడల నయమేగాని, అప్పుడు మామాట అబద్ధమైనదని మమ్మును హేళన చేయుదురు. కాబట్టి నిశ్చయముగా జరుగునని మనస్సులో అనుకొని, ప్రార్థన చేసినయెడల నష్టమేమున్నదని తెగించి ప్రార్థించండి. ***ఇప్పుడే ప్రార్థింపనియెడల ఆపద్దినమందు ప్రార్థన కుదరనే కుదరదు.*** గాని మాలో తప్పులు పట్టవద్దు. అందువలన మీకు ప్రయోజనమేమియు కలుగదు. సృష్టి దేవుని పక్షము. నరుడు దేవుని ఎదిరించుచున్నందున, వారిని భూమి మ్రింగనైయున్నది. ఈ మధ్య కొన్ని స్థలములలో భూమి వణకినది. ఇది పెద్ద భూకంపమునకు సూచన. మీ స్నేహితులకు ఈలాగున టెలిగ్రాం ఇయ్యగలరా! New Global Earth Quake!! Pray Our Creator for Protection. దేవుడు మీకు అట్టి శ్రద్ధ కలిగించునుగాక! ఆమేన్.

# బైబిలు మిషను వలన పైగా ఏమి మేళ్ళు కలుగును?

వేరు ప్రియునికన్న నీ ప్రియుని విశేషమేమి? అని పరమ గీతములో ఉన్న వచనము ఈ అంశమునకు సంబంధించినదే. అందరి రక్షకుల కంటె క్రీస్తు ఎందులో ఎక్కువ? అన్ని మతములలో క్రీస్తు మతము ఎందులో ఎక్కువ? ***అట్లే అన్ని మిషనులలో బైబిలు మిషను ఎందులో ఎక్కువ?***

1. మొట్టమొదటిది: దైవ గ్రంథమగు 'బైబిలు' పేరు ఇందులో ఉన్నది. ఇది ఒక మేలు: 'బైబిలు మిషను'.

2. ఇతర మిషనులలోను, ముఖ్య మతములలోను ఈ పేరు లేదు. అయితే ఈ మిషనులో 'బైబిలు' అను పేరు మొదట నున్నది. బైబిలు: *1. సమస్త విషయములు మనకు నేర్పించుచున్నది. 2. మనకు ఏ కొదువ లేనట్టియు, సమస్తము కలిగి యున్నట్టియునైన బైబిలు మొదట కనబడు* చున్నది. ఇదియు మేలే. ***ఈ రెండున్నవి గాన, మరొక గుంపులోనికి వెళ్ళుట అవసరము లేదు.***

3. 'బైబిలు స్టాండర్డ్' అనునొక మిషను ఉండవచ్చును. లేక బైబిలు మిషను అనే మరొక మిషను ఉండవచ్చును. గానీ మన మిషనులో *బైబిలు మర్మములను విప్పు వ్యాఖ్యానములు గలవు.* గనుక మన మిషను పేరు ఉన్న మిషనులోనికి మనము వెళ్ళ వలసిన పనిలేదు. ***ఎందుకనగా దీనిని ప్రభువు చెప్పెను.*** ఉదా: జర్మన్‌సిల్వరు (అల్యూమినియం), అసలు సిల్వరు (వెండి) ఒకటియేనా? కాదు. నరుని ఫోటో, నరుడును ఒకటియేనా? కాదు. పరమ గీతములోని తన ప్రియుని వర్ణించినదే ఈ బైబిలు మిషను (ప.గీ. 5:9). ఇమిటేషన్ సిల్కు (పట్టు వస్త్రమువంటి అనుకరణ) అనేమాట ఇక్కడ పనికి వచ్చును. కుక్క వంటి కుక్క, తేలు వంటి తేలు, సిల్కు వంటి సిల్కును తీసికొన్నారు గాని నిజముగా అవికావు.

ఉదా:- ఇంగ్లాండు రాజు ప్రతిరోజు బండిపై పోవుచుండెను. జంక్షన్‌లో ఉన్న పోలీసు, రాజు బండివచ్చునప్పుడు రాజును మర్యాద చేయుచుండెను. ఒకరోజు రాజు బండిలోనుండి దిగి వానిని చూడగా, ఆ నరుడు కదులుట లేదు. అతనిపేరు అడుగగా మాట్లాడలేదు. రాజు ఎన్ని ప్రశ్నలు వేసిన మాట్లాడలేదు. ఎందుకనినా, అది ఒక సోల్జరు (సైనికుని) బొమ్మ. బొమ్మలోను, రాజు బండిలోను ఒక ఆకర్షణ శక్తియుండుటచేత రాజుగారు రాగానే అది కదలును. నరుడు కాదుగాన ఎన్ని ప్రశ్నలు వేసినను మాట్లాడలేదు. ***అట్లే బైబిలు మిషను, దేవుడు చెప్పినది గాన ఇతర మిషనులలో అనేక సంగతులున్నను అవి, దేవుడే స్వయముగా మాట్లాడే బైబిలు మిషనుతో సమానమైనవి గాదు.*** రాజు, ఆ బొమ్మ చేసిన వానిని పిలిచి, మర్యాదచేసి, తగిన బహుమానమును ఇచ్చెను. రాజుగారికి ఆశ్చర్యము కలిగించు కళను సృష్టించి, రాజు దర్శనం పొందుటకై ఒక వ్యక్తి ఆ బొమ్మను చేసెను. గాన మన మిషను వేరు.

రాజుగారి దర్శనం కొరకు ఆ విగ్రహ నిర్మాణకుడు ఒక సోల్జరు బొమ్మను చేసి, రోడ్డు ప్రక్కను పెట్టెను. ఆ బొమ్మ, రాజు బండి వచ్చునప్పటికి సలాం చేసెను. రాజు దిగి అడిగితే

మాటలేమి లేవు. మీరు నిజమైన బైబిలు మిషను వారైతే తప్పక చెప్పవలెను. వారికి నచ్చకపోతే, మన మిషను నెట్లు వదిలిపోవలెను? అని ఆలోచన చేయుదురు. గనుక తప్పక అందరికి నచ్చజెప్పవలెను.

4) మొదటి శతాబ్ధములో దేవుడు స్థాపించిన మతము, క్రైస్తవ సంఘమనే మతము. ఇది అపో॥కార్య॥లో ఉన్నది. ఇది చెట్టువంటిది. దానినుండి క్రమేపి 850 శాఖలు అనగా మిషనులయినవి. దేవుడు, ఇన్ని మిషనులను స్థాపించలేదు. ఇవి తేడా బోధలవల్ల వచ్చెను. ఆదికాండము 11వ అధ్యాయములో ఒక విషయము వెల్లడి అగుచున్నది. అదేదనగా, ఇతర మతములు కూడ క్రైస్తవ మత స్థాపనకు ముందు, దైవ మతము అను పేరుగల మతంలోనుండి వేరైపోయిన నరకల్పిత మతములు. దైవమతములోని షేము సంతానములోనుండి యూదుల మతము వచ్చెను. ఇది దైవ ప్రవచనమును బట్టి వచ్చెను (ఆది. 49:8-12). ఆదాము నుండి షేము వరకు దైవమతము, అక్కడనుండి యేసు ప్రభువు వరకు యూదా మతము. యేసు ప్రభువుతో ప్రారంభమై, చివరివరకు ఉండునది క్రీస్తుమతము. రాకడనుండి అనంతము వరకు వధువు సంఘముండును.

**షరా:-** షేము యొక్క సోదరులైన హాము, యాపేతు అను వారిలోనుండి ఇతర మతములు వచ్చినవి. అవి నరకల్పితములు, ఐనను వాటిలో దైవకళ ఉన్నది. అందుచే క్రైస్తవ మతము లేచి, సర్వజనులకు ఆహ్వానము పంపుచున్నది. ఇవి ఆ ఇద్దరిలోనుండి వచ్చినవి గనుక ఇతర మతములలోని వారెంత బొమ్మల పూజలు చేస్తున్నను, ఆ భగవంతుని స్మరించుటకే అని చెప్పుచున్నారు. ఇదియు దైవకళ గదా! దేవా! అనినను, క్రీస్తూ! అనినను, భగవంతుడా! అనినను, దేవుడే గదా! వారికి క్రీస్తు ప్రభువు తెలియదు, ఒకవేళ తెలిసినను క్రీస్తు పేరు నచ్చకపోతే మొదటి దేవుని పేరెత్తును. భగవంతుడే ఉన్నాడు అనును, మంచిదే గదా!

5) నరకల్పితము మరియు నరుల ఉద్దేశము కాక, దేవుడు వ్రాత మూలముగా మనకు బైలుపరచిన మిషను, బైబిలు మిషను. ఇది స్థాపింపబడినది కాక బైలుపర్చ బడిన మిషను. క్రీస్తు ఎట్లు బైలుపర్చబడెనో అట్లే ఈ మిషను కూడ బైలుపర్చబడెను. గాన బైలు పర్చబడిన బైబిలు మిషను. ***'జ్ఞానియైతే, నేను దేవుడు బైలుపర్చిన మిషను లోనికి వెళ్ళుదును'*** అని పట్టు పట్టును.

*6) బైబిలు మిషనువారు వేయవలసిన పందెము:-*

A) మా మాట ఎవరు నమ్మరో వారు దేవుని ఎందుకు అడుగరు? ఒకవేళ అడిగితే, 'ఆ మిషనులో చేరమంటారు' అని భయపడి అడుగరు. మనము దేవుని అడుగుదుము. 'ప్రభువు ఏమి చెప్పితే అదే చేస్తాము' అందుము (యోహాను 2:5).

B) మరికొందరు బైబిలు మిషన్‌లో ఉన్న కొన్ని సిద్ధాంతములు నచ్చనందున వెనుకకు పోవుదురు.

C) మరికొందరు బైబిలు మిషనులోని కొందరి యొక్క ప్రవర్తనచూచి వెనుకకు పోవుదురు.

D) 'నేను ఎన్ని ప్రార్థనలు చేసినను ఆ మనిషి బ్రతుకలేదు' అని మరికొందరు వెనుకకు పోవుదురు.

E) మరికొందరు, 'తక్కినవారికి వచ్చినట్లు మాకు దర్శనములు రావడంలేదు' అని వెనుకకు పోవుదురు.

F) మరికొందరు, తేడా దర్శనములు వచ్చినవారిని చూచి వెనుకకు వెళ్ళిపోదురు.

G) దర్శనములు వచ్చినవారిలో కొందరికి పిచ్చిపట్టును. అది చూచి కొందరు వెనుకకు పోవుదురు. ఆ పిచ్చితనము వారి స్వంత తప్పునుబట్టి వచ్చును.

H) ఇన్నాళ్ళనుండి అన్ని మిషనులలో ఉన్న భక్తులు, ఈ బైబిలు మిషను లోనికి రాకుండా చనిపోయిరి గదా! గాన –"అందరు రావలెను, రాకపోతే రాకడ భాగ్యంలేదు" అని వీరు చెప్పుట తప్పు సిద్ధాంతము గదా! అని కొందరురారు. తీరావచ్చినా, అభ్యంతరపడి వెనుకకు పోవుదురు. ఒక్కటి బాగా గమనించండి: ***'బైబిలు మిషన్‌లోనికి రాని భక్తులకు రక్షణలేదు' అని బైబిలు మిషన్ బోధించుట లేదు గాని ఆ అనుభవములోనికి రానియెడల రాకడలో పాలులేదు*** అని చెప్పుచున్నది.

I) 'రాకడ ఉన్నది' అని బోధించనివారు ఎత్తబడరా? ఎత్తబడరు. ఎందుకనగా సిద్ధపడలేదు. 'బండి 8గం॥కు వచ్చును' అని దొరగారు అంటే సిద్ధపడలేదు. తీరా బండి వెళ్ళి పోవుచుంటే స్టేషన్‌లో చేరిరి. అప్పుడేలాగున వెళ్ళగలరు? *బాగా చదివితే పాస్ అవుదురుగాని చదువక తోటలలో తిరిగితే, పాస్ అవుతారా?*

J) 'కొందరు రాకడ ఉన్నది' అని బోధిస్తున్నారు గాని 'త్వరగా వస్తాను అని అనినవాడు త్వరగా వచ్చెనా! 20 వందల ఏండ్లకైనా వచ్చెనా?' అని అనుచున్నారు. అట్లనుటనుబట్టి వారు దైవవాక్యమును కొట్టివేయుచున్నారు గాన సిద్ధపడరు, గనుక వెళ్ళరు, ఎత్తబడరు.

**ప్రార్థన:–** మిక్కిలి అవసరమైన బోధలు అందించుచున్న తండ్రీ! నీకు వందనములు. వచ్చిన వారి తైలములను దీవించుము. "100 రెట్లు నన్ను రాకడకు సిద్ధపర్చుము" అను ప్రార్థన వారికిమ్ము. ఆరోగ్యమునకు, రక్షణకు, రాకడకు సిద్ధపడుటకు ఎన్ని అడ్డు ప్రశ్నలు వచ్చినను, లెక్క చేయకుండునట్లు నీ కృప చూపించుము. తండ్రీ! నీవు బైలుపర్చిన బైబిలు మిషనును ఎన్ని గాలి తుఫానులు, ప్రశ్నలు, నాస్తికులు అడ్డము వచ్చినను పడకుండా కాపాడుము. నీవున్న దోనె మునుగదు. గాలి, అలలు వచ్చినను అవి దోనెను ముంచినవా! ***అన్ని మిషనులను, మతములను తెచ్చి ఈ మిషనులో చేర్చుదువు గాని బైబిలు మిషనును వాటిలో కలుపవు.*** లేదా! నీ మిషనును పెరికివేయవు. ఈ రాత్రి మమ్మును కాపాడుము. రాత్రికాల భీతులను నుండి తప్పించి సుఖనిద్ర నిమ్ము. మాకందరికి అనారోగ్య నివారణ, ఆరోగ్య ప్రదానము అనుగ్రహించుము. మమ్మును, మాకున్న వారిని కాపాడుటకై, నీ దూతలను కావలిగా పెట్టుము. కాకానిని, బేతేలు గృహమును, దేవాలయమును, సమాధుల దొడ్డిని, పత్రికల పనిని, ఇట్టి కూటములను, చందాలను అన్నిటిని, సువార్త పనిని దీవించుమని వేడుచున్నాము. ఆమేన్.

# బైబిలు మిషను ప్రత్యేక జీవనము

1. ఎక్కడలేని బోధలు ఇక్కడ ఉండగా మరియొక మిషనులోనికి గాని, మతములోనికి గాని, స్వంత ఏర్పాట్లలోనికిగాని వెళ్లుట ఎందుకు?
2. ఎక్కడలేని స్వస్థతలు ఇక్కడ ఉండగా ఇతర యాత్రలెందుకు?
3. ఎక్కడలేని ప్రార్థనోపదేశములు ఇక్కడ ఉండగా, ఇతర ప్రయత్నములు ఎందుకు?
4. ***ఎక్కడలేని కీర్తనలు ఇక్కడ ఉండగా 'సినిమా రాగాలు' ఎందుకు?*** వేరొక సంగీతశాలకు పోవుట ఎందుకు? సినిమాకు పోవుటకాదిది, వేరొక మిషనులకు, రాగములకు పోవుట.
5. ఎక్కడలేని పత్రికలు ఇక్కడ ప్రచురమగుచుండగా, ఇంకొక ఆఫీసులోనికి వెళ్ళుట ఎందుకు?
6. ఎక్కడలేని దర్శనములు ఇక్కడ ఉండగా, వేరొక శకునములకు వెళ్ళుట ఎందుకు?
7. ఎక్కడలేని పరలోక భక్తుల సహవాసము, సంభాషణలును ఇక్కడ ఉండగా ***వట్టి స్థలములలో ఉండుట ఎందుకు?*** (పరలోక వాస్తవ్యులు వచ్చుట వట్టిది, దేవుడు కనబడుట వట్టిది, కనబడకపోయిన యెడల మాట్లాడుటకూడ వట్టిది. 'మీరు భూతములతో మాట్లాడుచున్నారను మాట వట్టిది' అని ఇతర మిషనుల వారు ఆక్షేపించుచున్నారు గదా!). ఇట్టి, వట్టిదే అను వట్టి స్థలములలో నుండుట ఎందుకు?
8. నిజమైన వృత్తాంతములును, ఎక్కడా లేనివియు ఇక్కడ ఉండగా, ఏమియు లేని వట్టి స్థలములలోనికి ***దుముకుట ఎందుకు?***
9. దేవుడు బైలుపరచిన బైబిలు మిషను సంగతులు అర్థముకానప్పుడు, దేవుని యొద్దకు వెళ్లి ఆయనను అడగకుండా, ***మరకపడిన జ్ఞానము నొద్దకును, మరకపడిన మనస్సాక్షి నొద్దకును ఆలోచన కొరకు వెళ్లుట ఎందుకు?***

# పెండ్లికుమార్తె విసన కర్ర

## వివరము

**1) విజ్ఞానము :** అనగా రాకడను గూర్చిన సంగతులన్నియు పూర్తిగా తెలుసుకొనుట.

**2) విన్నపము :** ప్రార్థించవలసిన సంగతులన్నియు ప్రార్థించివేయుట.


**3) విశ్వాసము:** ప్రభువు నన్ను పెండ్లికుమార్తె వరుసలోనికి చేర్చుకొనునని నమ్ముట.

**4) విధేయత :** తండ్రి చెప్పిన ప్రకారము యావత్తు చేయుట.

వధువు 'వీ'లు: = వినండి, విచారించండి, విశ్వసించండి, వినిపించండి; అనగా వినిన దానిని, విచారించిన దానిని, విశ్వసించిన దానిని అందరకూ వినిపించండి. ఆయన ఇన్ని 'వీళ్ళు' కల్గించకపోతే, సర్వజనులకు ప్రకటించండనరు.

***వధువు రాగం:*** వధువు జ్ఞానం, మనస్సాక్షి ఒక బెంచీమీద కూర్చున్నాయి. ఇవి అన్నియు ఒక్కటే పాడును. అది **ఉచ్చు**-రాగం; **అచ్చు**-తాళం గనుక మన క్రైస్తవ మతము **హెచ్చు**-అపుడు సైతాను **చచ్చు.**

1. అందరి నిమిత్తము ప్రార్థించవలెను.
2. అందరికి సువార్త ప్రకటించవలెను.
3. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందవలయును.
4. ప్రభువు మన కాలములో వచ్చుచున్నారని నమ్మవలెను.
5. కళంకమేమియు లేకుండ ఉండవలెను.
6. గుర్తులు జరుగుచున్నవని కనిపెట్టవలయును.
7. 'నేను తండ్రికి సమ్మతమే' అని నమ్మవలెను.



# సంపూర్ణ ప్రేమ పతకము

| ఉండవలసినవి | ఉండకూడనివి |
|---|---|
| 1. దీర్ఘకాల సహింపు | 1. మత్సరపడుట |
| 2. దయచూపుట | 2. డంబముగా ప్రవర్తించుట |
| 3. సత్యమందు సంతోషించుట | 3. ఉప్పొంగుట |
| 4. అన్నిటిని తాళుకొనుట | 4. అమర్యాదగా నడచుట |
| 5. అన్నిటిని నమ్ముట | 5. స్వప్రయోజనము కోరుట |
| 6. అన్నిటిని నిరీక్షించుట | 6. త్వరగా కోపపడుట |
| 7. అన్నిటిని ఓర్చుట | 7. అపకారమును మనస్సున ఉంచుకొనుట |
| 8. శాశ్వత కాలముండుట | 8. దుర్నీతిని చూచి సంతోషించుట |

# ఆత్మ పూర్ణులౌటకు మార్గము

*దీనికి ఒక్కటే జవాబు: స్తుతి చేయుటయే*

1. జయము నిమిత్తమై ప్రార్థన చేయవలెను. 2. ఆ తరువాత స్తుతి చేయవలెను.

**ఏలాగనగా:** 1. ఓ దేవా! నేను ఈ శోధనను గెల్చుటవలన, నా విశ్వాసము స్థిరపడి నీకు మహిమ కల్గును. అందుచేతనే దీనిని రానిచ్చినావు కాబట్టి నీకు స్తోత్రములు.

2. మరియు నీవు ఈ శోధనను పంపలేదు కాబట్టి నీకు స్తోత్రములు.

3. పంపలేదు గాన నీవు నా తండ్రివైయున్నావు గాన నీకు స్తోత్రములు.

4. రానిచ్చినావు గాన, నీవు నా ఉపకారివైయున్నావు గాన నీకు స్తోత్రములు.

5. నీ సెలవు లేనిదే సైతాను (ఈ శోధన) పంపలేదు గాన నీకు స్తోత్రములు. అందుచే నీవు రాజువైయున్నావు గాన నీకు స్తోత్రములు.

6. పిశాచికి సెలవు ఇయ్యకపోతే; పిశాచి– 'నాకు స్వతంత్రత గుణము నీవిచ్చినావు కదా!' అనును గాన పిశాచి సెలవడిగినపుడు, నీవు సెలవిచ్చుట న్యాయమే. ఎందుకంటే నీవు న్యాయకర్తవై యున్నావు గాన నీకు స్తోత్రములు.

Bible Mission HQ Guntur

# శోధనను జయించు స్తుతి

1. ఓ దేవా! ఈ శోధన నీవు స్వయముగా పంపలేదు గనుక నీకు స్తోత్రములు. ఈ శోధనను నామీదకు పంపుటకు, సాతాను నీ సెలవు కోరుకొన్నది గనుక నీవు సెలవిచ్చినావు.

2. సాతానుకు నామీద సెలవు ఇవ్వడములో నన్ను నీవు నమ్మి, ఈ శోధనకు సెలవిచ్చిన తండ్రీ! నీకు స్తోత్రములు.

3. నేను జయించవలెనను ఉద్దేశముతో, నా బహుమానము కొరకే ఈ శోధనకు సెలవిచ్చినావు తండ్రీ! నీకు స్తోత్రములు.

4. శోధన పంపడము వేరు, రానివ్వడము వేరు. 'పంపడము' అనే పని సాతాను చేయుచుండగా, సెలవిచ్చి, శోధన రానివ్వడము దేవుడు జరిగించును. గనుక శోధనకు సెలవిచ్చిన తండ్రీ! శోధనను జయించు శక్తికూడ నాకు ఇస్తావు గనుక నీకు స్తోత్రములు.

5. ఈ శోధన మూలముగా నీకు మహిమ, నాకు జయము, సాతానుకు అపజయము కలిగించుటకే ఈ శోధన రానిచ్చినావు గనుక నీకు స్తోత్రములు.

6. ఈ శోధన గొలుసు నీ చేతిలో ఉన్నది. గనుక నీకు స్తోత్రములు. గెత్సేమనే తోటలో, శోధనకాలమందు, నా ప్రభువుమీద పడిన శ్రమలకు సెలవిచ్చిన నీవు ఆయనపని ముగించువరకు ఊరుకొన్నావు గాని, నా ప్రభువు పని పూర్తిగా ముగించగానే పరలోక దూతలను పంపి జయము, బలము అనుగ్రహించిన తండ్రీ! నీకు స్తోత్రములు.

7. శోధన కాలమందు సైతానును నేను జయించునట్లు; ఈ శోధనను జయించు విషయములో, నా పని నేను పూర్తిగా ముగించునట్లు, నీ ఆత్మ చేత నన్ను వెలిగింపుము.

8. గెత్సేమనే తోటలో శోధన కాలమందు, నాప్రభువును, నీ ప్రియకుమారుడునైయున్న ఆయన మనోదృష్టిలో శ్రమలు కనబడుటలేదు. శరీర దృష్టిలో, శ్రమలు కనబడుచున్నవి. మనోదృష్టిలో జయము కనబడుచున్నది. అయితే, శరీర శ్రమలను లెక్కచేయక, నీవనుగ్రహించు జయము తట్టును, మహిమ తట్టును; నా ప్రభువు దృష్టి నిలిపినట్లు, నా మనో దృష్టిని ఈ సమయమందు నీవనుగ్రహించు జయము తట్టు నిలిపి, ఈ శోధనను జయించు శక్తి నాకు అనుగ్రహించిన నీకు స్తోత్రములు.

9. ఈ శోధన నీ మహిమ కొరకు రానిచ్చిన తండ్రీ! నీకు స్తోత్రములు. ఈ శోధన నా జయము నిమిత్తము రానిచ్చిన తండ్రీ! నీకు స్తోత్రములు. ఈ శోధన నా బహుమానము కొరకు రానిచ్చిన తండ్రీ! నీకు స్తోత్రములు.

10. ఈ శోధన ద్వారా, నాకు సాతానుమీద జయము అనుగ్రహించుటకు రానిచ్చిన ప్రభువా, నీకు స్తోత్రములు. శోధన రానిచ్చిన ప్రభువా, నాకు జయమిచ్చుటకు నాయొద్ద నిలువబడియున్న తండ్రీ, నీకు స్తోత్రములు. ఆమేన్.

# నైజపాప నిర్మూలము

ధ్యానపరులారా! సిలువధ్యాన పరులారా! పాలస్తీనా దేశములోని యెరూషలేము పట్టణ సమీపమున ఉన్న, కలువరిగిరిపై మూడు సిలువలు మనకు కనబడుచున్నవి. ఈ చరిత్ర పరిశుద్ధుడైన లూకా వ్రాసిన సువార్త 23వ అ॥లో కనబడుచున్నది. ఈ దినమున ఆ మూడు సిలువల చరిత్ర, మీ అందరి తలంపులలో యున్నది. ఈ ఉదయమున నేను రెండు సిలువలను గూర్చి మాట్లాడుచున్నాను. ఇద్దరు మనుష్యులను గూర్చి మాట్లాడు చున్నాను. అనగా ఒకే మనిషి రెండు స్థితులలో ఉన్నాడు గనుక ఇద్దరనుచున్నాను; గాని ఒకే మనిషి, ఒకే సిలువను గూర్చి మాట్లాడుచున్నాను. ఒకే వ్యక్తిలో ఏకకాలమందు రెండు స్థితులుండును. అందుకే మరి రెండు సిలువలని సంబోధించుచున్నాను. మీ దృష్టిలో ఇక్కడ ఒక మనిషి ఉన్నట్లును, ఆ ప్రక్క ప్రభువు ఉన్నట్లును భావించుకొనండి. ఇప్పుడు ఈ ఇద్దరి విషయము, ఈ రెండు సంగతులు మరువకున్న యెడల, మీరు ఈ దిన వర్తమానము గ్రహింపగలరు. 1. మనిషి 2. యేసు ప్రభువు ఉన్నారు. మానవుని దగ్గర ఒకగది ఉన్నది. ఆ గదే గాక దానిక్రింద మరియొక గదికూడ ఉన్నది. అనగా రెండు గదులు కలవు. అక్కడ యేసు ప్రభువు దగ్గరను యొక గది, దానిక్రింద మరియొక గది కలవు. కాబట్టి ఇక్కడ రెండు గదులు, అక్కడ రెండు గదులు; ఇక్కడ మనిషి, అక్కడ యేసు ప్రభువు ఉన్నారు. ఈ గదుల తలుపులు ఏమనగా సంఘమును, మనిషిని. యేసు ప్రభువును అందులో కనబడతారు. అనగా ఒకవైపున రెండు గదులున్నవి. మరియొక వైపునకూడ రెండు గదులు కలవు.

**1. దుఃఖచరిత్ర:–** పైన ఉదహరించిన రీతిగా మానవుని రెండు గదులలోని మొదటి గదిలో, మానవునియొక్క పాప జీవితము, పాప నైజము కలదు. ఈ రోజు మన పాపమును, పాప నైజమును ఇందులో కనబడును. ఈ పాప నైజమును గూర్చి యేసు ప్రభువు తన మొదటి గదిలో సిలువపై ఉన్నారు. ఈ మానవ పాపి 1. తన నోటితో పాపపు మాటలు పలుకుట మానివేసినందున, ఇప్పుడు ఆ మాటలు పలకనందు వలన మంచివాడే. 2. పాపపు క్రియలు చేయుట కూడ మానివేసెను. కాబట్టి మంచివాడే. గనుక ఈ మానవపాపి ఎంత ధన్యుడు! ***గాని తనలోని నైజము మారలేదు. చింతచెట్టు చచ్చిపోయినను, పులుపు చావదను ఒక సామెతవలె, పాపపు వాక్కు, క్రియలు మానినను, నైజపాప మట్లే అతనిలో యుండిపోయెను.*** గనుక మానవుని దగ్గరనున్న పై గదిలో పాపనైజమున్నది. ఆ గదిలో సింహాసనముపై పాపనైజము కూర్చున్నది. ఈ మొదటి గదిలో పాపపు వాక్కులు, పాపక్రియలు పోయినవి, అయినను మొదటిదైన పాపనైజమున్నది. దీనిని నమ్ముటకు వీలులేదు. ***ఈ నైజమును ఎందుకు నమ్మకూడదనగా ఉండి, ఉండి మాటలలోనికి ఇది వచ్చివేయును. ఎప్పుడో ఒకసారి క్రియలోనికిని వచ్చివేయును.*** అందుచేతనే నైజమును నమ్మరాదు. కాబట్టి మానవుని దగ్గరనున్న పై గదిలో నైజముండిపోయినది. అది దురిత నైజము. అది సింహాసనమెక్కి కూర్చున్నది. ఇక ఈ దురితనైజము, ఆ గద్దె దిగదు, దిగబోదు. చెడ్డమాటలు, క్రియలు దిగవచ్చునుగాని ఈ దురితనైజపు వేరు పాతుకొని పోయినందున


దిగదు. అది ఒక అది గద్దెపై కూర్చున్నది, అనగా మానవ హృదయ సింహాసనముపై కూర్చున్నది. **ఇది చాల విచారకరమైన కథ.** క్రైస్తవులలోను, ఇతరులలో కూడ ఇది యున్నది. కాబట్టి మన మిప్పుడేమి చేయవలెను! ఆ పాప నైజమును క్రిందికి దింపవలయును. బలవంతముగనైనను దింపవలయును. అది మొండికెత్తి దిగనే దిగనని అనును. ఇక గత్యంతరములేక తాను చనిపోవు సమయమందైనా అది దిగవచ్చుననుకొని, మనిషి సంతుష్టిపడును. అయితే, 'నా మాటలలో పాపములేదు, నా క్రియలలో పాపము లేదనే' సంతోషమే విశ్వాసికున్నది గాని తన నైజములో పాపము ఉండిపోయినదని తెలిసికొనడు. **ఆలాగు సంతుష్టి పడుటయే నైజము** గనుక దానిని క్రిందికి దింపవలయును. అది గద్దెపై కూర్చున్నది కాబట్టి దానిని క్రిందికి దింపవలయును. మనిషి ఎంత మంచివాడైనా, అతని నైజము సింహాసనముపైనే యున్నది అనగా అతడింకా ఆ సింహాసనముపైనే ఉన్నాడు. ఇదియే చాల విచారకరమైన దుఃఖచరిత్ర.

**2. గద్దెపై మానవుని ఆనందము:-** ఇక్కడ ఒక ప్రక్క మనిషి, ఇక్కడే మరొక ప్రక్క ప్రభువును ఉన్నారు. మనిషి పాపనైజ సింహాసనముపై ఉండుట చూచి, ప్రభువు సిలువపై ఉన్నారు. మనిషి సింహాసనముపైనను, యేసు ప్రభువు సిలువపైనను ఉన్నారు. మనిషి **తన నైజ సింహాసనముపై కూర్చొని, యేసు ప్రభువును సిలువ ఎక్కించినాడు.** వెనుకటి కథలో (2000 సం॥ల క్రితము జరిగిన చరిత్రలో), దుష్టులు ప్రభువును సిలువపైకి ఎక్కించినట్లు; ఇక్కడ ఇతని దుష్టనైజమే, ప్రభువును సిలువపైకి ఎక్కించినది. ప్రభువు సిలువపై బాధ పడుచున్నారు, మానవుడు గద్దెపై ఆనందించు చున్నాడు. ప్రభువు విచార స్థితిలో నున్నారు. అయితే సింహాసనముపై ఉండే రాజునకు సంతోషమే కదా! సిలువపై నున్న యేసు ప్రభువునకు ఏమి సంతోషము? బాధేకదా! ఈ మనిషి నైజమే ప్రభువును సిలువవేసినది, అనగా ఈ మనిషే యేసు ప్రభువును సిలువ వేసెను. ఇది పూర్వకాలపు నాటిది కాదు. ఈనాడే, ఈ మనిషే సిలువవేయు చున్నాడు. అనగా ***ఈ దినములలో, 'మేము మంచివారము' అని అనుకొనినవారే ప్రభువును సిలువవేయు చుండిరి.*** అనగా మనమే ఆయనను సిలువ నెక్కించినది. మన ఆరాధనలో, ఈ కాలసంఘములో, ఇట్టి పాపనైజము కలవారు ఉన్నయెడల, అట్టివారు తమ నైజపాపపు సింహాసనముపైనుండి దిగి, ప్రభువును తమ హృదయ సింహాసనముపై కూర్చుండ బెట్టవలయును. ఇప్పుడు మొదటి రెండు గదుల చరిత్ర పూర్తియైనది.

నాలో ఏ తప్పు, ఏ పాపము లేదనుకొను వారిలో పాపనైజమున్నదేమో పరీక్షించుకొని, దానినిప్పుడే సింహాసనముపైనుండి దించివేయవలెను. దానిని దించాలని ప్రయత్నించుట ఎందుకనగా, పాపనైజమునకు దిగే శక్తి, స్వభావము లేదు. ***దించివేయాలని మనకు రోజూ ఉన్నా, 'దిగేది లేదు' అని అది దిగదు, దిగబోదు.*** మనము దానిని దించివేయలేము గనుకనే ప్రభువు వచ్చి, దానిని దించివేయుటకు సిలువనెక్కెను.

సిలువయే నీ కిక్కడ గద్దె నా – సిలువయె దాని పై నుండు = సిలువలు
రెండు నిన్ను పై గద్దెకు – సిద్ధము చేయును యుద్ధ సమాప్తి ॥మనో॥

**3. ప్రభువు సిలువపైనుండి దిగి సింహాసన మెక్కుట:-** మనిషి, తనయొక్క రెండవ గదిలో, యేసుప్రభువు యొక్క బోధలవలన, క్రియలవలన తనలోని పాపనైజమును తీసివేసి కొనినాడు. గనుక యేసు ప్రభువు యొక్క బోధ, క్రియల వలన మనిషి తన నైజమును తానే సిలువకు అంటగొట్టి, ***'ఓ పాప నైజమా! నీవు నాకు అక్కరలేదు'*** అని తన నైజాన్ని తానే సిలువ వేసినాడు. ఈ మానవుడు, పై గదిలో యేసు ప్రభువును సిలువవేసెను. రెండవ గదిలో తనను తానే సిలువ వేసికొనెను. పైగదిలో గద్దెపైనున్న తానే, ఈ గదిలో సిలువపైనున్నాడు. కావున తన నైజము ఇక తననేమియు చేయలేదు. రెండవ వరుసలో: మొదటి గదిలో సిలువపైనున్న ప్రభువు, **ఇప్పుడు** క్రిందిగదిలో నున్న సింహాసనముపై కూర్చున్నారు. మొదటి వరుసలోని, మొదటి గదిలో సింహాసనముపైనున్న మనిషి, మారుమనస్సు పొంది రెండవ గదిలో సిలువనెక్కెను గనుక ప్రభువునకు సంతోషము. ప్రభువు, తన మొదటి గదిలో ఉన్న సిలువ సింహాసనము నుండి దిగి, రెండవ గదిలోని అత్యున్నతమైన (హృదయ) సింహాసన మెక్కినారు. పాప క్రియలు, మాటలు, పాప జీవితము, పాప నైజము గల మానవుడు ప్రభువుయొక్క బోధవలన, క్రియలవలన మార్పుచెందెను. అరిమతియియ యోసేపు, కురేనీయుడైన సీమోను అనువారు, కలువరిగిరిలో వ్రేలాడుచున్న ప్రభువును సిలువపైనుండి దించినట్లు, ఈ పాపి తన మార్పు ద్వారా, ప్రభువును సిలువపైనుండి దించి, సింహాసనముపైన కూర్చుండబెట్టెను. మొదటిగదిలో యేసు ప్రభువు సిలువపైన, మనిషి సింహాసనముపైన కలరు. రెండవ గదిలో మనిషి సిలువపైన, ప్రభువు సింహాసనముపైన ఉన్నారు. అనగా మనిషి సిలువనెక్కి, ప్రభువును తన సింహాసన మెక్కించెను..




ఈ నాలుగు గదులు మనిషి జీవితము నుండి ఏరుకొన్నవి. ఆ రెండు గదులకు, ఈ రెండు గదులకు మధ్య కొన్ని ప్రశ్నలున్నవి.

**1వ ప్రశ్న:** *ఓ విశ్వాసీ! నీవెక్కడ ఉన్నావు? పైగదిలో ఉన్న సింహాసనముపైనా లేక క్రింది గదిలో ఉన్న సిలువపైనా?*

**2వ ప్రశ్న:** ఓ విశ్వాసీ! యేసు ప్రభువును సిలువ ఎక్కించినావా? లేక సిలువపై నుండి దించినావా? ఆయనను సిలువపైనుండి దించి, సింహాసన మెక్కించినావా?

Bible Mission HQ Guntur

సిలువపైనుండి ప్రభువును దించినయెడల, ఆయనను సంతోషపరచి గంభీర ఆరాధన చేయుదువు లేదా ఆయనను సిలువనెక్కించి, ఆయనను తృణీకరించెదవు. లూకా సువార్తలో, హేరోదు ప్రభువును తృణీకరించి అపహసించెనని వ్రాయబడి యున్నది. ఈ దినములలో మనము కూడ ప్రభువును అట్లే చేస్తూ ఉన్నామని; ఆలాగు చేయువారికిని, మనకును తెలియక పోవచ్చును. మనకు తెలిసినా తెలియకపోయినా, ఏదో యొక గదిలో మనముండి తీరవలయును గనుక పరీక్షించుకొనవలెను. ***'నేను ఏదో ఒక పొరబాటువలన సింహాసనముపైనుంటే, ప్రభువు సిలువపై నుండును'*** అని గ్రహించుకొనవలెను. అప్పుడు నాలో కాదుగాని, సిలువపైనే ప్రభువుకు చోటు. మన హృదయము సిలువపైనున్న యెడల, ఆయన సింహాసనముపై *యుండును. యేసు ప్రభువు నీ హృదయ సింహాసనముపై యుంటే,* నీవు ఆయన పాదములయొద్ద కూర్చుండి నమస్కారము చేయుదువు. పాపాత్మురాలు యేసు ప్రభువు పాదములయొద్ద కూర్చున్నది. ఇప్పుడు ఆమె ఆయన పాదములయొద్ద పరిశుద్ధురాలుగా ఉన్నది గాని పాపాత్మురాలుగా మాత్రము కాదు. పాపాత్మురాలు పరిశుద్ధురాలైనది. అపరంజిని పోలిన పాదములు గల *ప్రభువు నా హృదయ సింహాసనముపై యుంటే నేను ఎంత ధన్యుడను! ఎంత ధన్యురాలను!* అని సంతోషింప వలయును. ***ఈ వర్తమానము చాలా గొప్పది.*** ఒక ప్రశ్న: ఓ విశ్వాసీ! నీవు నీ పాపములను బట్టి యేసు ప్రభువును సిలువ మీద ఉంచినావా? లేక నీ మారుమనస్సును బట్టి సింహాసనము మీద ఉంచినావా? ఈ దినము మనమందరము ప్రభువుతో, *'ప్రభువా! నీవు నా హృదయములో సింహాసనముపై కూర్చుండుము'* అని చెప్పవలెను.

**ఉదా:** యేసు ప్రభువు తన 12మంది శిష్యులతో మాటలాడుచు, 'మీలో ఒకడు నన్ను అప్పగింపనైయున్నాడని' చెప్పెను. అంతట ఆ శిష్యుల హృదయము గలిబిలియై, ప్రభువా! నేనా?నేనా? అని ఆయనను అడిగిరి. గనుక ఈ దిన ధ్యాన కూటములో,ప్రభువా! నిన్ను సిలువ ఎక్కించేవారు అనేకులు ఈ లోకములో ఉన్నారు, ***అయితే నేను నిన్ను సిలువ నెక్కించుచున్నానా! అని ప్రశ్నించుకొన వలయును.*** అప్పుడు ప్రభువు ఇచ్చు జవాబు బైబిలులో ఉన్నది. ప్రభువు 11 మంది శిష్యుల వైపుచూచి, మీరందరు పవిత్రులేగాని మీలో ఒకడు పవిత్రుడు కాడనెను. ఆలాగే సిలువ ధ్యాన సమయమందు ప్రభువు – మీరందరు పవిత్రులే, మంచివారేగాని ఒక్కడే ఇక్కడ అపవిత్రుడై ఉన్నాడంటే ఎంత సంతోషము! ఒక్కడైయున్న ఆ యూదావంటి వారమై మనమున్న యెడల, అందరి ముందు ప్రభువునకును, తక్కిన వారికిని విచారమే.

యేసు ప్రభువు యెదుట మనిషి తన చెడ్డ నైజము దాచుకొని, దాచుకొని తనంతట తానే బైటపెట్టుకొనును. యూదా తన చెడ్డనైజమును 3½ సం॥లు దాచిపెట్టి, తనంతట తానే బైటపెట్టెను, ఎవరును బయటపెట్టలేదు. యూదాలో నుండి చెడ్డనైజము బైటికి వచ్చినట్లు, ప్రభువులో నుండి మంచి నైజము బయటికి వచ్చెను. యేసు ప్రభువులో గొప్ప ప్రేమ ఉన్నదిగాన దాచుకొనలేక పోయెను. **అనేక వందల పర్యాయములు ఆ ప్రేమ చూపించి, చూపించి**

**చివరకు సిలువపై ఆ ప్రేమను సంపూర్ణముగ చూపించెను.** అప్పుడు పాపి ప్రభువు దగ్గరకు వచ్చి, ప్రభువా! నీవు ఎంత ప్రేమగలవాడవో ఇప్పుడు తెలిసినది. పాత నిబంధనలో నీ ప్రేమ తెలిసినది గాని ఇంత ప్రేమయని అప్పుడు తెలియలేదు, ఇప్పుడు బాగా తెలిసినది. *'నీ ప్రేమ అంతా, నీ రక్తమంతా, నీ శరీరమంతా నాకొరకే ధారపోసినావు'* అని అనును. ఈ ప్రకారముగా నీ ప్రేమ అంతా, దాచుకొనక బయటపెట్టి, అందరికిని చూపించినావని స్తుతించును. ప్రభువు సిలువ నేలకు తాపడము చేయబడక, పైకెత్తి చూపించబడెను. యేసు ప్రభువు యొక్క సిలువ ఏ రీతిగా పైకెత్తి చూపించబడినదో, అలాగే ఇప్పుడును ఆయన ప్రేమ, శరీరము, రక్తము పైకెత్తబడి చూపింపబడుచున్నవి. ఆయన మన నిమిత్తము తన జీవనమంతా ధారపోసినాడు. ఈ దినము 3 గం॥ల వరకు ధ్యానంలో ఉండండి. అట్టి ప్రభువు విషయము ధ్యానించండి. దేవుడు మిమ్మును దీవించును గాక! ఆమేన్.

# ప్రార్థన పట్టు

**"దేవుడు, తాను ఏర్పరచుకొనినవారు దివారాత్రులు తన్ను గూర్చి మొర్ర పెట్టుకొను చుండగా వారికి న్యాయము తీర్చడా?" లూకా 18:7.**

చదువరులారా! పట్టులేనిదే ఏపని అయినను నెరవేరునా? నెరవేరదు. గనుక మీ కోరికలు దేవునికి చెప్పుకొని ప్రార్థించుటయందును; ప్రార్థించినవి నెరవేరునని నమ్ముట యందును, తీవ్రముగా నమ్మి పట్టుదల కలిగి యుండవలెను. అప్పుడు మీ మనవులు నెరవేరును. ఒక సింహము చీమగా మారవలసి వచ్చినప్పుడు ఎంత కష్టము! ఎంత అసాధ్యము! నిజముగా అట్లు జరిగిన యెడల అద్భుతమే. దేవుడు మనుష్యుడగుట ఎంత కష్టమైనపని! అది ఎంత అసాధ్యమైన పనియైనను మనతో నుండుటకును, మన విషయమై సమస్త కార్యములు చేయుటకును, ఈ విధముగా మనకు కనబడుటకును, మనతో మాట్లాడుటకును నిశ్చయించుకొని ఆయన మనుష్యుడైనాడు. మనము పేర్లు పెట్టుకొను రీతిగానే, ఆయనను అందరు పిలుచుటకు వీలుగానుండునట్లు, 'యేసు' అను పేరు పెట్టుకొన్నాడు. ఆయన మన నిమిత్తమై బోధించి, శ్రమ అనుభవించి, ప్రాణము బలిచేసి, చెడుగును గెలిచి, మరణమునుకూడ గెలిచి, పరలోకమున కేగెను. ఇంత గొప్ప పనిచేసిన ఈ దేవమానవుడు మనకు ఏ పని చేసిపెట్టడు! ఏ మనవి విడువడు!! ఏ కోరిక నెరవేర్చడు!!!

మనుష్యుని కొరకు దేవుడు మనుష్యుడైన చరిత్ర ఒక్కటే, మీ మనసులో పెట్టుకొని సంతోషముతో మీ ఇష్టము వచ్చినది అడగండి. ***ఆయన మనుష్యుడు గనుక మన మనవి వినుటకు ఇష్టపడును. ఆయన మన దేవుడు కనుక మన మనవి నెరవేర్చుటకు శక్తిగలవాడై యుండును.*** ఇష్టమున్నను, శక్తిలేనివాడైన యెడల మన కోరిక నెరవేర్చలేడు. శక్తియున్నను, ఇష్టములేనియెడల మన కోరిక నెరవేర్చడు. యేసుక్రీస్తు ప్రభువునకు ఇష్టమును, శక్తియును ఉన్నందున ఆయన మన కోరికలన్నియు నెరవేర్చును. కనుక చదువరులారా! మీరు ఏ

మతస్థులైనను, ఎంత గొప్ప పాపులైనను, వ్యాధిగ్రస్థులైనను, ఎంతగొప్ప పేదవారైనను, ఎంతగొప్ప అజ్ఞానులైనను, ఎన్నెన్ని చిక్కులుగలవారైనను, క్రీస్తు ప్రభువును ఆశ్రయించి, నిత్యము ఆయననే పూజించుచు, మీ మనవులు వివరించు కొనండి. నమ్మకము లేకపోయినను ప్రార్థించి చూడండి! *మీరు క్రీస్తును ఆశ్రయించిన తరువాత, ఏ దైవమునైనను ఆశ్రయించినయెడల మీ కోరికలు నెరవేరవు.* మీ కోరికలు ఏమై యుండవలెను? పాప పరిహారము, వ్యాధి పరిహారము, ఇబ్బంది పరిహారము, చిక్కుల పరిహారము మొదలైనవి. నమ్మిక, సంతోషము, ధైర్యము, నిశ్చింత, సుబుద్ధి, సత్యవర్తన, పాప విసర్జన, దైవసేవ అనగా దేవుని విషయమైన సంగతులు ఇతరులకు బోధింపగల సేవ, రక్షణ, నెమ్మదియైన మరణము మొదలైనవి. ఇవికాక ప్రతి దినము నీకు ఏవి అవసరమో, అవి అడిగి అందుకొనవచ్చును. ఆయన అందరి ప్రార్థనలు, అన్ని ప్రార్థనలు ఆలకించును. ఇది ఆయనలోనున్న సంతోషమని గ్రహించుకొనవలెను. ఆయన త్వరలో మీ కోరికలన్నియు నెరవేర్చక, ఆలస్యము చేయును. అప్పుడు చింత, అధైర్యము, దిగులు, భీతి, అనుమానము, విసుగుదల, నిరాశ, ప్రార్థన మానివేయుట, మాకోర్కె నెరవేర్చుట ఆయనకు ఇష్టములేదు కాబోలు' అని అనుకొనుట ***ఈ మొదలైనవన్ని దయ్యములతో సమానము.*** ఈ దయ్యములను మీలోనికి రానియకండి. తేళ్ళను, పాములను మీ ఇంటిలోనికి రానిత్తురా? రానీయరు. *అట్లే వీటినిగూడ రానీయకండి. వచ్చుచున్నను త్రోసివేయుచుండండి. అట్లు త్రోసివేసిన యెడల, వాటిని విసర్జించుటలో మీ పట్టు గట్టిపడును.*

మొదటిది ప్రార్థనవలన కలుగునట్టి పట్టు. అనగా మంచివాటిని అందుకొనుటకు ఏర్పడగల పట్టు. రెండవది అక్కరలేని వాటిని విసర్జించుటకు అవసరమైన పట్టు, ఈ రెండును మీరు కలిగి యుండవలెను. **ప్రార్థింపగా, ప్రార్థింపగా నెరవేరనియెడల, అవలంభింప వలసిన ఉపాయము గలదు. ఒక రోజంతా ఏకాంత స్థలమందు ఉపవాస ప్రార్థనచేసి చూడండి.** అప్పుడు మీకు పట్టు కుదురును. 'ప్రార్థించుటకు సమయము, స్థలము, వీలు దొరకదు. ఏమిచేయవలెనని' కొందరడుగుచున్నారు. నీళ్ళు త్రాగుటకు, అన్నము తినుటకు, తీరికగా కూర్చుండుటకు, నిద్రపోవుటకు అన్నిటికి సమయమున్నది. ***ప్రార్థనకు సమయములేదను వారికి ఏమి సమాధానము చెప్పవలెను! మిషలు, మీ బ్రతుకునకు అడ్డముగా నుండును గనుక తొలగించుకొనండి.*** మీ కష్టములన్నియు ప్రార్థనా పూర్వకముగా క్రీస్తు ప్రభువు యెదుట విదల్చి వేసికొనండి. అప్పుడు మీ మనోభారము అంతరించును. 'ఆయన మీ ప్రార్థన వినును' అని అనుకొనుటయే మీ సంతోషమై యుండును. అప్పుడు కార్యసిద్ధి కలుగును. యేసు ప్రభువు చెప్పిన ఒక ఉపమానము వినండి: భర్త పోయిన ఒక స్త్రీ, న్యాయాధిపతి యొద్దకు మిగుల తరచుగా వెళ్ళి, 'నా కష్టము తీర్చండి' అని ఎంత బ్రతిమాలినను ఆయన గైచేయలేదు (వినలేదు). అయినను ఆమె నిరాశపడక, పట్టినపట్టు విడువక, మరల వెళ్ళి బ్రతిమాలుకున్నందున, ఆ న్యాయాధిపతి ఆమె కష్టము నివారణ చేసెను. చదువరులారా! విన్నారా! చూచినారా! ఆమెలో ఎంత పట్టు ఉన్నదో! మీలో అంతపట్టు ఉన్నయెడల, క్రీస్తు

ప్రభువు మీ కష్టములను పరిహరించును. 'ప్రార్థించండి' అని ఆయనే చెప్పినాడు గనుక మీరు ప్రార్థించిన యెడల ఎందుకు వినడు!!! 'వినడు' అని ఎవరు చెప్పినను నమ్మకుము, నీ మనస్సాక్షి చెప్పినను నమ్మకుము. ఆయన చెప్పినదే నమ్మండి. అప్పుడు మీరు ధన్యులగుదురు. ***మీచేత పట్టుదల ప్రార్థన చేయించుటకే, ఆయనపై ఉపమానము చెప్పెను.*** *దేవుడు మీకు తోడై నిత్యము దీవించుచుండును గాక!*

## తిరస్కరణి విద్య అభ్యసించుటెట్లు

'తిరస్కరణి విద్య' కావలసినవారు శరీరముయొక్క పైభాగము శుద్ధి, అనుదిన స్నానము, అనుదిన వస్త్రశుద్ధి, ఉదర శుద్ధి ఆచరించి, అనుదినము ప్రార్థన చేసినయెడల అట్టి విద్య క్రమముగా వచ్చును. **బైబిలు మిషను వారికి ఇది త్వరగా వచ్చును.** ఎందుచేతనంటే ప్రభువు బైబిలు మిషనును బైలుపర్చినాడు గనుక ఇదికూడా బైలుపర్చగలడు. పరలోకములోని భక్తులను తీసికొని వస్తున్నాడు గనుక ఇది కూడ బైలుపర్చగలడు. సృష్టియంతటిని సన్నిధి కూటమునకు తీసికొని వస్తున్నాడు గనుక ఇదికూడ అనుగ్రహించగలడు. యోహాను 14:14. (*ఇట్టి సంగతులు అనగా గాలిలో ప్రయాణము చేయుట, వంటలేని ఆహార విషయములు మొదలైన సంగతులు, ఇట్లు అనేకములు బెంజిమన్ గారు, అయ్యగారు రాజమండ్రిలోని అయ్యగారి గదిలో మాట్లాడుకొని సంతోషించినారు*). ***'ఇవన్నియు ఎప్పటికైన జరుగకమానవు'*** అని నేను నిశ్చయము చెప్పినాను. ఆయన నమ్మినాడు. అప్పుడే ఇంకొకటి మాట్లాడుకొన్నాము. '*అన్నియు జరుగుతాయి, ఇంకా ఎక్కువ జరుగుతాయి*' గాని ప్రతి దానికి సొలొమోను చెప్పినట్లు సమయముంటుంది. ఇటువంటిది *1) మీకు తెలియడానికి, 2) మీకు అభ్యాసము చేయుటకు, 3) అనుభవించుటకు, 4) ప్రత్యక్షముగా చూచుటకు;* అనగా ఈ నాలుగు నేర్పుటకే ఇట్టి మీటింగులు పెట్టుటకు కారణము.

బరంపురము సన్నిధి కూటస్తులకు ఇవన్నియు తెలుసును. ఆ మీటింగులలో ఉన్నపుడు, ప్రభువు వాటిని గూర్చిన సంగతులు చూచాయగా చెప్పినారు. అప్పుడు అయ్యగారు ఇవన్నియు నాకు ముందే తెలుసును అన్నారు. వారెంతో ఆశ్చర్యపడి ఎంతో సంతోషించిరి గాని అసూయపడలేదు. 'మీరెందుకు ఈ మహిమను దాచిపెట్టినారు' అని వారు కొద్దిగా స్నేహ భావముతో నిందించినారు. 'ఎవరూ నమ్మరు, ఆక్షేపిస్తారు' అని అయ్యగారు వారికి జవాబు చెప్పిరి. బెంజిమన్ గారికిని అదే చెప్పినారు. ***అన్ని మన ద్వారా జరుగుతాయి*** గనుక ఒక్కటే జ్ఞాపకముంచుకొనండి. ఎన్ని అడ్డాలు, కష్టాలు వచ్చినను, చింత అనేది లేకుండ చేసుకొనండి. *చింత ఉన్నయెడల ఇప్పుడు మన తలమీద ఉన్న కిరీటము పరలోకము వెళ్ళిపోవును.* మన విశ్వాసము వల్ల, మనకు తెలియకుండా, మన తలమీద కిరీటముండును. అది చింతవల్ల పరలోకము వెళ్ళిపోవును. ఒక స్త్రీ ప్రభువుకు కిరీటము వేయవలెను. ***వెయ్యేండ్ల పరిపాలన ప్రారంభమందు, క్రీస్తునకు ఒక స్త్రీ కిరీటము వేయవలెను.*** హవ్వ అనే ఒక స్త్రీ వల్ల పాపము

వచ్చినది. మరియ అనే ఒక స్త్రీ వల్ల రక్షకుడు వచ్చినాడు. మూడవ స్త్రీ వలన ప్రభువునకు కిరీటము రావలెను. పురుషులవల్ల కాదు. ఆ స్త్రీ ఎవరు? **ఓ తండ్రీ! లోకములో నేటివరకు ఎన్ని యుద్ధములు జరిగినవో, ఆ అన్ని యుద్ధములకంటె ఎక్కువ కష్టమైన యుద్ధము మేము సైతానుతో చేయవలసియున్నది.** పురుగునకు పురుగునకు, మృగమునకు మృగమునకు, పక్షికి పక్షికి, మనుష్యునకు మనుష్యునకు జరుగు యుద్ధము మేము ఎరుగుదుము. మరియు సైతానుకు దైవజనులకు జరిగే యుద్ధములుకూడ మేము ఎరుగుదుము. దురాత్మలకు, భక్తులకు జరిగే యుద్ధములు మేము ఎరుగుదుము. ప్రతిదినము ఉదయముననే మంచికిని, చెడుగునకు జరుగుచున్న పోరాటము ఎరుగుదుము. అజ్ఞానమునకును, జ్ఞానమునకును యుద్ధము జరుగుట మేము ఎరుగుదుము. ఆలాగే దురాచారమునకును, సదాచారమునకును యుద్ధము జరుగుట మేమెరుగుదుము. అనాచారమునకును, ఆచారమునకును యుద్ధము జరుగుట మేమెరుగుదుము. హర్మగెద్దోనులో జరుగనైయున్న ఘోర యుద్ధము గురించి ప్రకటన గ్రంథములో చదువుకొన్నాము. అలాగే గోగు, మాగోగు యుద్ధము జరుగునని ప్రకటనలోనే చదువుకొన్నాము. ఇవి గాక చిన్న చిన్న చిల్లరి యుద్ధములు ఎన్నిగలవో చెప్పలేము. *అయితే ప్రభువా! చెడుగుతో యుద్ధము చేయుటకు నీవు క్రైస్తవ సంఘములకు నేర్పినావు. పెండ్లి కుమార్తె సంఘమునకును,* చెడుగుతోయుద్ధము చేయ నేర్పినావు. మరియు బైబిలు మిషనుకు, తక్కిన మిషనులకు జరుగవలసిన యుద్ధముకూడ మాకు నేర్పుచున్నావు. గాని అది ఇంకా మాకు పూర్తిగా అబ్బలేదు గనుక నీ కటాక్షాత్మను మామీద కుమ్మరించుము. ఆమేన్.

# 102

# నాయకులకు ఒక సలహా

**1వ సలహా:–** మనము క్రిస్మసురోజున క్రిస్మసు పాటలు పాడుదుము. జనవరి 1వ తారీఖున నూతన సం॥ము పాటలు పాడుదుము. భస్మబుధవారము నుండి ఆరంభమయ్యే శ్రమకాలములో శ్రమకాల పాటలు పాడుదుము, మంచి శుక్రవారము పాడవలసినవి పాడుదుము. పునరుత్థాన దినమున, ఆ రోజుకు సంబంధించిన పాటలు పాడుదురు. గనుక ఏ పండుగరోజున ఆ పాటలు పాడుట విడిచిపెట్టుట మంచిపద్ధతికాదు గాని అన్ని కీర్తనలు పాడు వాడుక అన్నిటిని మించిన పద్ధతియై ఉండును. అనగా ప్రతి మంచిశుక్రవారము రోజున క్రిస్మసుకీర్తన, పునరుత్థాన కీర్తనకూడ పాడాలి. ఆ రోజునే దైవభక్తి వృద్ధి కీర్తనకూడా పాడాలి. అలాగే అన్ని పండుగలలోను అన్ని పండుగలకు సంబంధించిన కీర్తనలు పాడాలి. ఎందుకంటే అన్ని ముఖ్యమే, మన జీవితవృద్ధికి అన్ని ముఖ్యమే. సలహా ఇచ్చాను గనుక పాడితే మంచిదే. షరా:– "అయ్యగారు ఒక పెండ్లికి అన్ని కీర్తనలు పాడించిరి". వారికి కోపము వచ్చినందున నేటివరకు గుడికి వచ్చుట మానివేసిరి.

**2వ సలహా:– "క్రొత్తవారు బైబిలు మిషను కూటములకు వచ్చినప్పుడు బైబిలు మిషనుకు సంబంధించిన కీర్తనలు పాడవలెను"** ఎందుకనగా, మన కీర్తనలు వారు ఎప్పుడు నేర్చుకొందురు? ఇతర మిషను కీర్తనలుకూడ పాడితే తప్పులేదుకాని "క్రొత్తవారు నేర్చుకొనేటందుకు బైబిలు మిషను కీర్తనలు పాడవలెను'. అనగా మనము వారి కీర్తనలు నేర్చుకొనుచున్నాముగానీ వారు మన కీర్తనలు నేర్చుకొనుట లేదుగదా! ఆలాగు వారును మన కీర్తనలు నేర్చుకొనవలెనంటే, మనము మన కీర్తనలనే తప్పక పాడవలెను, వాడుక చేయవలెను".

**3వ సలహా:–** క్రైస్తవమతము అన్ని భాషలకు సంబంధించిన మతము గనుక అన్ని భాషలకు సంబంధించిన కీర్తనలు మనము పాడవలెను. ఈ వేళ ఇంగ్లీషు, రేపు అరవము, ఎల్లుండి కన్నడం, ఓఢ్రం, బెంగాలి భాషలలో కీర్తనలు పాడవలెను. ఆ తర్వాత జర్మనీ భాషలోకూడ ఈ ప్రకారముగానే పాడవలెను. అమెరికాలో అన్ని భాషలు నేర్చుకున్నవారున్నారు. కాబట్టి మనము సమయమునుబట్టి అన్ని భాషలలో సంగతులు నేర్చుకొనుట మంచిది.

**4వ సలహా:–** స్వర్గీయ భాషలోని కీర్తనలు ప్రభువే ఇస్తారు. 'యెహోవ నామొర లాలించెను' అను కీర్తన ఒకరు తెలుగులో పాడుచుంటే, మరొకరు అదే సంగతి స్వర్గీయ భాషలో పాడుదురు.

**5వ సలహా:–** ఇది చాల కష్టము. ఒకరు ఒక భాషలో ఒక కీర్తన పాడితే, మరియొకరు దాని అర్థము మరియొక భాషలో పాడుదురు. ఈ అనుభవమును వాడుక చేయవలెను.

**6వ సలహా:–** 1) భక్తిగల బైబిలు పాఠములు చదువుట, 2) భక్తిగల ఆరాధనలు, 3) భక్తిగల కానుకలు, 4) భక్తిగల మీటింగులు చేయుట;

**దేవుడు మాట్లాడే దర్శనములున్నప్పటికిని ఒకరి ప్రవర్తనను గూర్చి అల్లరిచేయుట ఉన్నా, అన్నీ సున్న.** "నేను నా పరిశుద్ధ రక్తముతో శుద్ధిచేసి, రక్షించుటకై ఎన్నో పాట్లుపడుచుండగా, నీవు ఎందుకు చెడుగును ప్రకటన చేయుదువు? అది నాకెంతో దుఃఖము అని ప్రభువు చెప్పుచున్నారు. మత్తయి 25వ అధ్యాయములో ఎడమ ప్రక్కనున్నవారితో ప్రభువు చెప్పినది: 'నేను నీయొద్దకు వస్తే నీవు నన్ను సత్కరింపలేదు' అన్నారు. నీవు ఎప్పుడు వచ్చినావు ప్రభువా? అని అంటే **'నా సహోదరులలో ఒక్కరిని సత్కరించనప్పుడు, నన్నును సత్కరించనట్టే అనెను.**

# దీవెనల జాబితా

1. పాప ప్రేరేపణ గలవారలారా! దేవుడు మీకు పాప విసర్జన శక్తినిచ్చి మిమ్మును దీవించును గాక!

2. అనారోగ్యవంతులారా! దేవుడు మీకు ఆరోగ్యమిచ్చి మిమ్మును దీవించును గాక!

3. లేమిగల వారలారా! దేవుడు మీకు కలిమినిచ్చి మిమ్మును దీవించును గాక!

4. బిడ్డలులేని వారలారా! దేవుడు మీకు శిశుదానము చేసి మిమ్మును దీవించును గాక!

5. భూత పీడితులారా! దేవుడు మీకు విముక్తిని దయచేసి మిమ్మును దీవించును గాక!

6. మందమతులారా! దేవుడు మీకు నిర్మలమైన జ్ఞానమిచ్చి మిమ్మును దీవించును గాక!

7. శత్రుబాధగల వారలారా! దేవుడు మీకు శత్రు బాధలేకుండా జేసి మిమ్మును దీవించును గాక!

8. అన్యాయము పాలగుచున్న వారలారా! దేవుడు మీకు న్యాయమనుగ్రహించి మిమ్మును దీవించును గాక!

9. ఋణబాధగల వారలారా! దేవుడు మీకు ఋణబాధ తీర్చి మిమ్మును దీవించును గాక!

10. యుక్త సమయమున పెండ్లి సమకూడని వారలారా! దేవుడు మీకు మంచి జత నేర్పరచి మిమ్మును దీవించును గాక!

11. కుటుంబ కలహములుగల వారలారా! దేవుడు మీ కలహములను ఆపుజేసి, ఐకమత్యత కలిగించి మిమ్మును దీవించును గాక!

12. నానా విధములైన చిక్కులు గలవారలారా! దేవుడు మీ చిక్కులను విడదీసి మిమ్మును దీవించును గాక!

13. దైవభక్తి కుదరని వారలారా! దేవుడు మీకు మనో నిదానమును, స్థిరభక్తా వేశమును పుట్టించి మిమ్మును దీవించును గాక!

14. చదువరులారా! దేవుని యెడల అపనమ్మిక, భీతి, విసుగుదల, తొందరపడు గుణము, అనాలోచన, చింత, నిరాశ, మొదలగునవి మీలోనికి చేరకుండునట్లు దేవుడు మిమ్మును దీవించును గాక!

15. జీవాంతమందు మీకు మోక్షభాగ్యము లభించునట్లు దేవుడు మిమ్మును దీవించును గాక! ఆమేన్.

# విషయసూచిక


| క్రమ సంఖ్య | అంశము | | పేజీ. నెం. |
|---|---|---|---|
| 1. | బైబిలు అద్దము | - | 1 |
| 2. | నామకార్ధమనే పాపము | - | 4 |
| 3. | నైజ పాపము | - | 8 |
| 4. | స్వంత ఆత్మ | - | 11 |
| 5. | దైవప్రార్ధన సలహా | - | 13 |
| 6. | దేవుని ప్రార్ధించండి | - | 14 |
| 7. | ప్రార్ధనా పద్ధతి | - | 16 |
| 8. | విశ్వాస ప్రార్ధనయొక్క లక్షణములు | - | 19 |
| 9. | ఇంకొకమారే | - | 21 |
| 10. | ప్రభువు ప్రార్ధన - 1 | - | 22 |
| 11. | ప్రభువు ప్రార్ధన - 2 | - | 27 |
| 12. | ప్రభువు ప్రార్ధనయొక్క విభజన | - | 30 |
| 13. | సమర్పణ ప్రార్ధన ప్రసంగము | - | 31 |
| 14. | స్వార్పణ | - | 33 |
| 15. | ఆదివార ప్రమేయము - 1 | - | 36 |
| 16. | ఆదివార ప్రమేయము - 2 | - | 38 |
| 17. | ఆదివార ప్రమేయము - 3 | - | 40 |
| 18. | ఆదివార ప్రమేయము - 4 | - | 42 |
| 19. | సమృద్ధి జీవనము | - | 44 |
| 20. | విశ్వాస జీవనము | - | 46 |
| 21. | విశ్వాస ప్రభావము | - | 49 |
| 22. | విశ్వాసాభివృద్ధి | - | 52 |
| 23. | విశ్వాసముయొక్క ఒప్పుదల స్తుతి | - | 53 |
| 24. | క్రైస్తవుని స్థిరవిశ్వాసము | - | 54 |
| 25. | స్థిరవిశ్వాస విద్య | - | 55 |
| 26. | విశ్వాస ప్రమాణము | - | 56 |
| 27. | తలుపు వేసికొనుము | - | 58 |

| | | | |
|---|---|---|---|
| 28. | సన్నిధి సూర్యకిరణముల గుంపు | – | 59 |
| 29. | ధ్యానపరుని వృద్ధి - 1 | – | 61 |
| 30. | ధ్యానపరుని వృద్ధి - 2 | – | 63 |
| 31. | మోకాళ్ళ జీవనము | – | 65 |
| 32. | నమ్మకమైన సేవ - 1 | – | 66 |
| 33. | నమ్మకమైన సేవ - 2 | – | 67 |
| 34. | నమ్మకమైన సేవ - 3 | – | 69 |
| 35. | నమ్మకమైన సేవ - 4 | – | 70 |
| 36. | నమ్మకమైన సేవ - 5 | – | 72 |
| 37. | శ్రమజీవి ప్రసంగము | – | 74 |
| 38. | ఆది క్రైస్తవ సంఘము–హింసలు | – | 78 |
| 39. | నక్షత్రములు యుద్ధముచేసెను | – | 80 |
| 40. | ఆపదల నివృత్తి | – | 82 |
| 41. | శ్రమలువచ్చువిధములు–కలుగులాభములు | – | 84 |
| 42. | లేని రాని పాట | – | 85 |
| 43. | భవిష్యత్తు | – | 87 |
| 44. | బైబిలు మిషనువలన పైగా<br>ఏమి మేళ్లు కలుగును | – | 88 |
| 45. | బైబిలు మిషను ప్రత్యేక జీవనము | – | 91 |
| 46. | పెండ్లికుమార్తె విసనకర్ర | – | 91 |
| 47. | సంపూర్ణ ప్రేమపతకము | – | 92 |
| 48. | ఆత్మపూర్ణులౌటకు మార్గము | – | 92 |
| 49. | శోధనను జయించు స్తుతి | – | 93 |
| 50. | నైజపాప నిర్మూలము | – | 94 |
| 51. | ప్రార్థనపట్టు | – | 98 |
| 52. | తిరస్కరణివిద్య అభ్యసించుటెట్లు | – | 100 |
| 53. | నాయకులకు సలహా | – | 102 |
| 54. | దీవెనల జాబితా | – | 103 |

మొదటి ముద్రణ 2004 ప్రతులు 5000

ఇది దేవుడు యం. దేవదాసు అయ్యగారికి బయలుపరచిన

**బైబిలు మిషను ప్రమరణ**

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.
ఫోన్: 0863- 2556644; 2556149.

1. నీవు పాపములు ఎందుకు మానవలెను?

2. నీవు పాపములు ఇంకా ఎందుకు మానవలెను? కారణము హానివచ్చును గనుక మానవలెను.

3. యేసుప్రభువు నీ కొరకు ప్రాణము ధారపోసి రక్తము పోసినాడు గనుక ఆయనకు కృతజ్ఞత చూపుటకుగాను నేను పాపము చేయను.

1. అన్వయించక పోవడము

2. అనుసరించక పోవడము. అది నాకుకాదు. అని మనస్సులో ఏమియు కృతజ్ఞత కలిగియుండకపోవడము.

3. అంగీకరించక పోవడము. అనుసరించక పోవడము. యేసు ప్రభువు అనుసరించుట వెంబడించక పోవడముకూడ కలిగియుండుట.

**1. 2 పాపములు:**

1. దేవునికి విరోధముగా

2. సృష్టికి విరోధముగా

1. దేవునికి విరోధముగా

2. మనుష్యులకు విరోధముగా

1. తెలియకచేసిన పాపము.

2. తెలిసిచేసిన పాపము.

1.చేసిన పాపము

2. క్షమించినప్పటికిని జ్ఞాపకము తెచ్చుకొన్న పాపము.

## రెండుపాపములు

1.చేసి పాపము.

2. మానే పాపము

1. ఆశపెట్టే పాపము

2. ఆశ చూపించే పాపము

1. నీ పాపములు

2. పొలి పాపములు

1. నేరముమోపే పాపములు దేవునిమీద.

2. తనమీద నేరము లేదనుకొను పాపము

1. సరదా పాపము

2. మర్యాదగల పాపము.